

నిష్పక్షపాతం.. సత్యనిష్ఠ..
అంకితభావం..
ప్రజల మేలు కోసం చూపే తెగువ
పత్రికలకు అవశ్యం.

# ఆంధ్రపత్రిక


స్వాతంత్ర్య సమరానికి అక్షరాయుధాలు అందించిన ఏకైక దినపత్రిక - స్థాపితం 1914

విజయవాడ సంపుటి : 60 సంచిక : 18 • పేజీలు : 8 • శుక్రవారం 18 అక్టోబరు 2024 • వెల : రూ. 5.00

Published from : Vijayawada | Visakhapatnam | Srikakulam | Rajahmundry | Kurnool | Guntur | Ongole | Nellore Tirupati


## తదుపరి సిజెఐగా సంజీవ్ ఖన్నా..

- కేంద్రానికి సిఫార్సు చేసిన సిజెఐ డివై చంద్రచూడ్



**న్యూఢిల్లీ,అక్టోబరు 17 :** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ పదవీ కాలం నవంబర్ 10తో ముగియనుంది. దాంతో తన తరువాత సీజేఐగా జస్టిస్ సంజీవ్ ఖన్నా పేరును ఆయన కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించారు. సుప్రీంకోర్టులో మిగతా 7లో

## బాంబు బెదిరింపులపై కేంద్రం సీరియస్



**న్యూఢిల్లీ,అక్టోబరు 17 :** భారత విమానయాన సంస్థలకు చెందిన పలు విమానాలకు గత నాలుగు రోజులుగా వరుస బాంబు బెదిరింపులు రావడంతో పలు విమాన సర్వీసులు రూట్ మార్చడంతోపాటు అత్యవసరంగా ల్యాండింగ్ అవుతున్నాయి. ఇలాంటి పనులు చేసే ఆకతాయిల ఆటకట్టించేందుకు కఠిన చర్యలు తీసుకొనే దిశగా పౌర విమానయానశాఖ సన్నద్ధమవుతున్నట్లు సీనియర్ మిగతా 7లో

## షేక్ హసీనాపై అరెస్ట్ వారెంట్..

- నవంబర్ 18 లోగా ఆమెను అరెస్టు చేయండి



**ఢాకా,అక్టోబరు 17 :** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాపై అరెస్టు వారెంట్ జారీ అయింది. ఆ దేశానికి చెందిన ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ ఈ వారెంట్ ఇచ్చింది. నవంబరు 18లోగా ఆమెను అరెస్టు చేసి తమ ఎదుట హాజరు పరచాలని ఐసీటీ చీఫ్ ప్రాసిక్యూటర్ మహమ్మద్ తజుల్ ఇస్లాం మిగతా 7లో

## ఎపికి నూతన పెట్టుబడులు రావాలి

- ◆ ఎపిలో పెట్టుబడులకు ఇదే మంచి సమయం
- ◆ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు రెడ్‌కార్పెట్ ఆహ్వానం
- ◆ పెట్టుబడిదారులకు ఆంధ్రప్రదేశ్ స్వర్గధామం..
- ◆ ఆంధ్రప్రదేశ్ పూర్తిగా వ్యాపార అనుకూల రాష్ట్రం
- ◆ కొత్త పాలసీ ఫ్రేమ్‌వర్క్ పరిశ్రమ అనుభవజ్ఞులతో రూపొందించాం..
- ◆ వ్యవస్థాపక స్ఫూర్తి, వ్యాపారాలను పెంపొందించడమే లక్ష్యం
- ◆ దేశంలోనే అత్యుత్తమ వ్యాపార అనుకూల వ్యవస్థను నిర్మిస్తున్నాం..
- ◆ వ్యాపార పరిధులు, రాష్ట్ర సామర్థ్యం పరస్పరం విస్తరించుకునే అవకాశమిది..



పెట్టుబడి దారులకు ఎపి సిఎం చంద్రబాబు నాయుడు పిలుపు

**అమరావతి,అక్టోబరు 17 (ఆంధ్రపత్రిక):** పెట్టుబడి దారులకు ఆంధ్రప్రదేశ్ స్వర్గధామం అని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు రెడ్ కార్పెట్ ఆహ్వానమంటూ స్వాగతించారు. ఏపీ ఇప్పుడు కొత్త అత్యుత్తమ విధానాలతో ఆహ్వానం పలుకుతోందన్నారు. ప్రధాని మోదీ అధ్యక్షతన చండీగఢ్‌లో ఎన్డీయే సీఎంల కౌన్సిల్ సమావేశం జరిగింది. ఏపీ నుంచి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, అమిత్‌షా, రాజ్‌నాథ్‌సింగ్ , మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్, గోవా, ఒడిశా, మణిపూర్, మిగతా 7లో

## మరో రైలు ప్రమాదం



- ◆ అసోంలో పట్టాలు తప్పిన లోకమాన్య తిలక్ ఎక్స్‌ప్రెస్
- ◆ ప్రాణాపాయం తప్పడంతో ఊపిరి పీల్చుకున్న అధికారులు
- ◆ ఉన్నతస్థాయి దర్యాప్తునకు కేంద్రం కీలక ఆదేశాలు జారీ
- ◆ ఆందోళన కలిగిస్తున్న వరుస రైలు ప్రమాదాలు..
- ◆ ఇంజిన్‌తో పాటు పట్టాలు తప్పిన ఎనిమిది బోగీలు
- ◆ ఈ ఘటనలో ఎవరికీ ఏమీ కాలేదని అధికారులు వెల్లడి

**గౌహతి,అక్టోబరు 17 :** వరుస రైలు ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. అస్సాంలోని దిమాహసావో జిల్లాలో రైలు ప్రమాదం చోటు చేసుకుంది. లోకమాన్య తిలక్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పింది. అగర్తలా నుంచి ముంబయికి బయల్దేరిన ఈ రైలు ఇంజిన్‌తో పాటు మిగతా 7లో

## ఎపికి నలుగురు ఐఏఎస్ అధికారులు

- ◆ ఎపి సిఎస్‌కు రిపోర్టు చేసిన ఐఏఎస్ అధికారులు
- ◆ డీవోపీటీ ఆదేశాల మేరకు ఐఏఎస్ అధికారులు రిపోర్టు
- ◆ తెలంగాణ నుంచి నలుగురు అధికారులు రిలీవ్..



**అమరావతి,అక్టోబరు 17 (ఆంధ్రపత్రిక):** డీవోపీటీ ఆదేశాల మేరకు నలుగురు ఐఏఎస్ అధికారులు ఏపీలో రిపోర్టు చేశారు. ఏపీ సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్‌ను ఆమ్రపాలి, రోనాల్డ్ రోస్, వాకాటి కరుణ, వాణీ ప్రసాద్ కలిశారు. బుధవారం సాయంత్రం తెలంగాణ మిగతా 7లో



## భూ సర్వేలో అనేక లోపాలు

- వీటన్నింటినీ సవరించి భూ రికార్డులను సరిచేస్తున్నాం..
- రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించే అంశం
- రెవెన్యూ శాఖ మంత్రి అనగాని

**అమరావతి,అక్టోబరు 17 (ఆంధ్రపత్రిక):** గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన భూ సర్వేలో లోపాలున్నాయని మిగతా 7లో

## సూపర్ సిక్స్ పథకాలు ఏమయ్యాయి..?

- ◆ గాలికి కొట్టుకు పోయిన బాబు సూపర్ సిక్స్‌లు
- ◆ కేబినేట్‌లో ఒక్కటైనా ఎందుకు చర్చించలేదు
- ◆ ఉద్యోగాల కల్పనపై శ్వేతపత్రం విడుదల చేయండి
- ◆ ఉచిత సిలిండర్లు, ఆర్టీసీలో ఉచిత ప్రయాణం ఈ రెండూ బడ్జెట్ స్కీమ్‌లు
- ◆ ఇవన్నీ అమలు చేసే చిత్తశుద్ధి ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఉందా?
- ◆ మీడియా సమావేశంలో పిసిసి చీఫ్ షర్మిల



**విజయవాడ,అక్టోబరు 17 (ఆంధ్రపత్రిక):** ఎన్నికల ముందు పథకాల పేరుతో మభ్యపెట్టి.. అధికారం చేపట్టాక ఆ హామీలను అమలు చేయడం లేదనికూటమి ప్రభుత్వంపై ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల తీవ్ర విమర్శలు చేశారు. గురువారం విజయవాడలో మీడియాతో మాట్లాడిన వైఎస్ షర్మిల.. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై తీవ్ర వ్యాఖ్యలు మిగతా 7లో

## ప్రజా క్షేత్రంలోకి జగన్..

- ◆ ఓదార్పు యాత్రపైన వైఎస్ జగన్ సంచలన నిర్ణయం
- ◆ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండాలి
- ◆ పనితీరు ఆధారంగా ప్రమోషన్లు,వారికి రేటింగ్స్
- ◆ ప్రజల్లో వైసీపీ పట్ల వ్యతిరేకత లేదు



**అమరావతి, అక్టోబరు 17 (ఆంధ్రపత్రిక):** ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం మిగతా 7లో

## కొత్త పింఛన్లపై సర్కార్ శుభవార్త





- ◆ జనవరిలో కొత్త పింఛన్లు మంజూరు చేయనున్న ప్రభుత్వం
- ◆ కొత్త పింఛన్ల ఎంపికకు నవంబర్లో దరఖాస్తులు స్వీకరణ
- ◆ నవంబరు నెలలోనే పింఛన్ల తనిఖీ చేపట్టనున్న ప్రభుత్వం
- ◆ అనర్హుల పింఛన్లు తొలగించేందుకు 45రోజుల సమయం
- ◆ డిసెంబర్ నెలాఖరు నాటికి కొత్త పింఛన్ల లబ్ధిదారుల ఎంపిక

**అమరావతి,అక్టోబరు 17 (ఆంధ్రపత్రిక):** ఆంధ్రప్రదేశ్ ప్రజలకు కూటమి ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. ఎన్టీఆర్ భరోసా పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం జనవరిలో కొత్త పింఛన్లు మంజూరు చేయ నుంది. కొత్త పింఛన్ల ఎంపికకు నవంబర్లో దరఖాస్తులు మిగతా 7లో



## టిడిపి కార్యాలయంపై దాడి కేసు..

- ◆ విచారణకు హాజరైన సజ్జల రామకృష్ణారెడ్డి
- ◆ నిందితులకూ హక్కులు ఉన్నాయి: పొన్నవోలు
- ◆ పోలీసుల తీరుపై పొన్నవోలు ఆగ్రహం
- ◆ విచారణకు సజ్జలను మాత్రమే అనుమతించిన పోలీసులు

**అమరావతి,అక్టోబరు 17 (ఆంధ్రపత్రిక):** వైకాపా నేత సజ్జల రామకృష్ణారెడ్డి మంగళగిరి పోలీస్ స్టేషన్‌లో విచారణకు మిగతా 7లో

## రైల్ రిజర్వేషన్ కాల వ్యవధిలో మార్పులు..



- ◆ 120 రోజుల నుంచి 60 రోజులకు కుదింపు
- ◆ నవంబర్ 1 నుంచి కొత్త నిబంధన అమలు...
- ◆ కీలక నిర్ణయం తీసుకున్న భారతీయ రైల్వే
- ◆ అక్టోబర్ 31 వరకు పాత నిబంధన వర్తింపు

**న్యూఢిల్లీ, అక్టోబరు 17 :** టికెట్ రిజర్వేషన్లకు సంబంధించి భారతీయ రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ప్రయాణానికి 120 రోజుల ముందుగానే బుకింగ్ చేసుకునే సదుపాయం ఉండగా.. దానిని 60 రోజులకు కుదించింది. ఇందు కోసం ఐఆర్‌సీటీసీ మిగతా 7లో

ఒరులేయని యొనరించిన నరవర యప్రియము తన మనంబున కగు దా నొరులకు నవి సేయకునికి పరాయణము పరమ ధర్మపథముల కెల్లన్

ఆంధ్రపత్రిక

వ్యవస్థాపకులు: దేశోద్ధారక విశ్వదాత శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు

# మరుపు ఒక శాపం!

జ్ఞాపకం ఒక శక్తి! దానిని నిలబెట్టుకోవడం,పెంచుకోవడం,పంచుకోవడం ఒక కళ!అది ఒక వరం. దీనికి పూర్తి వ్యతిరేకమైనది మతిమరుపు.అదొక పెద్ద శాపం!వయసు పెరిగే కొద్దీ జ్ఞాపకశక్తి తగ్గడం,మతిమరుపు పెరగడం సహజమైన జీవచర్యగా భావించినా, దానిని అలావదల కూడదు.వృద్ధాప్యం వల్ల శారీరకమైన రుగ్మతలు వచ్చినాజ్ఞాపకశక్తిని అద్భుతంగా కాపాడుకున్నవారు మన మధ్యనే ఎందరో ఉండేవారు,ఇప్పటికీ ఉన్నారు. వారే మనకు ఆదర్శం.సివిల్ సర్వీసెస్ లో అఖిల భారత స్థాయి పోటీల్లో గెలిచి అద్భుతమైన ర్యాంకులు తెచ్చుకొని ఐఏఎస్ అధికారులుగా పెద్ద పెద్ద బాధ్యతలు నిర్వహించి, అల్జీమర్స్ బారినపడి బాధపడుతున్నవారు కూడా మన మధ్యనే ఉన్నారు.వీరి జీవితాలు, వారితో పెనవేసుకొన్నవారి కుటుంబ సభ్యులు వేదనామయమైన జీవితాన్ని గడుపుతున్నారు.మరుపురాకుండా చూసుకోవడం,జ్ఞాపకశక్తిని పెంచుకోవడం మన చేతుల్లోనే ఎక్కువశాతం ఉందనివైద్య శాస్త్రవేత్తలు,మానసికవైద్య శాస్త్ర నిపుణులు కూడా చెబుతున్నారు.మన ఆరోగ్య పరిరక్షణలో ఏమాత్రంమరువకూడని అంశం 'జ్ఞాపకశక్తి'. నిన్నటి వరకూ మన మధ్యనే ఉన్న'కళాతపస్వి' కె విశ్వనాథ్,'అపరగంధర్వుడు' మంగళంపల్లి బాలమురళీకృష్ణ,పూర్వ ప్రధాని పీవీ నరసింహారావు అమోఘమైన జ్ఞాపకశక్తిని చివరివరకూ నిలుపుకున్నారు.వీరిలో మంగళంపల్లివారిది ఇంకా విశేషమైన ఆరోగ్యం. వీరికి అనారోగ్యాలు సోకిన దాఖలాలు కూడా పెద్దగా లేవు.వీరి గురించే ప్రత్యేకంగా ఎందుకు చెప్పాల్సి వచ్చిందంటే?వారు మన తెలుగువారు. ఎనిమిదిపదుల వయస్సు మించి జీవించినవారు.నేటి కుర్తాళ పీఠాధిపతి సిద్ధేశ్వరానందభారతి (పూర్వాశ్రమ డాక్టర్ ప్రసాదరాయకులపతి)కిఇప్పుడు 86ఏళ్ళ వయస్సు.ఇప్పటికీ కొన్నివేల పద్యాలు, శ్లోకాలు ,స్తోత్రాలురసనాగ్రంపై నాట్యం చేస్తూ ఉంటాయి.ఆయన పుస్తకాలు చదవడం మానేసి కూడా 60ఏళ్ళు దాటిపోయింది.వీరే కాదురామ్ జెత్మలానీ,శ్రీపాద పినాకపాణి వంటి వారు కూడా అటువంటివారే. వీరు దాదాపు 100ఏళ్ళు అద్భుతమైన జ్ఞాపకశక్తితో జీవించారు.సుమారు65 ఏళ్ళ వయస్సు నుంచి మతిమరుపు పెరిగే అవకాశాలు ఉన్నాయని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి.ఒక్కొక్క నివేదిక ఒక్కొక్క రకంగా చెబుతున్నప్పటికీ మతిమరుపువిషయంలో,జ్ఞాపకశక్తిని పెంచుకోవడం అంశంలో అయిదుపదుల వయస్సు నుంచే సాధన చేయడం ఉత్తమం. అధికరక్తపోటు,మధుమేహం,కొలెస్ట్రాల్ వంటివాటి వల్ల రక్తనాళాలు దెబ్బతినడం,మెదడుకురక్తం సరిగ్గా సరఫరా కాకపోవడం, ప్రాణవాయువు సక్రమంగా అందకపోవడం వల్ల మతిమరుపుబారినపడే ప్రమాదం ఉందని వైద్యులు చేస్తున్న హెచ్చరికలను గౌరవించి,వారు సూచించినట్లుగా పాటించాలి. శారీరకమైన రుగ్మతలకు మందులు వేసుకుంటూ,వ్యాయామం చేస్తూ,నడక సాగిస్తూ ఉండడం ముఖ్యం.అట్లే యోగ సాధన,ప్రాణాయామం,ఓంకారం,ధ్యానం వంటివాటిని కూడా కలిపి సాగాలి.అదే సమయంలో అతిగా ఆందోళన పడడం,క్రుంగుబాటు వంటివి ఇంకా ప్రమాదం.పొగతాగడం,మద్యపానం వంటివాటికి దూరమవ్వడంఎంత ముఖ్యమో వంటరితనానికి దూరమవ్వడం కూడా అంతకంటే ఎక్కువ ముఖ్యం.మనిషిని 'సోషల్ యానిమల్ ' అంటారు. జనంతో,జనం మధ్య ఉండడం,స్నేహితులు,ఆత్మీయులు ,బంధువులను తరచూ కలవడం, వారితో గడపడం గొప్ప ఆరోగ్యాన్ని కలుగజేస్తుందని నిపుణులు చెప్పేమాటలు ఎంతో విలువైన మాటలు.తమను తాముఎప్పుడూ బిజీగా ఉంచుకోవడం,మెదడును పదునుపెట్టే వాటిలో సమయం గడపడం చాలా చాలా ముఖ్యం.ఇది అన్ని వయసులవారికీ వస్తుంది.ముఖ్యంగా 60దాటిన వారికి మరీ ముఖ్యం.మెదడును బాగా సద్వినియోగం చేయడం ఎంత ముఖ్యమో,మెదడుకు తగిన విశ్రాంతి ఇవ్వడం కూడా అంతే ముఖ్యం.వైద్యుల సలహాల మేరకు ఆహారాన్ని తీసుకోవడం,నిద్రలోనూ సమయపాలన పాటించడం కీలకం.వేదకాలంనాటి భారతీయ విద్యా విధానం చాలా గొప్పది.జ్ఞాపకశక్తినిచాలా చురుకుగా ఉంచేలా ఉండేది.గురువులు చెప్పింది వినడం,మెదడులో ధరించడం,వల్లెవేయడం,తిరిగి అప్పచెప్పడం.. ఇలా అంతా మౌఖికంగా సాగేది.తెలుగువారి'అవధాన విద్య' కూడాఈ సూత్రాలపైనే నిర్మాణమైంది. పద్యాలను ధారణ చేయడం వల్ల జ్ఞాపకశక్తి బాగా పెరుగుతుంది.పలకడం ద్వారా జరిగే చర్య ద్వారా రక్తప్రసరణ,ఆక్సిజెన్ ప్రవాహం బాగా జరుగుతాయి.ఈ సాధన విద్యార్థుల నుంచి వృద్ధుల వరకూ ఉపయోగపడుతుంది.ఆటలు,పాటలు శారీరక,మానసిక ఆరోగ్యాన్ని తీర్చిదిద్దేవే.మన విద్యావిధానంలో నిన్నమొన్నటి వరకూ ఉన్నాయి. కొన్నాళ్ళుగా అవి సన్నగిల్లాయి. ఇప్పుడిప్పుడే నూత్న విద్యా విధానం వాటిపై దృష్టి సారిస్తోంది. మొత్తంగా చూస్తేమతిమరుపు రాకుండా చూసుకోవడం,జ్ఞాపకశక్తిని పెంచుకోవడం చాలా వరకూమన చేతుల్లోనే ఉంది.

# పటిష్ట ప్రణాళికలతో ముందుకు సాగాలి !

తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను నెరవేరుస్తామని అంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందుకు తగ్గట్లుగా అడుగులు వేయాలి. నీళ్లు, నిధులు,నియామకాలు అన్న ఆకాంక్షలు త్వరగా నెరవేర్చాలి. ఇదే సందర్భంలో ఇక ఉచిత పథకాలను దరిచేరకుండా పటిష్టమైన ఆర్థిక వ్యవస్థను రూపొందించుకోవాలి. రైతుబంధు, రైతు రుణమాఫీలు,రూపాయికి కిలోబియ్యం, ఆరోగ్యశ్రీ వంటి పథకాలకు చెక్ పెట్టాలి. పంటలను పూర్తి స్థాయిలో గిట్టుబాటు ధరలకు కొనడమే రైతులను ఆదుకోవడం అవుతుంది. వారికి సకాలంలో విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచడం, పంటరుణాలను అందించడం,నీట వసతి కల్పించడం ప్రధాన ఎజెండా కావాలి. ఇవన్నీ కల్పించి పండించిన పంటలను సకాలంలో కొనుగోలు చేసే వ్యవస్థలను ఏర్పాటు చేయాలి. ప్రకృతి వైపరీత్యాల్లో ఆదుకునేలా ఉండాలి. చిన్ననీటి వనరులను అభివృద్ధి చేయాలి. ఇలా చేస్తే వ్యవసాయంతో పాటు, అనుబంధ రంగాలు కూడా అభివృద్ధి చెందుతాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుంది. ఇవి చేయకుండా నేలవిడిచి సాము చేయడం సరికాదు. అలాగే విద్యావైద్య రంగాలను కూడా గ్రామస్థాయి లో పటిష్టం చేయాలి. సాగు,తాగునీటి వనరులతో పాటు, పంటలు పండే భూములకు ఇక్కడ కొదువలేదు. పనిచేయడానికి జనం ఉన్నారు. వీటి ఎలా ఉపయోగించాలన్నది నేతల సమర్థత మీద ఆధారపడి ఉంది. పథకాలు, పందేరాలతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకుని వెళ్లడం అసాధ్యం అని గుర్తించాలి. అలాగే గత కెసిఆర్ ప్రభుత్వంలా అభూతకల్పనలు,భ్రమలు కల్పించడం మానుకోవాలి.అప్పుడే గ్రామాలు ఆర్థికంగా బలోపేతం అవుతాయి. పంచాయితీలను పటిష్టం చేసి వాటి ద్వారానే గ్రామాల పురోభివృద్దికి పాటుపడాలి. రాజ్యాంగం ఇచ్చి అధికారాలను పంచాయితీలకు దఖలు పర్చాలి. తెలంగాణ ప్రజల బతుకులు మారాలన్న ఏకైక లక్ష్యంతో పోరాటం చేసి సాకారం చేసుకున్న ప్రత్యేక తెలంగాణ ఏర్పడి పదేళ్లు పూర్తి అయ్యాయి. నిజానికి ఇలాంటి చిన్న రాష్ట్రంలో అన్ని వనరులు ఉన్నా ప్రజల ఆకాంక్షలు తీరలేదు. ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా పదేళ్లు కల్వంకుంట్ల కుటుంబం రాజభోగాలు అనుభవించింది. గడీల పాలన అందించింది. దీనిని నిందిస్తూ కాలయాపన చేయకుండా రేవంత్ సర్కార్ ముందుకు సాగాలి. అలాగే ఈ పదేళ్లలో తెలంగాణలో ఎవరి బతుకులు మారాయన్నది గమనిస్తే.. రాజకీయ పార్టీల్లో కొందరి బతుకులు మారాయి. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంతో ప్రజల బతుకులు అలాగే ఉన్నాయి. ఈ క్రమంలో పదేళ్ల పాలనపైనా, ప్రజల జీవన చిత్రంపైనా చర్చించి నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. రేవంత్ ప్రభుత్వం గత విధ్వంసాలను గుర్తించి ముందుకు సాగాలి. ప్రజలు ఏం కోరుకుంటున్నారో చర్చించాలి. మూసపద్దతిలో కాకుండా నిర్మాణాత్మక వైఖరితో ముందుకు సాగితే సింగపూర్, మలేషియా లాంటి చిన్నచిన్న దేశాలను అధిమించవచ్చు. నీళ్లు, నిధులు,నియామకాలు అన్న నినాదంలో ఏవీ సాకారం కాలేదు. గత ప్రభుత్వ తప్పిదాలను సమీక్షిం చుకుని ప్రజలు కోరుకుంటున్న విధంగా పాలన సాగించాలే కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేయాలి. లేకుంటే..రాజకీయాల్లో ప్రజలు తమదైన రీతిలో బుద్ధి చెబుతారని గుర్తించాలి.

# జ్ఞానపీఠ అవార్డు గ్రహీత రావూరి భరద్వాజ



ప్రతిష్టాత్మకమైన జ్ఞానపీఠ్ అవార్డు పొందిన మూడో తెలుగు రచయిత రావూరి భరద్వాజ. ఆయన కన్నా ముందు ఈ అవార్డు కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణకు, డాక్టర్ సి. నారాయణరెడ్డికి ఈ అవార్డు లభించింది. భరద్వాజ 2011లో త్రిపురనేని గోపీచంద్ పురస్కారాన్ని, 2009లో లోక్ నాయక్ పౌండేషన్ సాహిత్య పురస్కారాన్ని, 2012లో జ్ఞానపీఠ పురస్కారాన్ని అందుకున్నారు.రావూరి భరద్వాజ (జూలై 5, 1927 – (అక్టోబరు 18, 2013) తెలుగు లఘు కథా రచయిత, నవలా రచయిత, రేడియోలో రచయితగా పేరు తెచ్చు కున్నారు. గొప్ప భావుకుడైన తెలుగు కవి, రచయిత. రావూరి భరద్వాజ 37 కథా సంపుటాలు, 17 నవలలు, 6 బాలల మినీ నవలలు, 5 బాలల కథా సంపుటాలు, 3 వ్యాస, ఆత్మ కథా సంపుటాలు, 8 నాటికలు, ఐదు రేడియో కథానికలు రచిం చారు. ఈయన బాల సాహిత్యంలో కూడా విశేషకృషి సలిపారు. సినీ పరిశ్రమలో తెరవెనుక జీవితాన్ని కళ్లకు కట్టినట్టు చిత్రీకరించిన పాకుడు రాళ్ళు నవల భరద్వాజ యొక్క ఉత్కృష్ట రచనగా పరిగణింపబడుతుంది. ఆయన రచనలలో జీవన సమరం మరో ప్రముఖ రచన.తెలుగు రచనా ప్రపంచంలో వినూత్న సాహితీ ప్రక్రియకు శ్రీకారం చుట్టిన ఘనుడాయన. ఆడంబ రాలు లేని సాధారణ జీవితం ఆయనది. భరద్వాజకు దిగువ మధ్యతరగతి, పేదప్రజల భాషపై గట్టిపట్టు ఉంది. ఒక బీద కుటుంబంలో జన్మించిన భరద్వాజ కేవలం ఉన్నత పాఠశాల స్థాయి వరకే చదువు కున్నారు. ఆ తరువాత కాయకష్టం చేసే జీవితాన్ని ప్రారంభించారు. చిన్న తనంలో పొలాల్లో గడిపిన భరద్వాజ వ్యవసాయ కూలీల కఠినమైన జీవన పరిస్థితులను గమనించే వారు. అప్పుడే పల్లె ప్రజల భాష, యాస, ఆవేశాలు, ఆలోచనలు, కోపాలు, తాపాలు గమనించిన భరద్వాజ ఆ అనుభవాలను తర్వాత కాలంలో తన రచనలలో నిజమైన పల్లె వాతావరణాన్ని సృష్టించడానికి ఉపయోగించు కున్నారు. 2013 అక్టోబరు 18న రావూరి భరద్వాజ తిరిగిరాని లోకాలకు తరలి వెళ్ళారు.రావూరి 1927 జూలై 5వ తేదీన కృష్ణా జిల్లా లోని నందిగామ తాలూకా కంచికచర్ల సమీపం లోని మోగులూరు (నాటి హైదరాబాదు సంస్థానంలోని) గ్రామంలో రావూరి కోటయ్య, మల్లికాంబ దంపతులకు జన్మించారు. ఆయన విద్యాభ్యాసం 8వ తరగతి వరకే సాగింది. తొలి నాళ్ళలో రావూరి భరద్వాజపై చలం ప్రభావం ఎక్కువగా ఉండేది. యుక్త వయసులోనే తెనాలిచేరి అక్కడ ఒక ప్రెస్సులో పనిచేయటం ప్రారంభించారు. 1946లో నెల్లూరులోని జమీన్ రైతు వారపత్రిక సంపాదక వర్గంలో చేరారు.1948లో దీనబంధు వారపత్రికకు బాధ్యులుగా ఉన్నారు. జ్యోతి,సమీక్ష, అభిసారిక, చిత్రసీమ, సినిమా, యువ పత్రికల్లో 1959వరకు కొన్నాళ్ళు ఫౌంటెన్ పెన్నుల కంపెనీలో సేల్స్‌మన్‌గా పని చేశారు. అక్కడ యజమాని అమానుషత్వాన్ని భరించలేక రాజీనామా చేసి కొన్నాళ్ళపాటు ఖాళీగా ఉన్నారు.ఆ తర్వాత హైదరాబాదు ఆకాశవాణి కేంద్రంలో 1959లో ప్రూఫ్ రీడింగ్ కళాకారునిగా చేరి చివరకు 1987లో ప్రసంగ కార్యక్రమాల ప్రయోక్తగా పదవీ విరమణ చేశారు.రావూరి భరధ్వాజ గురించి చాలాకాలం పరిశోధన చేసి, రచనల గురించి సమగ్రమైన పరిశీలన చేసిన బొగ్గుల శ్రీనివాస్ ప్రకారం భరధ్వాజ సుమారు 187 పైగా పుస్తకాలను వెలువరించారు, 500 పైగా కథలను 37 సంకలనాలు గా, 19 నవలలు, 10 నాటకాలు వ్రాశారు. భరద్వాజ తన తొలి కథ ఒకప్పుడును 16 ఏళ్ల ప్రాయంలో వ్రాశారు. ఇది జానపద శైలిలోసాగే కథ. భరద్వాజపై చలం ప్రభావం మెండుగా ఉంది. చలాన్ని అనుకరిస్తూ ఈయన అనేక సెక్సు కథలు వ్రాశారు. త్వరలోనే సెక్సు కథలు వ్రాయటంలో అందెవేసిన చెయ్యి అనిపించు కున్నారు. అనేక పత్రికలు ఆ వ్యాసంగంలో ఈయన్ను ప్రోత్సహించాయి. ఏ మాత్రం సంకోచం, జంకు లేకుండా జీవనోపాధికై ఆయన అనేక కథలు వ్రాశారు.1983లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును పొందారు. నాలోని నీవు, అంతరంగిణి, ఒక ఏకాంతం, ఒకింత వేకువ కోసం వంటి కవితా సంకలనాలు రచించారు. భరద్వాజ రచించిన కౌముది, హిందీ, గుజరాతీ భాషల్లోకి అనువాద మైంది. ఆత్మగతం, బానుమతి, దూరపు కొండలు, జీవనాడి, మనోరత్నం, నీరు లేని నది, సశేషం, స్వప్న సీమలు, స్వర్ణ మంజరి వంటి 11 నాటకాలు రచించారు. బాల సాహిత్యానికి సంబంధించి 33 పుస్తకాలు రచించారు. పిల్లల కోసం ఏడు నవలలు రాశారు.విచిత్రమైన మానవ భావోద్వేగాలే ప్రధానాంశాలుగా కథలు వ్రాసే భరద్వాజ శైలి సరళమైనది. పాత్ర చిత్రీకరణలో, ఒక సన్నివేశాన్ని పరిచయం చేయటంలో రావూరి భరద్వాజకు ఉన్న ప్రజ్ఞ అద్భుతమైనది.రావూరి భరద్వాజ పేరు ప్రఖ్యాతులు తెచ్చిన రచనల్లో ముఖ్యమైనది, చలనచిత్ర పరిశ్రమను వస్తువుగా చేసుకొని తెలుగులో వెలువడిన మొట్ట మొదటి నవల పాకుడు రాళ్లు. భరద్వాజ దీనికి మాయ జలతారు అని నామకరణం చేశారు. అయితే శీలా వీర్రాజు పాకుడురాళ్లు అనే పేరు పెట్టాడు. మల్లంపల్లి సోమశేఖర శర్మ, ముదిగొండ సుబ్రహ్మణ్య శర్మల ప్రోత్సాహంతో రావూరి భరద్వాజ తాను అంతకు ముందే రాసిన 'పాలపుంత' అనే ఓ పెద్ద కథని పాకుడురాళ్లు నవలగా రాశారు. మూడు సంవత్సరాల పాటు కృష్ణా పత్రికలో ధారా వాహికగా వెలువడిన పాకుడురాళ్లు నవలపై శ్రీకృష్ణదేవ రాయ, శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయాల్లో పరిశోధనలు జరగడం విశేషం.రావూరి భరద్వాజకు 1980లో ఆంధ్ర విశ్వ విద్యాలయం, 1987లో జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వ విద్యాలయం, 1991లో నాగార్జున విశ్వ విద్యాలయం గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేసి గౌరవించాయి. 1980లో కళాప్రపూర్ణ – ఆంధ్ర విశ్వవిద్యాలయం,1983లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం, 1985లో సోవియట్ భూమి నెహ్రూ పురస్కారం ఇనుక తెర వెనకకు లభించింది. 1987లో రాజాలక్ష్మీ ఫౌండేషన్ అవార్డు,1987లో తెలుగు కళాసమితి కె.వి.రావు, జ్యోతిరావు అవార్డు, 1997లో తెలుగు విశ్వ విద్యాలయం నుండి సాహిత్యలో విశిష్ట పురస్కారం, 2007 లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కళారత్న అవార్డు, 2008లో లోక్ నాయక్ ఫౌండేషన్ పురస్కారం, (వినూత్న సాహితీ ప్రక్రియ కల్పించినందుకు, డిసెంబరు 4 వ తేదీన ప్రకటించారు), 2011లో కేంద్ర సాహిత్య అకాడమీ, వంగూరి ఫౌండేషన్, గోపీచంద్ జాతీయ సాహిత్య పురస్కారాలు లభించాయి. 2012లో జ్ఞానపీఠ అవార్డు తెలుగు సాహిత్యానికి ఆయన చేసిన బహుముఖమైన కృషికి దక్కింది.

**రామ కిష్టయ్య సంగనభట్ల**

# జమ్మూకశ్మీర్ ఇక భారత్‌దే..!

జమ్మూకశ్మీర్ ఇక భారత్‌దే ! అదేమిటి? చిన్నపిల్లవాడ్ని అడిగినా చక్కగా జమ్మూకశ్మీర్ కిరీటంతో మూడువైపుల సముద్రంతో భారత్ మ్యాప్‌ను గీస్తారు. ఇప్పుడు కొత్తగా ఇదేమిటి? ఇంత వరకూ భారత రాజ్యాంగాన్ని గాని, భారత్లో తాము ఒకరమని గాని వారు అంగీకరించలేదు. జమ్మూకశ్మీర్లో అబ్దుల్లా కుటుంబం వారికొంత రాజ్యాంగం మీదే ప్రమాణం చేసేది. ఆర్టికల్ 370 రద్దు తరువాత జరిగిన ఈ ఎన్నికల్లో వారు పాల్గొనబోమని కూడా చెప్పారు. అలా చెప్పినవారు రెండు చోట్ల గాందర్బ, బద్గాము నుంచీ పోటీచేశారు. రెండుచోట్లా గెలిచారు. చరిత్రలో మొదటిసారి అక్టోబర్ 16న శ్రీనగర్లోని ఎస్ఐసిసి లో ఉదయం 11.30 గంటలకు నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ) నేత ఒమర్ అబ్దుల్లా ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవంలో అబ్దుల్లా భారత రాజ్యంగం మీద ప్రమాణం చేశారు. ఇది భారత ప్రభుత్వం సాధించిన గొప్ప విజయం. అధికార పార్టీ ప్రజాస్వామ్యానికిచ్చిన గౌరవం. ఈ తరం సిఎం ఒమర్ అబ్దుల్లా ఈ సత్యాన్ని గ్రహించారు. అందుకే కేంద్రానికి సహకరిస్తూ పాలన సాగిస్తామని చెప్పి అందర్నీ ఆశ్చర్యపరిచారు.ఫరూక్ అబ్దుల్లా, ఇప్పుడు ఒమర్ అబ్దుల్లా అందరూ ముఖ్యమంత్రులుగా చేశారు. ఇంతకు మునుపు కూడా ఒమర్ అబ్దుల్లా ముఖ్యమంత్రిగా ప్రమాణం స్వీకారం చేశారు. కానీ అప్పుడు వారి రాజ్యాంగం మీదే ప్రమాణస్వీకారం చేశారు. అమ్మూ కాశ్మీర్ కు ఆగస్టు 5,2019 వరకూ సొంత రాజ్యాంగం ఉండేది. ఆ రాజ్యాంగంమీదే ప్రమాణం చేసి పదవులు చేపట్టేవారు. కానీ ఇప్పుడు భారతరాజ్యాంగం మీద ప్రమాణం చేశారు. అంటే తాము భారత్లో విలీనమైనామని, అంతర్భాగమైనామని, భారతదేశానికి విధేయతను ప్రకటిస్తూ ప్రమాణస్వీకారం చేయడం గమనార్హం. 1950 మొదలు భారత్ నుంచి కశ్మీరు వేరు చేసేందుకు ప్రయత్నించిన కుటుంబం అబ్దుల్లాది. పాకిస్తాన్తో ఒప్పందాలు, ఐక్యరాజ్య సమితి తోటి చర్చలు ఇలా చాలా ప్రయత్నాలు చేశారు. అటువంటి కుంటుంబానికి చెందిన ఒమర్ అబ్దుల్లా ఆర్టికల్ 370 తొలగిన తరువాత జరిగిన ఎన్నికల్లో గెలిచి భారతకు విధేయత ప్రకటించి ప్రమాణం చేసిన ముఖ్యమంత్రిగా రికార్డులకెక్కారు.శ్యామాప్రసాద్ ముఖర్జీ 1950లలో "ఏక్ దేశ్ మే దో ప్రధాన్, ఏక్ దేశ్మే దో విధాన్, ఏక్ దేశ్ మే దో విశార్ సహీ చలేంగే!" అని ఉద్యమం చేశారు. అయినా 1952-53 వరకూ కశ్మీర్లో ముఖ్యమంత్రిని ప్రధాని అనేవారు. బిజెపి అధికారంలోకి వచ్చినా ఆ పరిస్థితిని మార్చడానికి ఇంత సమయం పట్టింది.

ముఖర్జీ ఉద్యమం లక్ష్యం నెరవేరడానికి 74 ఏళ్లు పట్టింది. బిజెపికి ఇది చిన్న విజయం కాదు. దీనికెదురైన సవాళ్లుగానీ, అడ్డంకులుగానీ దేశప్రజలందరకూ తెలిసినవే. అన్నిటినీ ధీటుగా ఎదుర్కొంటూ, ప్రజాశ్రేయస్సుకోసం కృషిచేస్తూ విజయం సాధించిన ఘనత మోదీ బృందానికే దక్కుతుంది. ఇటీవల మన విదేశాంగ మంత్రి జయశంకర్ పాకిస్తాను (పాక్ భారత్లోనివే అంటూ ఘాటైన జవాబు ఇవ్వడం మనకు తెలిసిందే. మరోవైపు మణిపూర్లో మైథేయి, కుకీల నాయకులు ఢిల్లీలో సమావేశం కావడం వెనుక భారత్ హోమ్ మినిస్టర్ అమిత్ షా కృషి కొంతవరకూ ఫలించిందని చెప్పొచ్చు. ఇవన్నీ పరిశీలిస్తే దేశప్రేమికులు మాత్రమే దేశానికి సమర్థవంతమైన పాలన అందించగలరని మరొక్కమారు విదితమవుతున్నది.

**నట్టి శ్రీనివాస్‌రావు**

# డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు ఉద్యమిద్దాం

డ్రగ్స్ మాదక ద్రవ్యాల వినియోగం ప్రపంచానికి సామాజిక సమస్యగా పరిణమించింది. దేశ అభివృధిలో చోదక శక్తిగా నిలిచిన యువత డ్రగ్స్ ఆల్కహాల్ మాదక ద్రవ్యాల మత్తులో చిక్కుకొని తమ శక్తి సామర్థ్యాలు నిర్వీర్యం చేసుకుంటున్నారు. డ్రగ్స్ మాదక ద్రవ్యాల దుర్వినియోగం యువత వినాశన కరంగ మారింది ఆశలు ఆకాంక్షలు కన్న కలలు విచ్చిన్నమై కుటుంబాలలో ఆనందకరమైన జీవితానికి అవరోధం కావడం శోచనీయం.ఐ'రా'స జూన్26 న ప్రపంచ డ్రగ్స్ మాదక ద్రవ్యాల నిరోధక దినోత్సవం ప్రపంచ వ్యాప్తంగా జరుపాలని 1987 నుండి ప్రపంచ వ్యాప్తంగా డ్రగ్స్ మాదక ద్రవ్యాల వినియోగం అరికట్టేందుకు సభ్య దేశాల ప్రభుత్వాలకు హెచ్చరికలు జారీచేస్తూ మాదక ద్రవ్యాల మహమ్మారికి వ్యతిరేకంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తుంది.. డ్రగ్స్ మత్తు పదార్థాలు మాదక ద్రవ్యాల వినియోగం రావాణా వల్ల ఏర్పడే దుష్ఫలితాల పట్ల ప్రజలకు పౌర సమాజానికి అవగాహన చైతన్యం కలిగించడం ముఖ్య ఉద్దేశం పత్రికల్లో మీడియాలో డ్రగ్స్. మాదక ద్రవ్యాల వినియోగం వార్తలు సమాజాన్ని కలవర పెడుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా డ్రగ్స్ మాఫియా రాజ్యమేలుతుంది. చిన్న పట్టణాల నుంచి మెట్రోపాలిటన్ నగరాలకు డ్రగ్స్ వ్యాపారం మూడు పువ్వులు ఆరవై కాయలుగా కొనసాగుతుంది స్కూల్ కాలేజీ యూనివర్సిటీలు డ్రగ్స్.విక్రయ కేంద్రాలుగా విలసిల్లుతున్నాయి. డ్రగ్స్ మాదక ద్రవ్యాల వ్యాపారం మాఫియా యువతను నిర్వీర్యం చేస్తూ లక్షల కోట్ల చీకటి వ్యాపారం చేస్తున్నాయి. యువత మత్తుకు ఆకర్షితులై మత్తు నుండి బయట పడలేక తమ జీవితాలను బలిచేసుకుంటున్నారు. కొంత మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నరు. పెరిగిన డ్రగ్స్ మాదక ద్రవ్యాల వినియోగం ప్రపంచవ్యాప్తంగా దాదాపు 269 మిలియన్ల మంది మాదక ద్రవ్యాలకు బానిస అయ్యారని నివేదికలు వెల్లడించాయి. వీరే కాకుండా ఎప్పుడన్నా ఒకసారి వినియోగించేవారు 5.5% మంది ఉన్నారు. దేశంలో మద్యం వినియోగించే వారు16 కోట్ల మంది గంజాయి 3.1 కోట్లు హీరోయిన్ 2.8 కోట్లు కోకైన్ ఇతర మత్తు పదార్థాలు 1.18 కోట్ల మంది వాడుతున్నారని నివేదికలు వెల్లడిస్తున్నాయి. డ్రగ్స్ మాదక ద్రవ్యాల వినియోగం ప్రపంచ వ్యాప్తంగా 2004లో 21 శాతం వాడుతుంటే నేడు 29.5% పెరిగిందని యు'ఎన్'ఓ'డి'సి విడుదల చేసిన నివేదిక తెలిపింది .ఈ నివేదిక ప్రకారం మాదక ద్రవ్యాల వినియోగం వల్ల ప్రపంచ వ్యాప్తంగా అర మిలియను మంది 2019లో మరణిస్తే ఇండియాలో జరిగిన ఆత్మహత్యల్లో ఎక్కువ శాతం ఈ కోవకు చెందినవేనని పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రమాదకరమైన మాదకద్రవ్యాలు ఉపయోగించే వారు 0.71 శాతం ఉంటే ప్రపంచ సగటు కంటే ఎక్కువగా మన దేశంలో 2.65% ఈ ప్రమాదకరమైన డ్రగ్స్ వాడుతున్నారని నివేదిక పేర్కొంది 1985లో నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకో ట్రాఫిక్ సబ్ స్టాన్సెస్ చట్టం ప్రకారం మాదద్రవ్యాలు కలిగి ఉండటం సరఫరా ఉత్పత్తి చట్టరీత్యా నేరం అయినప్పటికీ ఈరోజు మనదేశంలో విచ్చల విడిగా డ్రగ్స్ దొరుకుతూనే ఉన్నాయి. వాడకం పెరుగుతుంది ఇంతటి ప్రమాదకరమైన సమస్య రోజురోజు కు తీవ్రమవుతుంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చోద్యం చూస్తున్నాయి. దీని కోసం తక్షణ పరిష్కారం కోసం ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలి.నిరంతర



అప్రమత్తతడ్రగ్స్ మాదక ద్రవ్యాల దుర్వినియోగం డాగ్స్ అక్రమ రవాణా కు వ్యతిరేకంగా జరిగే కార్యక్రమాలు ఒక రోజు కాకుండా నిరంతరం జరగాలి. వీటివల్ల కలిగే ప్రమాదాల గురించి అవగాహన కల్పించాలి. ఈ సమస్య పరిష్కరించడానికి సమర్థవంతమైన పాలన చట్టబద్ధమైన విధానాలను రూపొందించాలి. ప్రభుత్వాలు స్థానిక సంస్థలు మహిళా సంఘాలు పౌర సమాజం స్వచ్ఛంధ సంస్థలు మాదక ద్రవ్యాలకు సంబంధించిన చట్టాలు కార్యక్రమాలు పట్ల ప్రజలకు అవగాహన కలిగించాలి .డ్రగ్స్ మాదక ద్రవ్యాల వినియోగ వ్యతిరేక సమాచారాన్ని పంచుకోవాలి మాదకద్రవ్యాలు సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించడానికి ప్రభుత్వాలు రాజ్యాంగ వ్యవస్థలు ఆరోగ్య సంరక్షణ కేంద్రాలు విద్యావేత్తలు సమిష్టిగా కృషి చేయాలి ఒక్కరోజు మాత్రమే దీని గురించి ఆలోచించి మర్చిపోకూడదు అక్రమ రవాణా ఎదుర్కోవడానికి అంతర్జాతీయంగా దేశాల మధ్యన సహకారం అవసరం. వ్యక్తులు కుటుంబాలు సమాజాలపై మాదకద్రవ్యాల దుర్వినియోగం గురించి అవగాహన చైతన్యం కలిగించాలి .నివారణ చికిత్స పునరావా స కార్యక్రమాలను ప్రోత్సహించాలి . మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణాకు వ్యతిరేకంగా జరిగే కార్యక్రమాల్లో ప్రజలందరూ సంపూర్ణ భాగస్వాములై డ్రగ్స్ రహిత సమాజం యొక్క ప్రాముఖ్యతను ప్రచారం చేయాలి . వర్క్ షాపలు సదస్సులు చర్చలు ఏర్పాటు చేయాలి. మత్తు పదార్థాలు కు వ్యతిరేకంగా ప్రచారం చేసే వ్యక్తులను సంస్థలను అవార్డులుఇచ్చి ప్రోత్సహించాలి. పాఠశాలలు కళాశాలలో డ్రగ్స్ ప్రభావాలు గురించి సదస్సులు నిర్వహించాలి. నైతిక విద్యను పాఠ్యాంశంలో ప్రవేశపెట్టి డ్రగ్స్ రహిత ఆరోగ్యకరమైన జీవనశైలి పెంపొందించే విద్య బోధన పాఠ్య ప్రణాళికలు అమలు చేయాలి.కాశ్మీర్ మాదక ద్రవ్యాల ప్రభావంకాశ్మీర్ ప్రాంతములో డ్రగ్స్ మాదక ద్రవ్యాల వినియోగానికి యువత బానిసలుగా మారిపోతున్నారు. జమ్ము కాశ్మీర్లో దాదాపు 10 లక్షల జనాభా వుంటే 8 శాతం ప్రజలు గంజాయి ఓపియాయిడ్లు వంటి మాదక ద్రవ్యాలకు అలవాటు పడ్డారు ఈ సమాచారాన్ని కేంద్ర మంత్రి పార్లమెంట్లో వెల్లడించారు. రేహబి లేషన్ కొరకు వచ్చే రోగుల సంఖ్య ఓ 10 ఏళ్లకు ముందు రోజుకు 10 12 డ్రగ్స్ అడ్డిక్షన్ కేసులు వచ్చేవి ఇప్పుడు 150బి 200 కేసులు వస్తున్నాయి ఇది ఆందోళన కలిగించే విషయం అని సైక్రటిస్ట్ డాక్టర్ ప్రొఫెసర్ యాసిర్ రాధార్ ప్రకటించారు. దేశంలో చాలా చోట్ల డ్రగ్స్ మాదక ద్రవ్యాల వ్యపారం విస్తిరించి వుంది.ఐ 'రా'స నివేదిక డ్రగ్స్ అంచనాఐక్య రాజ్య సమితి నివేదిక ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా 157 దేశాల్లో గంజాయి సాగు అవుతుంది. దేశంలో అనేక రాష్ట్రాలలో ఈ సమస్య తీవ్రంగా వుంది ఈశాన్య రాష్ట్రాలు అంతర్జాతీయ పోర్టులు ప్రైవేట్ పోర్టులు ద్వారా ఎక్కువ సప్లయ్ అవుతుంది కృష్ణా పట్నం పోర్టు శంషాబాద్ ఎయిర్ పోర్టులో డ్రగ్స్ మాదక ద్రవ్యాలు పట్టుబడుతున్నాయి.అభివృధి చెందుతున్న పేద దేశాలలో ఈ వ్యాపారం ఎక్కువగా జరుగుతుంది. ప్రపంచీకరణ కార్పొరేటీకరణ ప్రభావం వల్ల డాగ్స్ వ్యాపారం విస్తరిస్తుంది. 2030 నాటికి మాదకద్రవ్యాల వ్యాపారం 11% పెరిగిపోతుందని ఐ'రా'స నివేదిక పేర్కొంది. ఆకలి 'దారిద్రం 'పేదరికం నిరుద్యోగం' వైద్యం అందకపోవడం లాంటి అనేక సమస్యలతో సతమవుతున్న ప్రజలను కార్పొరేట్ సంస్థలు మాదకద్రవ్యాల వ్యాపారంతో దేశాన్ని దోచుకోవడంతో పాటు యువతను నిర్వీర్యం చేస్తున్నారు. మత్తుకు బానిస లైన యువత డాగ్స్ ను పొందడం కోసం అనేక ఘాతకాలకు పాల్పడిన సంఘటనలు ఉన్నాయి. యువత హింసకు దోపిడీకి పాలుపడుతున్నారు. హింస పెరిగిపోతుంది. కార్పోరేట్ సంస్థల ప్రభుత్వాలు అండగా నిలవడం కరోన మహమ్మారి ప్రపంచాన్ని వనణికించిన సమయంలోను కార్పొరేట్ల దందాను ప్రభుత్వాలు అరికట్టలేకపోయాయి. ఉచిత వాక్సిన్ అందించి ప్రపంచాన్ని కాపాడుకోవాల్సిన ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా ప్రవర్తించి కాసులు దండుకునేందుకు దారులు వేసింది.యువత శక్తి నిర్వీర్యండ్రగ్స్ మాదక ద్రవ్యాల వినియోగం యువతను శారీరకంగా మానసికంగా కుంగ తీస్తుంది.తీవ్రమైన భావోద్వేగాలకు గురిచేస్తుంది. యువ శక్తే దేశ శక్తి అంటున్న ప్రభుత్వాలు యువ శక్తి సామర్థ్యాలను నిర్వీర్యం చేసే బలహీన పరిచే మత్తు పదార్థాల మాదక ద్రవ్యాల వైపు పయనిస్తున్న యువతను కట్టడి చేయలేక పోవడం పాలకుల నిలక్ష్యానికి ప్రతీక డ్రగ్స్ వినియోగం వల్ల దేశాభి వృదికి వెన్నెముకగా వుండ వలసిన యువత నిర్వీర్యంఅవుతుంది. డ్రగ్స్ మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే భౌతిక మానసిక సామాజిక ఆర్థిక నష్టాల గురించి ప్రజల్లో అవగాహన కలిగించాలి.నషా ముక్త్ భారత్ అభియాన్ పథకం ద్వారా272 జిల్లాలో 13000 మంది వలంటర్లను పెట్టీ డ్రగ్స్ అరికట్టాలన్న కార్యాచరణ అమలుకు నోచుకోలేదు.డ్రగ్స్ మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడానికి యుద్ధ ప్రాతిపదికన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలిప్రభుత్వం పబ్బులు ' క్లబ్బులు సినీ పరిశ్రమలో పాఠశాల కళాశాల స్థాయిలో డ్రగ్స్ వ్యతిరేక ప్రచారాన్ని విస్తృత స్థాయిలో నిర్వహించాలి. డ్రగ్స్ మాదక ద్రవ్యాల వినియోగం అక్రమ రవాణా కేసులను విచారించడానికి ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి దోషులకు కఠిన శిక్షలు అమలు చెయ్యాలి.ఐటి పరిశ్రమలో డ్రగ్స్ మాదక ద్రవ్యాల వినియోగం వ్యాపారాన్ని అరికట్టాలి. డ్రగ్స్ అడిక్ట్ గా మారిన యువతకు సమగ్ర వైద్య ఆరోగ్య పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలికౌన్సెలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి డ్రగ్స్ మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య సమస్యల మీద అవగాహన కలిగించాలి.మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడటానికి విధ్య నివారణ చికిత్స చట్టాల అమలుతో కూడిన ఏకీకృత విధానం అమలు చెయ్యాలి.మాదక ద్రవ్యాల దుర్వినియోగం సమాజం ఉమ్మడి సమస్య డ్రగ్స్ రహిత సమాజ స్థాపన ప్రతి పౌరుని సామాజిక బాధ్యత.

**నేదునూరి కనకయ్య**

# మహానుభావుడు ఆదికవి వాల్మీకి మహర్షి

**టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసు రెడ్డి**



**కర్నూలు, అక్టోబర్ 17 (ఆంధ్రపత్రిక):** ప్రపంచానికి రామాయణం రాసి మానవాళికి ఆదర్శంగా నిలిచిన మహానుభావుడు ఆదికవి వాల్మీకి మహర్షి అని కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి సోదరుడు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. వారు కోసిగి మండల కేంద్రమైన కోసిగిలో జరిగిన వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా కోసిగి టౌన్ అధ్యక్షులు పంపాపతి తెలుగు యువత కోసిగి మండల అధ్యక్షులు నాడిగేని మహాదేవ కోసిగి మండల ఉపాధ్యక్షులు కోండగేని వీరారెడ్డి అధ్యక్షతన జరిగిన వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక వాల్మీకి సర్కిల్‌లో వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాల వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగు వాణిజ్య విభాగం జిల్లా ఉపాధ్యక్షులు భరత్వాజ్ శేట్టి బిసి సెల్ నియోజకవర్గం అధ్యక్షులు మాధవరం అమర్నాథ్ రెడ్డితో కలిసి ముఖ్య అతిథిగా హాజరైన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో వాల్మీకి కులానికి అండగా ఉండే పార్టీ తెలుగు దేశం పార్టీ అని వాల్మీకి (బోయ) కులస్థులను యస్‌టి జాబితాలో చేర్చే బాద్యత కూడా తెలుగుదేశం పార్టీదే అని వాల్మీకి కులానికి న్యాయం చేయడం ముఖ్యమంత్రి నారా చంద్రబాబుతోనే సాధ్యం అని వారు అన్నారు. అనంతరం మంత్రాలయం నియోజకవర్గంలో వాల్మీకి కులానికి అండగా ఉంటాం అని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని గ్రామాలు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇంటింటికి ఉచిత కొళాయిలు ఏర్పాటు చేసి తాగునీరు అందించాలి

**- సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసి ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలి. - సిపిఎం డిమాండ్..**



**కర్నూలు,అక్టోబర్ 17 (ఆంధ్రపత్రిక):** కోసిగి మండల కేంద్రమైన కోసిగిలో వెంటనే సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మించి ఇంటింటికి ఉచిత కొళాయిలు ఏర్పాటు చేసి ప్రజలకు తాగునీరు సౌకర్యం కల్పించాలని అదేవి ధంగా కోసిగి మండలంలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేసి కోసిగి మండలంలోని రైతులకు ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలని సిపిఎం డిమాండ్ చేసింది. గురువారం కోసిగిలో సిపిఎం కోసిగి 1..2. శాఖ మహాసభలు పూజారి శ్రీనివాసులు గౌడ్ హనుమంతు అధ్యక్షతన జరిగాయి ఈ మహాసభలు సందర్భంగా ముఖ్య అతిథిగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కే.వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడుతూ కోసిగి మండలం అత్యంత వెనుకబడిన మండలం అని ఈ మండలంలో సాగునీరు సౌకర్యం లేక రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు. కేవలం రైతులు వర్షాధారము మీద ఆధారపడి పంటలు సాగు చేయడం వల్ల ఇక్కడ వ్యవసాయ కూలీలకు సంవత్సరం పొడవునా పనులు దొరికే పరిస్థితి లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో అక్టోబర్ లోనే వలసలు ప్రారంభమయ్యాయని వలసలు ఆపాల్సిన ప్రభుత్వాలు అటువైపు చర్యలు తీసుకోవడం లేదని దీని మూలంగా పిల్లలు చదువులు కూడా అర్థాంతరంగానే ముగిస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కోసిగిలో రైల్వే లైన్ పై ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని ఇక్కడ ప్రజలు కోరుతున్న ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆయన అన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఈ సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించాలని సిపిఎం కోరింది. అనంతరం శాఖ నూతన కార్యదర్శులను ఎన్నుకోవడం జరిగింది. సిపిఎం కోసిగి 1.వ శాఖ కార్యదర్శిగా రాముడు 2.వ శాఖ కార్యదర్శిగా వీరేష్ ఎన్నుకోవడం జరిగింది. ఈ శాఖ మహాసభలో శాఖ సభ్యులు నాగేంద్ర వీరేష్ గోపాల్ హనుమంతు నరసయ్య చిన్నన్న తదితరులు పాల్గొన్నారు.

## వేడుకగా సిద్దేశ్వర కొండపై పౌర్ణమి పూజలు



**బంగారుపాళ్యం,అక్టోబర్ 17 (ఆంధ్రపత్రిక):** చిత్తూరు జిల్లా బంగారు పాళ్యం మండలం కేజీ సత్రం సమీపాన కల చీకూరుపల్లె సిద్దేశ్వర కొండపై వెలసిన సిద్దేశ్వర స్వామికి పౌర్ణమి పూజ వేడుకగా నిర్వహించారు. బుధవారం రాత్రి సిద్దేశ్వర స్వామి కొండపై శివకోటి భజనలు ఆలపించారు. పౌర్ణమి సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకులు వారికి స్వామి వారి ప్రసాదాలు అందజేశారు. అక్కడికి విచ్చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమం చేశారు.

## శ్రీ సాయిబాబాకు విశేష పూజలు



**కల్లూరు, అక్టోబర్ 17 (ఆంధ్రపత్రిక):** పులిచెర్ల సాయిబాబా ఆలయంలో పౌర్ణమి సందర్భంగా గురువారం స్వామివారికి ప్రత్యేక పూజలు ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకం నిర్వహించి అర్చనలు జరిపి విశేషాలంకారంతో అలంకరించారు. భక్తాదులకు అన్న ప్రసాద వితరణ గావించారు. ఆలయ ప్రధాన అర్చకులు రాజశేఖర్ దీక్షితులు పూజా కార్యక్రమాలు జరిపించారు. ఉభయ దారులుగా చంద్రారెడ్డి పుష్పావతి దంపతులు కుమారుడు విష్ణువర్ధన్ రెడ్డి కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

## మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకే..

**అర్బన్ ఎస్ఐ సత్యనారాయణ హెచ్చరిక..**



**బద్వేలు, అక్టోబర్ 17 (ఆంధ్రపత్రిక):** వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడితే జైలుకు వెళ్లడం తప్పదని అర్బన్ ఎస్సై సత్యనారాయణ స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో గురువారం సాయంత్రం వాహనాల తనిఖీచేపట్టారు. ఈ సందర్భంగా అర్బన్ ఎస్.ఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు డ్రైవర్లు మద్యం తాగి వాహనాలు నడపడంతో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. దీనివల్ల ఏ తప్పు చేయని ఎదుటి వ్యక్తులు ప్రాణాల పోతున్నాయని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతూ ఎక్కువ వేగంతో వెళ్లడంతో ప్రాణాలు పోతున్నాయన్నారు. దీనివల్ల ఎన్నో కుటుంబాల్లో విషాదాలు నెలకొంటున్నాయి అన్నారు. వాహనదారులు తప్పనిసరిగా లైసెన్సు కలిగి ఉండాలని అలాగే తలకు హెల్మెట్ ధరించాలని కారు నడిపే వారు సీట్ బెల్ట్ తప్పక ధరించాలని, లైసెన్స్ లేని వాహనాలకు అపరాధ రుసుములు విధించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఈనెల 22న ఆధార్ క్యాంపులు

**గూడూరు, అక్టోబర్ 17(ఆంధ్రపత్రిక):** గూడూరు పురపాలక పరిధిలో ఈనెల 22 నుండి 25వ తేది వరకు సచి వాలయాల్లో ఆధార్ క్యాంపులను నిర్వహిస్తున్నట్లు గూడూరు పురపాలక కమిషనర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. కొత్తగా ఆధార్ నమోదు కొరకు, బయో మెట్రిక్ అప్డేటెడ్, చిరునామా మార్పు కొరకు ఈనెల 22వ తేదీన ఇందిరానగర్-3, చెన్నూరు-2 సచివాలయం, 23వ తేదీన ఇందిరా నగర్-1, చెన్నూరు-1 సచివాలయం, 24వ తేదీన నరసింగ రావు పేట, చెన్నూరు-3 సచివాలయం, ఈనెల 25వ తేదీన మాలవ్య నగర్ -3 సచివాలయం, నెల్లటూరు సచివాలయంలో ఆధార్ క్యాంపులును నిర్వహిస్తున్నామని. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పత్రిక ప్రకటనలో తెలిపారు.

## మాజీ జెడ్పిటిసి ఆధ్వర్యంలో పల్లె పండుగ కార్యక్రమం



**బంగారుపాళ్యం, అక్టోబర్ 17(ఆంధ్రపత్రిక):** చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాళ్యం మండలం కల్లూరుపల్లి పంచాయతీ కొరివారిపల్లి గ్రామంలో గురువారం పల్లె పండుగ కార్యక్రమం మాజీ జెడ్పిటిసి కళావతి మహేంద్ర ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పిటిసి మాట్లాడుతూ పల్లెల్లో ఎటువంటి సమస్యలు లేకుండా ఉండేవిధంగా చూడడమే ఈ పల్లె పండుగ కార్యక్రమాన్ని మన కూటమి ప్రభుత్వం తీసుకువచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ భారతి,మాజీ ఎంపిటిసి వేణు,కర్ణారెడ్డి,చీకూరుపల్లి రవి, మున స్వామి, భాగ్యరాజ,ఉపాధి హామీ ఎపిఎం కిరణ్,సిసి ఆశా, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది,స్థానిక టిడిపి నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పురంలో ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు



**హిందూపురం, అక్టోబర్ 17 (ఆంధ్రపత్రిక):** వాల్మీకుల ఆరాధ్య దైవం వాల్మీకి మహర్షి జయంతి మహోత్సవ కార్యక్రమం గురువారం పట్టణంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి కుల బాంధవులతో పాటు టిడిపి, జనసేన, బిజెపి తదితర రాజకీయ పార్టీ నాయకులు వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి తమ భక్తిని చాటుకున్నారు. మేళ తాళాలతో వాల్మీకుల మహిళలు, బాలికలు ఎంతో భక్తి శ్రద్ధలతో జ్యోతుల మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. చిన్న మార్కెట్ నుండి వాల్మీకి విగ్రహం వరకు వాల్మీకి మహర్షి ముత్యాల పల్లకి మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఎంతో భక్తితో మహిళలు, బాలికలు జ్యోతుల మోసుకొని ఊరేగింపుగా వెళ్లి వాల్మీకి మహర్షి విగ్రహం ప్రదర్శన గావించి పూజలు నిర్వహించి తమ భక్తుని చాటుకున్నారు. అదేవిదంగా వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో భక్తాదులకు తీర్థప్రసాదాలు అన్నదానం గావించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ వాల్మీకి మహర్షికి ఎంతో ఘనమైన చరిత్ర గలదని ఆయన రచించిన రామాయణంలో సమాజానికి ఉపయోగపడే ఎన్నో ఉన్నాయన్నారు. వాల్మీకి మహర్షి ఆశయానికి అనుగుణంగా ప్రతి ఒక్కరు నడుచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతి వాల్మీకి భక్తి భావాలను పెంపొందించుకొని ఆధ్యాత్మికంగా ఎదుగుతూ సమాజ అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం అధ్యక్షుడు ఆదినారాయణప్ప, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శులు డాక్టర్ సురేంద్ర, శ్రీనివాసరావుతో పాటు వాల్మీకి సంఘం నాయకులు వైటిపి శ్రీనివాసులు, డిఈ రమేష్, వెంకటరమణ, నెట్టప్ప, లోకేష్, సుగురు హనుమంతు, జనసేన నాయకులు ఆకుల ఉమేష్, చక్రి, శేఖర్‌తో పాటు పెద్ద ఎత్తున వాల్మీకి సోదరులు, మహిళలు పాల్గొన్నారు.

# పొలం పిలుస్తుంది కార్యక్రమం

**మిరప పత్తి పంటలో వచ్చే తెల్లదోమ తామర పురుగులు, తెగుళ్లు నివారణ గురించి రైతులకు అవగాహన కల్పించిన కేవికే బనవాసి శాస్త్రవేత్త డి.ఆర్.వై మౌనిక**




**కర్నూలు, అక్టోబర్ 17(ఆంధ్రపత్రిక):** కోసిగి మండల పరిధిలోని సాతనూరు అగసనూరు గ్రామాలను సందర్శించడం జరిగిందని కేవికే బనవాసి శాస్త్రవేత్త డి.ఆర్.వై.మౌనిక ఈ సందర్భంగా మాట్లాడుతూ మిరప మరియు పత్తి పంటలో వచ్చే పురుగులు మరియు తెగుళ్లు నివారణ గురించి రైతులకు వివరించడం జరిగింది. మరి మిరపలో వచ్చే తెల్లదోమ మరియు తామర పురుగులు నివారణకు ఒక ఎకరాకు 20.వరకు నీలి మరియు పసుపు రంగు అట్టలను పెట్టుకోవాలని అన్నారు. మరి రసంపీల్చు పురుగుల నివారణకు ఇతియోఫెన్ ప్రాక్స్ ఫ్లస్ డయోఫెంతి యోరాన్ 1.గ్రామ్ 1.లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని మరి వరిలో వచ్చే ఆకుముడత తెగులు నివారణకు క్వినాల్ ఫాస్ 25.ఎంఎల్ లీటర్ నీటికి లేదా ప్రోఫీనోఫాస్ 2.ఎంఎల్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని మరి జిల్లా వనరుల కేంద్రం నుండి వచ్చిన సహాయ వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు వరి మరియు పత్తిలో ఎరువుల యాజమాన్యం గురించి తెలిపారు. మరి పైపాటుగా భాస్వరం ఎరువులను వాడరాదని అవసరమైన మేరకు ఎరువులను వాడాలని సాగు ఖర్చులను తగ్గించుకో వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కోసిగి మండల వ్యవసాయ అధికారి కె.రాజు కేవికే.బనవాసి శాస్త్రవేత్త డి.ఆర్.వై.మౌనిక జిల్లా వనరుల కేంద్రం నుండి ఏ.డి. ఏ.వెంకటేశ్వర్లు ఏఓ.శశిధర్ రెడ్డి ఏపీఎంఐఏఓ.నాగరాజు సాతనూరు అగసనూరు గ్రామ వ్యవసాయ ఉద్యాన శాఖల సిబ్బంది పశుసంవర్ధక మత్స్య శాఖల సిబ్బంది చంద్రకళ మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు

**వాల్మికులను ఎస్టీ జాబితాలో చేర్చే భాధ్యత చంద్రబాబుదే.**

**వేరు వేరుగా కూటమి నాయకుల కార్యక్రమాలు**

**వాల్మీకి జయంతిని ప్రభుత్వం కార్యక్రమంగా గుర్తుంచిన కూటమి ప్రభుత్వనికి ధన్యవాదాలు**

**టీడీపీ ఇంచార్జ్ రాఘవేంద్ర రెడ్డి**



**మంత్రాలయం, అక్టోబరు 17 (ఆంధ్రపత్రిక):** నియోజకవర్గం కోసిగి టౌన్ లోని వాల్మీకి జయంతి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మంత్రాలయం టీడీపీ ఇంచార్జ్ ఎన్.రాఘవేంద్ర రెడ్డి హాజరయ్యారు. ఆయన వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ వాల్మీకుల ఐక్యంగా ఉండాలని మనలో ఐక్యత లేక అగ్ర వర్ణాలు మనల్ని అణగదొక్కుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేసారు వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే విషయం ఒక్క కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని అన్నారు. నియోజకవర్గంలో వేరు వేరుగా వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు జరిగాయి. మంత్రాలయంలో మండల తెదేపా కన్వీనర్ పన్నగ వెంకటేశప్ప స్వామి,కృష్ణమోహన్ రెడ్డి, నరసింహులు, విజయారామిరెడ్డి,యోబు టీడిపి ఇంచార్జి రాఘవేంద్ర రెడ్డి సోదరులు రామక్రిష్ణ రెడ్డి,తనయులు రాకేష్ రెడ్డి,వరదరాజులు, అశోక్ రెడ్డి, శివ,డేవిడ్,కోసిగిలో శ్రీనివా సరెడ్డి, పెద్దకడబూరులో రాష్ట్ర రైతు అధికార ప్రతినిధి నరవ రమాకాంత్ రెడ్డి, బసలదొడ్డి ఈరన్న, బొగ్గుల తిక్కన, కౌతాలంలో సురేష్ నాయుడు వేరు వేరుగా కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ, పార్లమెంట్ జిల్లా ఉపాధ్యక్షులు ముత్తతెడ్డి, మాజీ డిసిసి నీటి సంఘం అధ్యక్షులు పల్లెపాడు రామిరెడ్డి, కన్వీనర్ జ్ఞానేశ్, మాజి సర్పంచ్ వక్రాణి వేంకటేశులు, టౌన్ అధ్యక్షులు నర్సారెడ్డి, నాడిగేని అయ్యన్న, కోసిగయ్య మాల పల్లి లక్ష్మన్న, పోతుల వీరేష్, మధు, ఐరనగల్లు బసవ మండల వాల్మీకి సోదరులు,నాయకులు పాల్గొన్నారు.

## తుఫానుతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

**నష్టపోయిన వరి పంట పొలాలను పరిశీలించిన ఏపీ రైతు సంఘం కడప జిల్లా నాయకులు**



**ఖాజీపేట,అక్టోబర్ 17 (ఆంధ్రపత్రిక):** జిల్లాలో అల్పపీడన ద్రోణి ప్రభావం కారణంగా వరి, ఉద్యానవన పంటలకు నష్టం వాటిల్లిందని తక్షణమే జిల్లా వ్యవ సాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేసి నష్టపరి హారాన్ని ఇవ్వాలని ఏపీ రైతు సంఘం కడప జిల్లా కార్యదర్శి బి.దస్తగిరి రెడ్డి తెలిపారు. గురువారం ఖాజీపేట మండల పరిధిలో చెన్న ముక్కపల్లి పంచాయతీ ములపాక, దౌళతాపురం గ్రామాలలో తుఫానుతో నష్టపోయిన వరి పంట పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలు వరదల వల్ల పంటలు నష్టపోయిన రైతులు, కౌలు రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు జిల్లాలో పెన్నా పాపాగ్ని నదీ పరివాహక ప్రాంతాల్లో బోరు బావుల కింద వేలాది ఎకరాలు వరి కోత దశకు వచ్చిందని ఈ తుఫానుతో తీవ్ర నష్టం వాటిల్లిందని అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. పంట నష్టాల నమోదు నిబంధనలు సవరించి పంట ఏ మేరకు నష్టం జరిగినా ఎన్యుమరేషన్ చేసి నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. నష్టాల నమోదులో కౌలు రైతుల పేర్లనే నమోదు చేయాలన్నారు. ఉద్యాన, వాణిజ్య పంటలకు కూడా ఇన్ పుట్స్ సబ్సిడీ పెంచాలని కోరారు. పంటల బీమా పరిహారం అందేలా చర్యలు చేపట్టాలన్నారు. దెబ్బతినడం మరలా పంటలు వేయడం పెట్టుబడి పెట్టడం వలన రైతు తీవ్రంగా అప్పుల ఊబిలో కూరుకు పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో రైతులు, కౌలు రైతుల పంట రుణాలు మాఫీ చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకుల సుబ్బారెడ్డితో పాటు బాధిత రైతులు పాల్గొన్నారు.

## పల్లె పండుగతో పల్లెలకు ప్రగతి



**హిందూపురం, అక్టోబర్ 17 (ఆంధ్రపత్రిక):** రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన పల్లె పండుగ కార్యక్రమంతో పల్లెలు అభివృద్ధి చెందడానికి అవకాశం ఉందని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వ్యక్తిగత సహాయకులు డాక్టర్ సురేంద్ర, శ్రీనివాసరావులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా హిందూపురం రూరల్ పూలకుంట పంచాయతీ మరవపల్లి గ్రామంలో పల్లె పండగ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం మంజూరు చేసిన 50 లక్షల రూపాయల నిధులతో సిసి రోడ్లు నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వంలో కనీస మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టుల నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పిఏ బాలాజీ, నాయకులు రామకృష్ణారెడ్డి, ఉమా శంకర్ రెడ్డి,సర్పంచ్ మంజునాథ్, పాపన్నతో పాటు తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.


ఆంధ్రపత్రిక

స్వాతంత్ర్య సమరానికి అక్షరాయుధాలు అందించిన ఏకైక దినపత్రిక -1914

తిరుపతి జిల్లాకు విలేకరులు కావలెను

చంద్రగిరి, తిరుపతి, వెంకటగిరి, సత్యవేడు, సూళ్లూరుపేట, అన్ని నియోజకవర్గ, మండలాలకు విలేకరులు కావలెను

చిల్లకూరు, వెంకటగిరి, నాయుడుపేట, తడ, వరదలపాలెం, సత్యవేడు, రేణిగుంట, ఏర్పేడు, కుమారవెంకట భూపాలపురం, తిరుపతి అర్బన్, రూరల్, చంద్రగిరి, రామచంద్రపురం, పుత్తూరుమండలాలకు రిపోర్టర్‌లు కావలెను

ఆసక్తి గల వారు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు

CELL NEMBER : 8639287624, 9849998069

EMAIL : ANDHRAPATRIKADAILY@GMAIL.COM

# కూటమి ప్రభుత్వంలోనే గ్రామాలకు మహర్దశ

**- మాజీమంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి**



**నల్లమాడ, అక్టోబర్ 17(ఆంధ్రపత్రిక):**గ్రామాలకు మహర్దశ కల్పిస్తామని పుట్టపర్తి నియోజకవర్గ టిడిపి ఇన్ఛార్జ్ మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా 4500 కోట్లతో 30వేల పనులను చేపడుతోందని అన్నారు.పుట్టపర్తి నియోజకవర్గంలోని నల్లమాడ మండల కేంద్రంలో రూ.1 కోటి 31 లక్షలతో మంజూరైన పలు అభివృద్ధి పనులకు మాజీ మంత్రి పల్లె భూమి పూజ చేశారు.నల్లమాడ మండలంలోని అన్ని గ్రామాలకు కలిపి రూ.3 కోట్ల నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి పల్లె మాట్లాడుతూ...కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.4500 కోట్లతో గ్రామాల అభివృద్ధికి ఈ ప్రభుత్వం బాటలు వేసిందని పేర్కొన్నారు.గ్రామాల అభివృద్దే చంద్రబాబు ధ్యేయమని అన్నారు.దేశంలో ఎక్కడ లేనివిధంగా రాష్ట్రవ్యాప్తంగా 30వేల పనులకు రూ.4500 కోట్లతో అభివృద్ధి పనులుకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు.పుట్టపర్తి నియోజకవర్గంలో సుమారు 20 కోట్లకు పైగా నిధులతో అన్ని గ్రామాల్లో సిసి రోడ్లు డ్రైనేజీ కాలువలు నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు.ఈరోజు నల్లమాడ పంచాయతీలో 41 రోడ్లకు కోటి 30 లక్షలు కేటాయించినట్లు వెల్లడించారు.గత ఐదేళ్ల వైసిపి పాలనలో గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి జరగలేదని పేర్కొన్నారు.జగన్ పాలనలో పంచాయతీలను పూర్తిగా నిర్వీర్యం చేశారని ఎద్దేవా చేశారు. టిడిపి కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్ర ప్రగతి పథంలో ముందుకు పోతోందన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో రోడ్లు త్రాగునీరు, పారిశుద్ధ్యం వీధిలైట్లు ఏర్పాటు చేసి పలు అభివృద్ధి పనులు వేగవంతం చేస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం చొరవతో రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో అభివృద్ధికి బీజం పడిందన్నారు. వైసిపి ప్రభుత్వ హయంలో గ్రామాల్లో ఎక్కడా నయా పైసా అభివృద్ధి జరగలేదని మండిపడ్డారు. ఇక గ్రామాల్లో ప్రగతి పుంజుకుంటుందని అందుకు ప్రజల సహకారం ఎంతో అవసరం అన్నారు.

ఈ కార్యక్రమంలో నల్లమాడ మండల కన్వీనర్ మైలే శివశంకర్, టిడిపి నాయకులు మాజీ కన్వీనర్ కేశవరెడ్డి సలాం ఖాన్, అబ్బాస్ ఖాన్, రాయుడు శివారెడ్డి, కేశవ రెడ్డి,మంజునాథ్ రెడ్డి, మల్లికార్జున రెడ్డి, రామచంద్ర, బాబావలి, నరసింహులు, మణి మల, అరవింద్, జనసేన, బిజెపి నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా పౌర్ణమి గరుడసేవ



**తిరుమల, అక్టోబరు 17 (ఆంధ్రపత్రిక):** తిరుమలలో గురువారం రాత్రి పౌర్ణమి గరుడసేవ వైభవంగా జరిగింది. రాత్రి 7 గంటలకు సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్ప స్వామివారు గరుడునిపై ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. గరుడ వాహనం- సర్వపాప ప్రాయశ్చిత్తం పౌరాణిక నేపథ్యంలో 108 వైష్ణవ దివ్యదేశాలలోనూ గరుడసేవ అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకుంది. గరుడవాహనం ద్వారా స్వామివారు దాసానుదాస ప్రపత్తికి తాను దాసుడని తెలియజెబుతారు. అంతేగాక జ్ఞానవైరాగ్య ప్రాప్తికోరే మానవులు జ్ఞానవైరాగ్య రూపాలైన రెక్కలతో విహరించే గరుడుని దర్శిస్తే సర్వపాపాలు తొలగుతాయని భక్తకోటికి తెలియజెబుతున్నాడు. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్ స్వామి, టీటీడీ సీవీఎస్వో శ్రీధర్, తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు, డిప్యూటీ ఈఓ భాస్కర్, పేష్కార్ రామకృష్ణ, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### శ్రీ కోదండరామాలయంలో ఘనంగా

# అష్టోత్తర శతకలశాభిషేకం

**తిరుమల, అక్టోబరు 17 (ఆంధ్రపత్రిక):**తిరుపతి శ్రీకోదండ రామస్వామి వారి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా గురువారం అష్టోత్తర శతకలశాభిషేకం వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా ఆలయంలోని కల్యాణ మండపంలో ఉదయం 9 నుండి 10.30 గంటలకు అమ్మవారు, స్వామివార్ల ఉత్సవమూర్తులకు 108 కలశాలతో అభిషేకం చేశారు.ఈ సందర్భంగా సాయంత్రం 5.30 గంటలకు శ్రీ సీత లక్ష్మణ సమేత శ్రీకోదండరామ స్వామివారి ఉత్స వ మూర్తులకు ఆలయంలో ఆస్థానం నిర్వహించనున్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో నాగరత్న, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు





**దేవనకొండ,అక్టోబర్ 17 (ఆంధ్రపత్రిక):**దేవనకొండ మండల కేంద్రంలో వాల్మీకి జయంతి వేడుకలను అట్టహాసంగా నిర్వహించుకున్నారు స్థానిక వాల్మీకి మహర్షి దేవాలయము నందు ఉదయం వాల్మీకి విగ్రహం కు ప్రత్యేక పూజలు చేసి నూతన వస్త్రాలతో అలంకరించారు. సాయంత్రం వాల్మీకి చిత్రపటంను డీజే నందు గ్రామ పురవీధుల నుండి ఊరేగింపు కొనసాగించారు. ఈ కార్యక్రమంలో యువకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో వాల్మీకి పండుగను రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయలలో వాళ్లకి వాల్మీకి పండుగను ఘనంగా నిర్వహించుకోవాలని జీవోను విడుదల చేయడం పట్ల ఏమి ఒరిగేది లేదని వాల్మీకి జయంతి రోజున సెలవు దినం ప్రకటిస్తూ ఏళ్ల తరబడి మేము కోల్పోయిన యస్‌టీ రిజర్వేషన్ను పునరుద్ధరణ చేసినప్పుడే నిజమైన వాల్మీకి జీవో విడుదల చేసినట్లు అవుతుందని కేవలం వాల్మీకి బోయలను ఓట్ బ్యాంకును వాడుకుంటున్నారే తప్ప ఇంతవరకు ఏ ప్రభుత్వం కూడా వాల్మీకి ఎస్టీ అంశంపై చర్చించిన దాఖలు లేవని ప్రభుత్వాలు మారుతున్నాయి తప్ప మారడం లేదని ఎస్టీ రిజర్వేషన్ ద్వారా వాల్మీకి జాతి చాలా నష్టపోయిందని ఇది రాజకీయ నాయకులకు తెలియడం లేదా అని సూటిగా ప్రశ్నించారు గత ప్రభుత్వంలో వాల్మీకులను ప్రాంతాలు వారీగా విభజించి తూతూ మంత్రంగా కమిషన్ వేసి పార్లమెంటులో రిజర్వేషన్ అంశమును నానుస్తూ కాలయాపన చేసినందుకే గత ప్రభుత్వానికి బుద్ధి చెప్పామని ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో రిజర్వేషన్ అంశమును కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి వాల్మీకులు కోల్పోయిన ఎస్టీ రిజర్వేషన్ను పునరుద్దించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నరేష్ రాముడు రాజు సుధాకర్ రంగన్న ఓబ్లేశు లక్ష్మన్న అత్యధిక సంఖ్యలోయువకులు పాల్గొన్నారు.

### జీవితంలో మనిషి ఎలా ఉండాలో రామాయణంలో

# చూపిన ఆదికవి వాల్మీకి మహర్షి

**- మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి**



**పుట్టపర్తి, అక్టోబర్ 17 (ఆంధ్రపత్రిక):**పుట్టపర్తి నియోజకవర్గ పరిధిలోని కొత్తచెరువు,బుక్కపట్నం మండల కేంద్రంలలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలకు ముఖ్య అతిథిగా మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి హాజరయ్యారు.వాల్మీకి మహర్షి విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు.వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా వాల్మీకి సంఘ సభ్యులు ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె పాల్గొన్నారు.అంతకు ముందు కొడవగానిపల్లిలో వాల్మీకి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.అందరికీ స్వీట్స్ పంచి పెట్టారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ...తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగ నిర్వహిస్తామని యువనేత నారా లోకేష్ గత పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈరోజు రాష్ట్రవ్యాప్తంగా ఒక పండుగ ఉత్సవంలా వాల్మీకి జయంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని పేర్కొన్నారు.వాల్మీకి రామాయణాన్ని రచించిన ఆదికవి వాల్మీకి మహర్షి అన్నారు.ఒక భార్య ఎలా ఉండాలో సీతాదేవి రాముని చరిత్ర రామాయణంలో రచించిన అద్భుతమైన కవి అన్నారు. అన్నదమ్ములు ఎలా ఉండాలో రామ్ లక్ష్మణులు మెలిగిన తీరును రామాయణంలో ప్రస్తావించారు. అదే విధంగా నమ్మకస్తుడిగా,విశ్వాస పపాత్రుడిగా హనుమంతుడు రాముడు అనుబంధాన్ని రామాయణంలో చూపించారు.ఒక దుర్మార్గుడు రావణాసురుడు అప్పట్లో వ్యవహరించిన అనుబంధంపై ఎంతో చాకచక్యంగా రామాయణంలో మానవీయ కథనాలను ప్రపంచానికి అందించిన ఆదికవి వాల్మీకి మహర్షి అని కొనియడారు.వాల్మీకి మహర్షికి ఎవరు సాటిలేరని అభివర్ణించారు.స్థానిక వాల్మీకి నాయకులు టిడిపి బిజెపి జనసేన నాయకులు కార్యకర్తలు హాజరయ్యారు.

### రీ సర్వే సమస్యలపై

# గ్రామ సభల్లో పరిష్కారం



**ఎమ్మిగనూరు. అక్టోబర్ 16 (ఆంధ్రపత్రిక):** మండల పరిధిలోని గ్రామ పంచాయతీల్లో రీ సర్వే పూర్తైయిన 16 గ్రామాల్లో అక్టోబర్ 18 వ తేదీ నుంచి నవంబర్ 12 వ తేదీ వరకు జరిగే గ్రామ సభల్లో రీ సర్వే సమస్యలపై రైతులు వినతులు ద్వారా సమస్యలు పరిష్కారం చేసుకోవాలని తహసీల్దార్ శేషఫణి పేర్కొన్నారు. గురువారం తహశీల్దారు కార్యాలయం నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తహశీల్దార్ మాట్లాడుతూ రీ సర్వే సంబంధించిన సమస్యలను వినతులు ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని రైతులకు సూచించారు. మీ గ్రామం నందు జరిగే గ్రామ సభకు హాజరై అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జరిగే గ్రామ సభలు ముందుగా నేడు 18 వ తేదీన బనవాసి గ్రామం. 19వ తేదీన దేవబెట్టు గ్రామం. 22వ తేదీన దైవం దిన్నె గ్రామం. 23వ తేదీన ఏనుగుబాల గ్రామం. 24 వ తేదీన గార్లదిన్నె గ్రామం. 25వ తేదీన కె.తిమ్మాపురం గ్రామం. 26 వ తేదీన మల్కాపురం. 29 వ తేదీన పార్ల పల్లి గ్రామం. 30వ తేదీన పెసలదిన్నె గ్రామం నవంబర్ 1వ తేదీన రాళ్ళ దొడ్డి గ్రామం. 2వ తేదీన సర్దార్ పురం 5వ తేదీన సోగునూరు గ్రామం. 6వ తేదీన టిఎస్.కూలూరు. 7వ తేదీన కలుగట్ల గ్రామం 8వ తేదీన కడివెళ్ళ గ్రామం. 9వ తేదీన కందనాతి గ్రామంలో జరుగనున్న రీ సర్వే సమస్యలపై గ్రామ సభల్లో పరిష్కరించుకోవాలని సూచించారు.

# పంటల సాగులో మేళకువలు అవసరం



**అమడగూరు, అక్టోబర్ 17 (ఆంధ్రపత్రిక):**వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలను పాటించడం ద్వారా రైతులు సాగు వ్యయం తగ్గించుకుని అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అధికారులు ఏపీఎస్‌ఓపిసిఏ డాక్టర్ రవి,కదిరి సహాయ వ్యవసాయ సంచాలకులు సత్యనారాయణ అన్నారు.గురువారం మండల పరిధిలోని చెర్లోపల్లి గ్రామంలో మండల వ్యవసాయ అధికారి వెంకటరమణాచారి ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు.క్షేత్రస్థాయిలో పంట పొలాలను పరిశీలించి రైతులకు తగు సూచనలు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...రైతులు వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకొని నూతన యజమాన్య పద్ధతులు అవలంబిస్తూ తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి పొందాలన్నారు.పంటల సాగులో మేళకువలు కూడా అవసరమన్నారు.తక్కువ పురుగుమందుల వాడకం,తెగులు మందులు వాడి వ్యాయాన్ని తగ్గించుకోవాలని మొదలగు అంశాలపై రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నల్ ఇన్స్ట్రక్టర్స్ ఏవో సుమతి,ఏఈఓ వెంకటేష్, మండల వ్యవసాయ అధికారి ఐ.వెంకట రమణాచారి, హార్టికల్చర్ అసిస్టెంట్లు అపర్ణ,పవన్ కళ్యాణ్, విఏఏ మనోజ్, ప్రభాకర్, జడ్బియన్ఎఫ్ సిబ్బంది,రైతులు తదితరులు పాల్గొన్నారు.

# శనగ విత్తనాల పంపిణీ కార్యక్రమం పరిశీలన



**బేస్తవారిపేట అక్టోబర్ 17. (ఆంధ్రపత్రిక):** బేస్తవారిపేట మండలంలోని నెకునంబాద్ గ్రామంలో జరుగుతున్న రాయితీ శనగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ఏడిఏ బాలాజీ నాయక్ మండల వ్యవసాయ అధికారి జక్కం మెర్సీతో కలిసి పరిశీలించారు.కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ "శనగ విత్తనాలు అవసరమైన రైతులు సంబంధిత రైతు సేవ కేంద్రంలోని సిబ్బందిని సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, ఒక క్వింట శనగ పూర్తి ధర 9400/- గాను , 25% శాతం సబ్సిడీ తో 7050/- రూపాయలకే ఇస్తున్నామని, ఒక ఎకరాకు 40 కేజీల చొప్పున గరిష్టంగా 5 ఎకరాల వరకు తీసుకోవచ్చని తెలిపారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి మెర్సీ మాట్లాడుతూ "బేస్తవారిపేట మండలానికి 561 క్వింటాలు కేటాయించడం జరిగింది.నేటికీ 164 మంది రైతులకు గాని 231 క్వింటా రిజిస్ట్రేషన్ చేయడం జరిగింది అని తెలిపారు. శనగ విత్తనాలు అవసరమైన రైతుల మాత్రమే రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని దుర్వినియోగపరచినట్లయితే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు సత్యనారాయణ మరియు రైతులు పాల్గొన్నారు.

### వైభవంగా సత్యనారాయణ

# స్వామి వ్రతం



**ఐరాల అక్టోబర్ 17 (ఆంధ్రపత్రిక):**కాణిపాకం వైభవంగా సత్యనారాయణ స్వామి వ్రతం. కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానం అనుబంధ దేవాలయమైన శ్రీదేవి భూదేవి సమేత వరదరాజ స్వామి వారి ఆలయం నందు గురువారం పౌర్ణమి సందర్భంగా వైభవంగా సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం నందు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని వారి వారి ముక్కులను తీర్చుకున్నారు అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలను అందుకున్నారు. ఈ స్వామి వారి కార్యక్రమంలో పరిసర ప్రాంత గ్రామస్తులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యానవన పంటలను తుఫాన్ సమయంలో సంరక్షించాలి



**కల్లూరు,అక్టోబర్ 17 (ఆంధ్రపత్రిక):**తుఫాను సమయంలో ఉద్యాన పంటల సంరక్షణ చర్యలు చేపట్టి పంటలను కాపాడుకోవాలని చౌడేపల్లి డివిజన్ ఉద్యానవన శాఖ అధికారిని సంతోషి కుమారి తెలిపారు ప్రస్తుతం జిల్లాలో తుఫాను కారణంగా చౌడేపల్లి, సోమల ,సదుం, పులిచెర్ల రొంపిచర్ల మండలాల్లో నిస్తారంగా టమోటా చామంతి బొప్పాయి అరటి సాగు చేశారని ఈ పంటలకు ఉద్యానవన శాఖ అధికారులు సూచనలు పాటించి కాపాడుకోవాలన్నారు. టమోటా.. జిల్లాలో సాగుచేసిన టమోటా పంట అధిక వర్షాలు వల్ల పొలాల్లో నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి కర్రల సహాయంతో ఊతం ఇవ్వాలి. వర్షం సమయంలో కోతలు చేయరాదు. కోతకు సిద్ధంగా ఉన్న వాటిని కోసి ప్రదేశంలో సరైన ప్రసరించే గాలి ప్రసరించే ప్రదేశంలో ఉంచుకోవాలి. అధికారులు తెలిపిన విధంగా మచ్చలు ,తెగులు రాకుండా ముందు జాగ్రత్త చర్యగా మందులు పిచికారి చేయాలి. చామంతి ,బంతి.... పొలాల్లో నీరు నిలవకుండా జాగ్రత్తలు వహించాలి. నీరు నిలిస్తే వేరుకుళ్ళు తెగులు వ్యాపిస్తుంది.బొప్పాయి. బొప్పాయి కోతకు సిద్ధంగా ఉన్న వాటిని ముందుగానే కోత కోసి విక్రయించుకోవాలి. కోతకు వచ్చిన పనులను ప్యాక్ హౌస్‌లలో నిల్వ ఉంచుకోవాలి.అరటి గెలలు ఉన్న అరటి తోట రైతులు పెను గాలులతో కూడిన వర్షం వల్ల చెట్లు పడిపోకుండా ముందు జాగ్రత్తగా కర్రల సహాయంతో ఊతం ఇవ్వాలి. కోతకొచ్చిన గెలలను ముందుగానే కోత కోసి విక్రయించుకోవాలి. ఇతర కూరగాయల తోటలలో నీరు నిలవండి పంటలు కుళ్ళిపోకుండా వర్షపు నీరు బయటకు పోయే విధంగా తగు జాగ్రత్తలు తీసుకోవాలి.



దుగ్గిరాల మండలంలోని చింతలపూడి గ్రామంలో జరిగిన రీ సర్వేను పరిశీలించిన కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ డిపార్ట్మెంట్ ఆఫ్ ల్యాండ్ రిసోర్స్ సెక్రెటరీ మనోజ్ జోషి....



### ప్రభుత్వ దుకాణాల

# మద్యం నిల్వలు సీజ్



**ఎమ్మిగనూరు. అక్టోబర్ 17 (ఆంధ్రపత్రిక):** ఎమ్మిగనూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ మద్యం దుకాణాలు ముగింపు కారణంగా ప్రభుత్వ మద్యం దుకాణాల స్టాక్ నిల్వలను సీజ్ చేసి కర్నూలు డిపోకు పంపించడం జరిగిందని ప్రొహిబి షన్ ఎక్సైజ్ సీఐ రమేష్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ నందు విలేకరుల సమావేశంలో ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ మాట్లాడుతూ ప్రభుత్వ మద్యం దుకాణాలు 15 తేదీ వరకు వున్న నిల్వల స్టాక్‌ను సేల్స్ మ్యాన్. సూపర్వైజర్లు సీజ్ చేసి పంచనామా ద్వారా కర్నూలు డిపోకు తరలిం చారు. పట్టణంలోని ఎల్ ఎస్టీ దుకాణం నందు వున్న స్టాక్ నిల్వలు సుమారుగా 313 లింకర్ల బాక్సులు. 13 బీర్ బాటిల్స్ వున్నాయి. కాచాపురం మద్యం దుకాణంలో సుమారుగా 8 బాక్సులు వున్నారన్నారు.

# ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి

**- ఎమ్మెల్యే బివి జయ నాగేశ్వర రెడ్డి**

**-వాల్మీకి జయంతి వేడుకలు**



**ఎమ్మిగనూరు. అక్టోబర్ 17 (ఆంధ్రపత్రిక):**రామాణాన్ని రచించిన వాల్మీకి మహర్షి మానవాళికి మార్గ నిర్దేశం మని ఎమ్మెల్యే బివి జయ నాగేశ్వర రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని పోస్టు ఆఫీస్ భవన స్థలం నందు వాల్మీకి నాయకులు ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బివి జయ నాగేశ్వర రెడ్డి హాజరై వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముందుగా వాల్మీకి నాయకులందరు ఎమ్మెల్యే బివి జయ నాగేశ్వర రెడ్డికి గజమాలతో సన్మానించారు. విద్యార్థినీలకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బివి మాట్లాడుతూ అధర్మం నుంచి ధర్మం, అసత్యం నుంచి సత్యం వైపు సమాజాన్ని నడిపించాలన్నదే వాల్మీకి మహర్షి ఆశయమన్నారు. బడుగు బలహీన వర్గాలకు టీడీపీ పార్టీ ఎల్లప్పుడు అండగా నిలుస్తూ వస్తుందన్నారు. గత 40 ఏళ్లుగా నా తండ్రి మాజీ మంత్రి బీవీ మోహన్ రెడ్డి బీసీలకు అండగా నిలుస్తూ, మీ ఆశీస్సులతో ఐదు సార్లు ఎమ్మెల్యేగా మంత్రిగా గెలిచారన్నారు. ఆయన తనయుడుగా నన్ను కూడా ప్రజల ఆశీర్వాదంతో రెండో సారి ఎమ్మెల్యేగా గెలిపించడం మీరందరికి కృతజ్ఞతలు అన్నారు. గతంలో నా తండ్రి బీవీ మోహన్ రెడ్డి వాల్మీకి భవన నిర్మాణానికి స్థలాన్ని కేటాయించారని గుర్తు చేశారు. ఈ స్థలంలోని ఈరోజు వాల్మీకి జయంతిని జరుపుకుంటునందుకు ఆనందంగా ఉందన్నారు. 2014లో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు భవన నిర్మాణానికి 65 లక్షల నిధులు తీసుకొచ్చినట్లు ఎమ్మెల్యే గుర్తు చేశారు. కూటమి పాలనలో వాల్మీకి భవన నిర్మాణానికి వెనక్కి వెళ్లిన నిధులను తీసుకొచ్చి అతి త్వరలోనే వాల్మీకి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి పనులు ప్రారంభించడం జరుగుతుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. పెద్దల ఆశీస్సులతో జరిగే కార్యక్రమాలు విజయవంతం అవుతాయన్నారు. అన్ని మతాలను గౌరవించాలన్నదే దేశంలో ఉన్న ప్రభుత్వం, మన రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వం ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, వాల్మీకి నాయకులు సభ్యులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## ఘనంగా హజరత్ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీ బాగ్దాది

# బాబా వారి ఉరుసు మహోత్సవాలు

### బాబా దర్గాలో చాదర్ సమర్పణ విశ్వ శాంతికై ప్రత్యేక ప్రార్థనలు నిర్విరామ అన్న సమారాధన





**ఎ.కొండూరుఅక్టోబర్ 17 (ఆంధ్రపత్రిక) :** సూఫీ ఆధ్యాత్మిక చక్రవర్తి హుజూర్ హజరత్ సయ్యద్ ఖాదర్ ఔలియా వారి ప్రియ శిష్యులు, ఆరున్నర దశాబ్దాల నిర్విరామ అన్నదాన మహా యజ్ఞకులు నఖీబుల్ ఔలియా బాబా సూఫీ ఖ్వాజా హజరత్ ముహమ్మద్ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీ ఔలియా (ర. అ) ఉరుసు మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఎన్టీఆర్ జిల్లా చీమలపాడు ఏఏఎంటికే దర్గా,దర్బార్ షరీఫ్ లో సజ్జదా నషీన్ పీర్జాదా ముహమ్మద్ ఖాజా మొహియుద్దీన్ షా తాజ్ ఖాదరీ







ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగే ఈ వేడుకలకు వేలాదిమంది భక్తులు తరలి వచ్చారు. ఈ ఉరుసు మహోత్సవాలు బుధవారం నుండి ప్రారంభం కాగా, గురువారం మహా పర్వమైన గంధం షరీఫ్(సందల్ షరీఫ్) అత్యంత వేడుకగా, కన్నుల పండుగగా జరిగింది. డప్పు వాయిద్యాలు, మేళ తాళాలు, పకీరు మేళాలు సందడి నడుమ బాబా తనయులైన చీమలపాడు దర్గా సూఫీ పీఠాధిపతి ముహమ్మద్ ఖాజా మొహియుద్దీన్ షరీఫ్ షా, విజయనగరం ఖాదర్ బాబా దర్గా ముతవల్లి ముహమ్మద్ ఖలీలుల్లా షరీఫ్ షా, మొహమ్మద్ జాఫర్ సిద్ధిఖీ, మొహమ్మద్ ఖాదర్ బాబు, సోదరి బొగ్దాద్ తదితరులు వేలాది మంది భక్తులతో ఊరేగింపు వెళ్లి దర్గాలోని హజరత్ అతావుల్లా బాబా వారి శాశ్వత విశ్రాంతి దివ్య సన్నిధిలో పవిత్ర సుగంధం, పరిమళ ద్రవ్యాలతో కూడిన చాదర్ ను సమర్పించారు. విశ్వ శాంతిని కోరుతూ సజ్జదా నషీన్ పీర్జాదా మహమ్మద్ ఖాజా మొహియుద్దీన్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సాయంత్రం బాబా దర్గా నుంచి ప్రత్యేక ఆకర్షణ గల రథంపై అతావుల్లా బాబా చిత్ర చీమలపాడు పురవీధుల నుంచి విజయవాడ. జగదల్పూర్.జాతీయ రహదారి మీదుగా అనేక కళా రూపాల ప్రదర్శనలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. బుధవారం నుంచి జరుగుతున్న నిర్విరామ అన్న సమారాధనలో వేలాదిగా హాజరైన భక్తులకు అన్న ప్రసాదాన్ని అందించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా ఉరుసు మహోత్సవం ఘనంగా జరిగింది. శుక్రవారం జరిగే కూల్ ఖుషల్ , భక్తులకు బాబా శేష వస్త్రాలు, తబురుక్ (ప్రసాదాలు) పంపిణీతో ఉత్సవాలు ముగియనున్నాయి. ఈ సందర్భంగా ఉత్సవాలకు హాజరైన భక్తులనుద్దేశించి ప్రవచించిన దర్గా పీఠాదిపతి మొహమ్మద్ ఖాజా మొహియుద్దీన్ సూఫీ విశిష్టతను, సూఫీ పరంపరను వివరించారు. సూఫీ మహనీయులు విశ్వశాంతికై ఉదయించారని వారు చూపిన సన్మార్గంలో ప్రజలంతా నడుచుకుంటే విశ్వ కళ్యాణం జరుగుతుం దని అన్నారు. ఆతావుల్లా బాబా ఉరుసు మహోత్సవాల్లో భాగంగా విజయనగరం ఖాదర్ బాబా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు జరగగా, దర్బార్ లో దివ్యన్న సమారాధనను నిర్వహించారు.

## 24 బ్యాటరీల చోరీ

### పోలీసుల అదుపులో ముగ్గురు బ్యాటరీ దొంగలు



**పెదకూరపాడు : అక్టోబర్ 17 (ఆంధ్రపత్రిక) :** పెదకూరపాడు మండలంలోని జలాలపురం గ్రామంలో ఎయిర్టెల్ టవర్కు సంబంధించి 24 బ్యాటరీలను గుర్తుతెలియని దొంగలు బుధవారం తెల్లవారుజామున అపహరించారు. సూపర్వైజర్ షేక్ బాజీ ఫిర్యాదు మేరకు పెదకూరపాడు ఎస్ఐ గిరిబాబు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

**పోలీసుల అదుపులో ముగ్గురు బ్యాటరీ దొంగలు**

విలాసాలకు అలవాటు పడ్డ ముగ్గురు చోరులను 24 గంటల వ్యవధిలో గురువారం పెద్దకూరపాడు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు... గుంటూరు పట్టణానికి చెందిన దడిగి మణికంఠ, పెదనందిపాడు మండలం పుసులూరు గ్రామానికి చెందిన బిల్లా వెంకటేష్, దక్కుమల్ల ధనరాజు అదుపులోకి తీసుకొని సత్తెనపల్లి కోర్టులో హాజరపరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ గిరిబాబు తెలిపారు.

## చందోలు పోలిస్ స్టేషన్‌లో మద్యం సీసాలు ధ్వంసం



**బాపట్ల అక్టోబర్ 17 (ఆంధ్రపత్రిక) :** ఛందోలు పోలీస్ స్టేషన్ పరిధిలో గతంలో పట్టుబడిన అక్రమ మద్యం కేసుల్లో స్వాదీనం చేసుకున్న 222 మద్యం బాటిళ్లు ఎస్సై స్వామి శ్రీనివాస్ అధ్వర్యంలో బుధవారం ధ్వంసం చేశారు.ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు బాపట్ల డీఎస్పీ జీ.రామాంజనేయులు, బాపట్ల రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ హరికృష్ణ రెవెన్యూ సిబ్బంది సమక్షంలో ఛందోలు ఎస్ఐ శ్రీనివాస్ మద్యం బాటిళ్లు డెస్ట్రాయ్ చేసారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ అక్రమంగా మద్యం తరలిస్తున్న, నిల్వ చేసిన, అమ్మకాలు నిర్వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలిస్, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## విజ్ఞాన్స్ వర్సిటీ వీసీ వ్యక్తిగత కార్యదర్శికి పీహెచ్‌డీ



**గుంటూరు : అక్టోబర్ 17 (ఆంధ్రపత్రిక) :** చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్‌కు వ్యక్తిగత కార్యదర్శిగా సేవలందిస్తున్న సీహెచ్ వెంకటశివ వర్మకు గుంటూరు పరిధిలోని ఆచార్య నాగార్జున యూనివర్సటీ%-% హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ విభా గంలో పీహెచ్‌డీ పట్టా అందించిందని విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ " ఎంప్లాయి రెటెన్షన్ స్ట్రాటజీస్ ఇన్ బిజినెస్ ప్రాసెస్ అవుట్‌స్టాండింగ్ సెక్టార్ ( విత్ స్పెషల్ రిఫెరెన్స్ టు సెలెక్ట్ కాల్ సెంటర్స్ ఎట్ హైదరాబాద్ - యాన్ ఎంపిరికల్ స్టడీ " అనే అంశంపై ఆయన పరిశోధన చేశారని తెలియజేశారు. ఈయనకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలోని కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగంలోని మానవ వనరుల విభాగాధిపతి ప్రొఫెసర్ నాగరాజు బట్టు గైడ్‌గా వ్యవహరించారని పేర్కొన్నారు. పీహెచ్‌డీ పట్టా పొందిన సీహెచ్ వెంకటశివ వర్మను విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ ప్రత్యేకంగా అభినందించారు.

## ప్రొఫెసర్ జిఎన్ సాయిబాబాను ముమ్మాటికి మోడీ అమిత్ షా ప్రభుత్వం చేసిన హత్యే

### ప్రగతిసీల కార్మిక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి బి కొండారెడ్డి




**గుంటూరు : అక్టోబర్ 17 (ఆంధ్రపత్రిక) :** ప్రొఫెసర్ జిఎన్ సాయిబాబాను ముమ్మాటికి మోడీ అమిత్ షా ప్రభుత్వం, వాళ్ళ జేబు సంస్థలైన న్యాయస్థానాలు చేసిన హత్యేనని ప్రగతిసీల కార్మిక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి బి కొండారెడ్డి అన్నారు.ఆదివాసీ హక్కుల పరిరక్షణ కోసం దేశ వ్యాప్తంగా మేధావులను కూడ గట్టి కార్పొరేట్ సంస్థలు చేస్తున్న అక్రమ మైనింగ్ కు వ్యతిరేకంగా పోరాడుతున్నందుకు మహారాష్ట్ర ప్రభుత్వం ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ జి ఎన్ సాయిబాబాకు మావోయిస్టులతో సంబందాలున్నాయనే నెపం మోపి అక్రమంగా అరెస్టు చేశారన్నారు. చెయ్యని నేరానికి సాయిబాబా అతని సహచరులకు జీవిత ఖైదు విధించిన సంధర్భంగా న్యాయమూర్తి తీర్పు ఇచ్చే సంధర్భంగా "1982 నుండి మహారాష్ట్రలోని గడ్చిరోలి ప్రాంతం అభివృద్ధికి ఆటంకంగా ఉన్నాడని, 90 శాతం అంగవైకల్యంతో ఉన్న మానసికంగా చురుకుగా ఉన్నాడని, ప్రవాసమో ఉరిశిక్షో వేయవలసిందే గాని చట్టం తన చేతులు కట్టేసిందని" సెషన్స్ కోర్టు వ్యాఖ్యానించడం న్యాయస్థానాల్లో మనువాదులు తిష్ట వేసి తీర్పులిస్తున్నారని అన్నారు. న్యాయస్థానం మాటలను అందుకున్న సంఘపరివార్ శక్తులు నాగపూర్లో, నెల్లూరులో ప్రొఫెసర్ సాయిబాబాను ఉరితీయాలని ఆందోళనలు చేశారని మండిపడ్డారు. 2017 మార్చి 1న సాయిబాబాతో పాటు ఐదుగురికి జీవిత ఖైదీలుగా పదేళ్ల శిక్ష అమలు చేసిన నాగపూర్ కోర్టు సాయిబాబాను హై సెక్యూరిటీ (అండాసెల్) జైల్లో ఉంచి 10 సంవత్సరాలుగా వేధింపులు గురి చేశారన్నారు. 19 రకాల వ్యాధులతో బాధపడుతున్న సాయిబాబాకు కనీస వైద్య సౌకర్యాలు కల్పించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయాలను హైందవికరించు, హిందూయిజాన్ని సైనికరించు అనే నినాదంతో 1925లో ఆవిర్భవించిన ఆర్ఎస్ఎస్ లక్ష్యసాధనలో భాగంగానే తన రాజకీయ ముఖచిత్రమైన బీజేపీ ద్వారా దేశవ్యాప్తంగా హక్కుల కార్యకర్తలు, ఉద్యమకారులు,రచయితలపై అక్రమంగా ఊపాలాంటి క్రూరమైన చట్టాలను బనాయిస్తూ శాశ్వతంగా జైళ్లలో నిర్బంధించే విధంగా చట్టాలను తయారు చేస్తున్నారన్నారు. అటువంటి అప్రజా స్వామికమైన ఉపా చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని, ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలపై హత్యాకాండను నిలిపివేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంల ఎన్ పోతురాజు,కర్రే యోహాను సి ఎస్ ఆర్ ప్రసాద్, నల్లూరి రుక్మిణి కె కృష్ణ, కర్రి నాగేశ్వరరావు, ఏసోబు కె ఆశీర్వాదం,దండు వెంకటేశ్వర్లు డి సుధాకర్ బత్తుల కోటేశ్వరరావ డి శాంతమ్మ పాటిబండ్ల కోటేశ్వరరావు ఆంథోన బత్తుల వీరాస్వామి లక్ష్మి పాగళ్ళ ప్రకాష్ డెన్నిస్ రాయ్,జిట్టా రవి తదితరులు పాల్గొన్నారు.

## నేడు మెగా జాబ్ మేళా బ్రోచర్ ఆవిష్కరణకు రానున్న మంత్రి గొట్టిపాటి



**అద్దంకి అక్టోబరు17( ఆంధ్ర పత్రిక) :** 29న జరగబోయే మెగా జాబ్ మేళ బ్రోచర్ ఆవిష్కరణకు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ వస్తున్నారని మున్సిపల్ కమిషనర్ డి రవీంద్ర ఒక ప్రకటన తెలిపారు కమిషనర్ మాట్లాడుతూ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆధ్వ ర్యంలో ఈనెల 29 న జరగబోవు మెగా జాబ్ మేళానకు సంబం ధించి బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమం ఉదయం 9:30 గంటలకు అ ద్దంకిలోని రోడ్లు రవాణా భవనాల బంగ్లా నందు జరుగును సంబంది తఅధికారులు మున్సిపాలిటీఅధికారులురావలసినదిగా కోరినారు

### అనాధ పిల్లలకు ఆధార్ కార్డుల జారీకి

# చర్యలు తీసుకోవాలి

### జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



**కానూరు అక్టోబరు 17 (ఆంధ్రపత్రిక) :** తల్లిదండ్రులు లేని అనాధ పిల్లలను గుర్తించి వారికి ఆధార కార్డులు, ఆర్ఫన్(అనాధ) సర్టిఫికెట్ల జారీకి తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు.గురువారం మధ్యాహ్నం ఆయన పెనమలూరు మండలం కానూరులోని జిల్లా మహిళాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో పిల్లల సంరక్షణ సంస్థలు, బాల్యవివాహాలు, పిల్లల లైంగిక వేధింపులు, బాల కార్మికులు, పిల్లల సమస్యలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లల సంరక్షణ సంస్థల్లో (చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూషన్స్) రక్షణ పొందుతున్న పిల్లలందరూ చట్టం పరిధిలోకి రావాల్సిందేనని, దీనిపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. జువైనల్ జస్టిస్ చట్టం ప్రకారం నిర్వహిస్తూ పిల్లల సంరక్షణ సంస్థల్లో ఉం టున్న వారికి సరియైన సదుపాయాలు లేకుండా పిల్లలను ఉంచుకుంటూ, వారికి రక్షణ సంరక్షణ కల్పిం చకుండా ఉన్న ఆయా సంస్థల నుండి పిల్లలను తీసుకువచ్చి అన్ని వసతులు ఉన్న ఇతర పిల్లల సంరక్షణ సంస్థలకు తరలించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.పిల్లల పోషణ స్థితిని సక్రమంగా పర్యవేక్షి స్తూ గృహ సందర్శనలు నిర్వహించాలని సిడిపిఓలు, సూపర్వైజర్లకు కలెక్టర్ ఈ సందర్భంగా సూచించా రు. ఈ సమావేశంలో ఐసిడిఎస్ పీడీ ఎస్ సువర్ణ, సిడిపిఓలు సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణకారుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న కూటమి ప్రభుత్వం

### ఆంధ్రప్రదేశ్ స్వర్ణకార సంక్షేమ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు అభినందనీయం - రాష్ట్ర అధ్యక్షులు కోసూరి రాజశేఖర్



**మచిలీపట్నం అక్టోబర్ 17 (ఆంధ్రపత్రిక) :** ఏపీవిబి ఎస్ఎస్ ఎన్నికల్లో విశ్వబ్రాహ్మణులకు ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే కూటమి ప్రభుత్వం "ఆంధ్రప్రదేశ్ స్వర్ణకార సంక్షేమ మరియు డెవలప్మెంట్ కార్పొరేషన్ ఏర్పాటుకు" 16 వ తేదీ జరిగిన క్యాబినెట్ సమావేశంలో మంత్రి మండలి ద్వారా ఆమోదం తెలపటం హర్షనీయమని ఆంధ్ర ప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కోసూరి రాజశేఖర్, భవిరి రవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ కి యువ నాయకులు విద్యాశాఖ మంత్రి లోకేష్ కి ప్రత్యేకంగా ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. స్వర్ణకార సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ గా విశ్వబ్రాహ్మణులకే అవకాశం ఇవ్వాలన్నారు. అలాగే పంచవృత్తుల్లో మిగిలినటువంటి కమ్మరి, కంచరీ వడ్రంగి, శిల్పులకు కూడా ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారిని ఆదుకోవాలని అన్నారు. సమావేశంలో వీరితోపాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ రామోజీ శ్రీధర్ రావు, నౌపడ కాళేశ్వరరావు, కంచనపల్లి గురు బ్రహ్మాచారి, పులికొండ వెంకట కుమార్ రాజా పాల్గొన్నారు.

## ఆత్మ విశ్వాసంతో వైకల్యాన్ని అదిగమించాలి



**నూజివీడు అక్టోబర్ 17 (ఆంధ్రపత్రిక) :** పుట్టుకతో గానీ, ప్రమాదం లో గానీ శరీర అవయవాలు కోల్పోయిన వారు కృత్రిమ అవయవాలు ద్వారా ఆత్మ విశ్వాసం పెంపొందించుకొని వైకల్యాన్ని అధిగమించాలని విజయవాడ నగర పాలక సంస్థ, 23వ డివిజన్ కార్పొరేటర్ మరియు టిడిపి ఫ్లోర్ లీడర్ నెల్లిబండ్ల బాలస్వామి అన్నారు. మండలం లోని తోటపల్లి లో గల హీల్ కృత్రిమ అవయవ కేంద్రం లో నెల్లిబండ్ల శైలజ, ఖాత. సువర్ణ, మరియు నవ నిర్మాణ్ గ్రూప్ డైరెక్టర్ అప్పల వెంకట సాయి నాథ్ ల ఆర్థిక సహాయం తో విజయవాడ కు చెందిన కె. గజేంద్ర రావు, ఎ. హేలి, ఎ. దుర్గా సత్యావతి లకు కృత్రిమ కాళ్ళను అందచేసిన సందర్భముగా అయన మాట్లాడారు. అంధ బాలలకు, ఆర్ధిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాలలకు, దివ్యాంగులకు హీల్ సంస్థ చేస్తున్న సేవలను అయన అభినందించారు. ఈ సందర్భముగా జరిగిన కార్యక్రమములో ప్రముఖ సంఘ సేవకురాలు గౌరా. జ్యోతి కుమారి, ఉయ్యురు లక్ష్మి, డి. చైతన్య, ఎన్. సాయితేజ, హీల్ వ్యవస్థాపక అధ్యక్షులు డా. కోనేరు సత్య ప్రసాద్, కార్యదర్శి తాతినేని లక్ష్మి, సిఈఓ కూరపాటి అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆటోనగర్ అభివృద్ధికి సహకరించాలి

### తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు : అక్టోబర్ 17 (ఆంధ్రపత్రిక) :** గుంటూరు ఆటోనగర్లో ఇంకా మౌలిక సదుపాయాలు కల్పన కూడా జరగలేదని, ఆటోనగర్ అభివృద్ధికి మున్సిపల్ కార్పొరేషన్ కూడా సహకరించాలని తూర్పు నియోజకవర్గం శాసనసభ్యులు నసీర్ అన్నారు. మున్సిపల్ కమిషనర్ పులి శ్రీనివాసులు ని కలసి తూర్పు నియోజకవర్గ పలు సమస్యలపై ఎమ్మెల్యే నసీర్ చర్చించారు. ఆటోనగర్లో పన్నుల రూపంలో వసూలు చేసిన 6 కోట్ల రూపాయలు కార్పొరేషన్ కి చెల్లించడం జరిగిందని వాటితో శానిటేషన్, పైపులైన్లు, డ్రైన్లు, రోడ్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించవలసిందిగా మున్సిపల్ కమిషనర్ ని కోరారు ఈ విషయంపై శనివారం సాయంత్రం 4గంటలకు, మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహిస్తామని ఎమ్మెల్యే నసీర్ తెలిపారు. అలాగే నియోజకవర్గంలోని రోడ్లు,అకాల వర్షాలకు గుంటలు పడ్డాయని వెంటనే ప్యాచ్ వర్క్ లు చేపట్టాలని, బొంగరాలబీడు శారదా కాలనీ రోడ్డు మరియు శుద్ధపల్లి డొంక రోడ్డు వైడనింగ్ చేయాలని ఎమ్మెల్యే నసీర్ కమిషనర్ ని కోరారు.

## పత్తి చేను పరిశీలించిన శాస్త్రవేత్తలు



**ఎ. కొండూరు అక్టోబర్ 17 (ఆంధ్రపత్రిక) :** పత్తిఅధిక దిగుబడులు సాధించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జాతీయ ప్రత్తి పరిశోధనా సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ భాగ్యలక్ష్మి అవగాహన కల్పించారు. ఎ.కొండూరు మండలంలో గురువారం డాక్టర్. కే ఎల్ రావు కృషి విజ్ఞాన కేంద్రం, గరికపాడు శాస్త్రవేత్తలతో కలిసి ప్రత్తి పొలాలను పరిశీలించారు. ప్రత్తి పంటలను పరిశీలించిన అనంతరం ఆమె పత్తిలో చేపట్టిన అధిక సాంద్రతతో విత్తె పద్ధతి పెరుగుదలను నియంత్రించే రసాయనం మాట్లాడుతూ మేపిక్వాట్ క్లోరైడ్ ఉపయోగించి అధిక దిగబడులు సాధించాలన్నారు. నాణ్యమైన ఉత్పత్తిని సాధించేందుకు చేపట్టిన ప్రక్రియ ద్వారా మేలు చేకూరుతుందన్నారు. ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఈ ప్రాంత రైతులందరికీ అవగాహన కల్పించి పొలాల్లో ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గులాబీ రంగు పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ ఎన్ రాజశేఖర్ మరియు యంగ్ ప్రొఫెషనల్ జి శోభిత రాణి పాల్గొన్నారు.

## జనసేన కార్యకర్తను పరమార్శించిన మరీదు



**నూజివీడు అక్టోబర్ 17(ఆంధ్రపత్రిక) :** యాక్సిడెంట్ అయి విజయవాడ లో ఒక ప్రయివేట్ ఆస్పత్రిలో ట్రీట్మెంట్ తీసుకుంటున్న టువంటి జనసేన పార్టీ చాట్రాయి మండల కార్యదర్శి మిద్దె హరీష్ ను పరామర్శించి , పార్టీ అండగా ఉంటుందని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి , డాక్టర్ తో మెరుగైన వైద్యం అందించాలని సూచించిన జనసేన పార్టీ ఉమ్మడి కృష్ణాజిల్లా అధికార ప్రతినిధి మరీదు .శివరామకృష్ణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## తుమ్మల వెంకటేశ్వర స్వామి దర్శనానికి తరలిరండి

### - ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ చింతా శరత్ కుమార్ రెడ్డి



**అమడగూరు, అక్టోబర్, 17, (ఆంధ్రపత్రిక) :** తుమ్మల కొండ వెంకటేశ్వర స్వామి తిరుమల అమావాస్య ఒక్కపొద్దులు 3వ శనివారం సందర్భంగా స్వామి వారి దర్శనానికి భక్తులు తరలిరావాలని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు చింతా శరత్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...తుమ్మల కొండ వెంకటేశ్వర స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు పసుపులేటి గంగులప్ప వారి కుటుంబ సభ్యుల సహకారంతో మంచినీరు,భోజన సదుపాయం ఏర్పాటు చేశామని తెలిపారు.అలాగే కంచరవాండ్లపల్లి డీలర్ ఆదినారాయణ రెడ్డి కొండకు వచ్చే భక్తులకు రెండు రకాల స్వీట్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.తిరుమల వెంకటేశ్వర స్వామిని దర్శించుకోలేని భక్తులు తుమ్మలయ్య కొండనే తిరుమల కొండగా భావించి ఇక్కడే తమ యొక్క మొక్కులు తీర్చుకొనే ఆనవాయితి గత అనేక సంవత్సరాలుగా కొనసాగుతున్నదని తెలిపారు.తుమ్మల కొండ వెంకటేశ్వర స్వామిని దర్శించుకుంటే తమ మొక్కులు నెరవేరుతాయని ఇక్కడ భక్తుల నమ్మకం చాలామంది భక్తులు తమకు పెళ్లిళ్లు కావాలని,సంతానం కావాలని కోరుకుంటూ వస్తుంటారు అని అన్నారు.మన రాష్ట్రంతో పాటు కర్ణాటక రాష్ట్రంలో చిక్బల్లాపూర్ బాగేపల్లి,పావగడ తదితర ప్రాంతాల నుంచి స్వామివారిని దర్శించుకోవడానికి పెద్ద ఎత్తున భక్తులు వస్తారని ఆలయ కమిటీ సభ్యులు కొట్టు అశ్వర్థ కుమార్,కొట్టు రామాంజినేయులు,శ్రీనివాసులు,మేకల చలపతి,రామచంద్ర,జక్క ఆంజనేయులు,పసుపులేటి వెంకటనారాయణ,ఆదిమూర్తి,వెంకటరమణ,చాంద్ భాషా,సరళమ్మ, పూజారి రమణ,ఆదినారాయణ,తదితరులు తెలియజేశారు.

## వాల్మీకి సిద్ధాంతాలు సమాజానికి
# మార్గదర్శకాలు



**కడప అక్టోబర్ 17 (ఆంధ్రపత్రిక):**ఆదికవి వాల్మీకి మహర్షి సిద్ధాంతాలు సమాజానికి మార్గదర్శకమ నియోగివేమన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి అన్నారు. వైవియూ పరిపాలన భవనంలో ఆదికవి వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించు కొని ఆయన చిత్రపటానికి విసి ఆచార్య కృష్ణారెడ్డి, ప్రిన్సిపల్ ఎస్. రఘునాథ రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ వాల్మీకి మహర్షి రచించిన వాల్మీకి రామాయణాన్ని భారతీయులు ప్రామాణి కంగా తీసుకుంటారాన్నారు."ప్రపంచంలో నదులు, పర్వతాలు ఉన్నంత కాలం రామాయణం చదువు తారు తెలిపారు. ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్ రఘునాథరెడ్డి మాట్లాడుతూ వాల్మీకి జీవితం ఎంతో విలక్షణ మైనదని వివరిస్తూ ముఖ్యమైన విషయాలను ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో హ్యూమానిటీస్ డీన్ ఆచార్య కంకణాల గంగయ్య, ఆచార్య చంద్రఓబుల రెడ్డి, ఆచార్య వి.రామకృష్ణ, బోధన సిబ్బంది పాల్గొన్నారు.

## సింగపూర్ టౌన్ షిప్‌లో
# సెల్ టవర్ వద్దు



**కడప,అక్టోబర్ 17 (ఆంధ్రపత్రిక):**నగరం అభివృద్ధి చెందాలన్నా, ప్రజా సమస్యలు పరిష్కరించాలన్న, యువకులైన అధికారు లతో సాధ్యమవుతుందని, నూతనంగా మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన మనోజ్ రెడ్డి తనదైన అభివృద్ధిని అందించగలరని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్య దర్శి ఎన్.రవిశంకర్ రెడ్డి ఆశా భావం వ్యక్తం చేశారు గురువారం కమిషనర్ ఛాంబర్ లో కమీషనర్ ను రవిశంకర్ రెడ్డి తన ప్రతినిధి బృందంతో కలసి సాదర స్వాగతం పలుకుతూ, సింగపూర్ టౌన్షిప్ లోని సెల్ టవర్ అనుమతులను రద్దు చేయాలని కోరారు అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఏపీ హౌసింగ్ బోర్డ్ ఆధ్వర్యంలో గృహాలను నిర్మించి ప్రజా అవసరాల కోసం కొంత స్థలాన్ని ఖాళీగా ఉంచా రని, 2016 సంవత్సరంలో గృహాలను, ఖాళీ స్థలాలను కార్పొరేషన్‌కు అప్పగించటం జరిగిందని చెప్పారు అప్పటినుండి అక్కడ ఎటువంటి నిర్మాణాలు జరగాలన్న కార్పొరేషన్ అనుమతి తీసుకొని నిర్మించాల్సి ఉందని, అయితే ఎటువంటి అనుమతులు లేకుండా, కాలనీకి సంబంధం లేని ఓ వ్యక్తి తప్పుడు అగ్రిమెం ట్లతో ఆ స్థలాన్ని ప్రైవేటు నెట్వర్క్ కలిగిన సంస్థకు అప్పజెప్పే ప్రయత్నం చేస్తున్నాడని ఆరోపించారు. వెంటనే వాటి అనుమతులను రద్దు చేయాలని కోరారు. కమీషనర్ ను కలిసిన వారిలో అర్సిపి నగర కార్యదర్శి మక్బూల్ బాషా, నగర కార్యదర్శి వర్గ సభ్యులు మడగలం ప్రసాద్, విజయ్ కుమార్ తదితరులు ఉన్నారు

## బోయకొండపై పౌర్ణమి చండీహోమం



**చౌడేపల్లి,అక్టోబర్17(ఆంధ్రపత్రిక):** శక్తి క్షేత్రం బోయకొండపై గురువారం పౌర్ణమిని పురస్కరించుకుని చండీ హెూమాన్ని నిర్వహించారు. ఉదయాన్నే అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి విశేషాభిషేకము అలంకరణ నిర్వహించారు. మండపంలో అమ్మవారి విగ్రహం ముందు వేద పండితులు గోవర్ధన శర్మ, ఆధ్వర్యంలో దంపతుల సమక్షంలో కలశ స్థాపన, పూర్వక చండీ, హెూమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. చండీ హెూమంతో ఆలయం దద్దరిల్లింది. ఆలయ ఇవో మరియు ఉప కమీషనర్ ఏకాంబరం సేవలందించారు.

## ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు



**చౌడేపల్లి, అక్టోబర్ 17 (ఆంధ్రపత్రిక):** ఆదికవి రామాయణ రచయిత వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక మండల పరిపాలన భవనం వద్ద వాల్మీకి మహర్షి చిత్రపటాన్ని ఉంచి పూలమాలవేసి నివాళులర్పించారు. అన్నదమ్ముల అనుబంధం, తల్లిదండ్రుల బాధ్యతలు, రాజ్యపాలన వంటి విషయాలను అందించిన మహాకవి వాల్మీకి మహర్షి అని తెలుగుదేశం పార్టీ సీనియర్ బిసి నాయకుడు ఆవుల రామచంద్రయ్య అన్నారు. వాల్మీకి మహర్షి చరిత్రను వివరించారు. వాల్మీకులను ఎస్టీల జాబితాలో చేర్చాలని పలువురు ప్రభుత్వాన్ని కోరారు. వాల్మీకులు వ్యక్తిగతంగా సామాజికంగా ఎదగాలంటే ఎస్టీ జాబితాలో చేర్చాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆదినారాయణ, గంగరాజు, మునుస్వామి, గురుమూర్తి, నరేష్, జగదీష్, మునిరత్న, శివ శంకర, గంగులప్ప, రెడ్డి, నాగరత్నమ్మ, రెడ్డమ్మ, ముని, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## తుఫాన్ ప్రభావం వల్ల దెబ్బతిన్న
# వరి పంటల పరిశీలన
### - సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజు



**సిద్ధవటం, అక్టోబర్17 (ఆంధ్రపత్రిక):** సిద్ధవటం వ్యవసాయ శాఖ కార్యాలయంలో గురువారం సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరా జు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 2574 ఎకరాలలో వరి పంట రైతులు సాగు చేశారని57 ఎకరాలలో వరి పంట నష్టం ఉంటుందని ప్రాథమిక అంచనా వేసి జిల్లా వ్యవసాయ శాఖ అధికారికి నివేదిక సమర్పించడం జరుగుతుందని రెండు రోజుల్లో పూర్తిస్థాయి నష్టం అంచనా వేసి జిల్లా,,రాష్ట్ర ఉన్నత అధికారులకు నివేదిక సమర్పించడం జరుగుతుందని తెలియజేశారు జంగాలపల్లె రెవిన్యూ గ్రామంలోని వరి పంట వేరుశనగ పంటలను పరిశీలించడం జరిగిందని ప్రతి రైతుకు నష్టపరిహారం అందేలా కృషి చేస్తానని సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజు తెలిపారు.

## ఖాళీ స్థలాలు శుభ్రం చేసుకోవాలని
# స్థల యజమానులకు నోటీసులు



**బద్వేలు అక్టోబర్ 17 (ఆంధ్రపత్రిక):**ఖాళీస్థలాల్లో కంపచెట్లు మరియు పిచ్చిమొక్కలు కలిగివుండటం వలన ప్రజారోగ్యానికి ఎంత నష్టమో పై వీడియో నే నిదర్శనం అన్నారు ఖాళీ స్థల యజమానులు వారివారి స్థలాల్లో కంప చెట్లు,పిచ్చి మొక్కలు తక్షణమే శుభ్రం చేయించుకోవలెను. లేని యెడల పురపాలక సంఘం వారే శుభ్రం చేయించి అయ్యే ఖర్చులకు రెండింతలు స్థలయజమానుల నుండి వసూలు చేయబడుననీ కమీషనర్ తెలిపారు. ప్రజలందరూ పట్టణాభివృద్ధికి మరియు పట్టణ సుందరీక రణకు తోడ్పాటు అందించాలని విజ్ఞప్తి చేయడమైనదని మునిసిపల్ కమీషనర్ కోరారు.ఈ కార్యక్రమంలో పట్టణ ప్రణాళిక అధికారి సతీష్‌తో పాటు శానిటేషన్ సెక్రటరీ లు,ప్లానింగ్ సెక్రటరీలు మరియు ప్రజారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## రామాయణం స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ
# మానవతా విలువలను పెంపొందించుకోవాలి
### జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు



**కడప,అక్టోబర్ 17 (ఆంధ్రపత్రిక):**రామాయణం స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ మానవతా విలువలను పెంపొందించుకోవాలని జిల్లా ఎస్.పివి.హర్షవర్ధన్ రాజు ఐ.పీ.ఎస్ ఆకాంక్షించారు.జిల్లా ఎస్.పి క్యాంప్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాలులో శ్రీ వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు.శ్రీవాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి స్మరించుకున్నారు. ఈసందర్భంగా జిల్లా ఎస్.పి మాట్లాడుతూ. మానవతా విలువలను, ఉన్నతమైన ఆదర్శ భావాలను బోధించే మధుర కావ్యం రామాయణం అని అన్నారు. అటువంటి గొప్ప కావ్యాన్ని రచించి యుగాలు మారినా కూడా ఆదర్శంగా నిలిచే విధంగా వాల్మీకి మహర్షి సమాజానికి అందించడం గొప్ప విషయమన్నారు. ఈకార్యక్రమంలో ఏ.ఆర్ డీఎస్పీ మురళీధర్ జిల్లా పోలీసు కార్యాలయం ఏ.ఓ జ్యోతి మరియు సిబ్బంది, ఆర్ ఐ లు ఆనంద్, టైటాస్, శ్రీశైలరెడ్డి, పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉప్పు శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## నందికొట్కూరు స్టేషన్
# ఆకస్మిక తనిఖీ



**నందికొట్కూరు. అక్టోబర్ 17 (ఆంధ్రపత్రిక):** కర్నూల్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి నందికొట్కూరు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నూతన మద్యం పాలసీలో భాగంగా మద్యం షాపులు అన్ని ప్రారంభించాలనీ,. మద్యము అమ్మకదారులు సమయపాలన , కచ్చితంగా అమలు చేయాలన్నారు ఎమ్మార్పీ ధరలకే మద్యం విక్రయించాలని, నూతన మద్యం షాపులు గుడి, బడి, చర్చి మసీదు వీటికి 100 మీటర్ల దూరంలో ఏర్పాటు చేయాలన్నారు,కొత్త వ్యాపారస్తులు నిబంధనల మేరకే నడుచుకోనేల చర్యలు తీసుకోవాలి అని సూచించారు. అలాగే నాటు సారా మీద కఠిన చర్యలు తీసుకోవాలని, నాటు సారా తయారీకి ప్రధాన వనరు అయినటు వంటి బెల్లంను సప్లై చేసే వారిని మీద నిఘా ఉంచాలనిఆమె సూచించారు. పలు రికార్డులను పరిశీలించారు. ఎక్సైజ్ సీఐ ఆంజనేయులకు స్టేషన్ ప్రస్తుతం ఉన్న కండిషన్ చూసి, స్టేషన్ రిపేరి కొరకు నివేదిక సమర్పించమన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై జఫ్రుల్లా పాల్గొన్నారు.

## బ్రహ్మయ్యకు అదనపు బాధ్యతలు అప్పగించడం తగదు
### - జిల్లా కన్వీనర్ సగిలి రాజేంద్ర ప్రసాద్



**కడప, అక్టోబర్ 17 (ఆంధ్రప్రత్రిక):** అంబేద్కర్ గురుకుల పాఠశాలల కో-ఆర్డినేటర్‌గా రెగ్యులర్ అధికారులను నియమించకుండా ప్రస్తుతం కడప జిల్లా మైనారిటీ కార్పొరేషన్ జిల్లా అధికారిగా కొనసాగుతున్న బ్రాహ్మయ్యకు ఇంచార్జి బాధ్యతలు అప్పగించడం దారుణ మని ఏఐఎస్‌బి జిల్లా కన్వీనర్ సగిలి రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం స్థానిక కాగితల పెంటలోని జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కడప, అన్నమయ్య జిల్లాలకు ఆంధ్రప్రదేశ్ అంబేద్కర్ గురుకుల పాఠశాలల కో-ఆర్డినేటర్‌గా బ్రహ్మయ్యకు అదనపు బాధ్యతలు ఇవ్వడం దారుణమని అన్నారు. బ్రహ్మయ్య రాజంపేట మండలంలోని మన్నూరు హై స్కూల్ ప్రధానోపాధ్యాడుగా ఉన్నాడని అలాంటి వ్యక్తికి జిల్లా అధికారి బాధ్యతలు అప్పగించడం దారుణమన్నారు. గత ప్రభుత్వ హయాంలో కూడా బ్రహ్మయ్య ప్రభుత్వ పెద్దలు, జిల్లా అధికారుల అండతో వ్యవస్థలను మ్యానేజ్ చేస్తూ మైనార్టీ కార్పొరేషన్, బి.సి, ఎస్.సి, ఎస్.టి వెల్ఫేర్ జిల్లా అధికారిగా ఎస్.సి కార్పొరేషన్ ఈడీగా బాధ్యతలు నిర్వహించారని తెలిపారు. గ్రూప్ 1 అధికారులు బాధ్యత చూడాల్సిన డిపార్ట్మెంట్‌లకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని నియమించడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. బ్రహ్మయ్య వారి తమ్ముడు గ్రూప్ 1 అధికారి కావడంతో అధికారులను, వ్యవస్థలను మ్యానేజ్ చేస్తూ జిల్లా అధికారిగా కొనసాగుతున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంచార్జిలతో కాలయాపన చేస్తూ విద్యార్థుల సంక్షేమాన్ని గాలికి వదిలేసిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి ఆంధ్రప్రదేశ్ అంబేద్కర్ గురుకుల పాఠశాలల కో-ఆర్డినేటర్‌గా అదనపు బాధ్యతలు చేపట్టిన బ్రహ్మయ్య ను మాతృసంస్థకు బదిలీ చేసి రెగ్యులర్ కో-ఆర్డినేటర్ (డి.సి.ఓ)ని నియమించాలని డిమాండ్ చేశారు లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చెప్పడతామని హెచ్చరించారు.

## సిపిఎం 12వ జిల్లా మహాసభలో జయప్రదం చేయండి
### సిపిఎం బద్వేలు రూరల్ కార్యదర్శి డి.వెంకటేష్



**బద్వేలు, అక్టోబర్ 18 (ఆంధ్రప్రత్రిక):**గురువారం స్థానిక సుందరయ్య భవనం నందు భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్), సిపిఎం ఐపిఎల్ రూరల్ కమిటీ కార్యదర్శి డి.వెంకటేష్ అధ్యక్షతన సమావేశం జరిగింది. సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జీ.శివకుమార్, కల్లా కమిటీ సభ్యులు వి.అన్వేష్‌లు సంయుక్తంగా సిపిఎం 12వ జిల్లా మహాసభలను కడప నగరంలో డిసెంబర్ 14,15, తారీకులలో నిర్వహిస్తున్నట్లు కరపత్రాలు విడుదల చేశారు. జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా ప్రజలందరినీ కోరారు. ఈ మహాసభలకు సిపిఎం జాతీయ కామ్రేడ్ ఎం.ఏ.గఫూర్, రాష్ట్ర నాయకులు ప్రభాకర్ రెడ్డి హాజరవుతున్నట్లు వారి తెలిపారు. సిపిఎం బద్వేలు రూరల్ కమిటీ సభ్యులు ఆర్.ఓబయ్య, జి.జయరాజు, ఎన్.ఓబులేసు,ఎన్.రాంబాబు, పి.రాజశేఖర్ డి.రామకృష్ణారెడ్డి నరసింహులు రామసుబ్బమ్మ, పి.చంద్ర, ఏ.దుర్గమ్మ, డి.రామసుబ్బమ్మ, కె.చిన్నయ్య, గంగయ్య తదితరులు కరపత్రాల విడుదల కార్యక్రమంలో పాల్గొన్నారు.

## చెరువు కుంటలు తలపిస్తున్న రహదారి

**పలు పల్లె ప్రాంతాల ప్రజలకు తప్పని ఇబ్బందులు గ్రామ ప్రజలు ఆందోళన ఇసుక క్వారీ తెచ్చిన తిప్పలు**



**సిద్ధవటం,అక్టోబర్ 17 (ఆంధ్రపత్రిక):**సిద్ధవటం జ్యోతి వెళ్లే రహదారి నందు వెళితే ప్రమాదాలు కొని తెచ్చుకున్నట్టుగా ఉందంటూ పలు ద్విచక్ర వాహనదారులు ఆటో డ్రైవర్లు ప్రయాణికులు గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు ఆ రహదారి అతుకుల గతుకులమై చెరువు కుంటల దర్శనమిస్తుంది వైసీపీ ప్రభుత్వంలో వంతాటి పల్లె ఇసుక క్వారీ నుండి నిత్యం వందల వాహనాల లారీలు టిప్పర్లు మితిమీరిన ఇసుక రవాణా చేయడంతో పల్లె ప్రాంతాలకు వెళ్లే రహదారి పూర్తిగా దెబ్బతినింది అప్పటి వైసిపి ప్రభుత్వం లో పల్లెప్రాంతాల ప్రజలు ఇసుక రవాణా వల్ల రహదారి దెబ్బతింటుంది అని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా కూడా ఫలితం శూన్యంగా మారింది గురువారం ఆ ప్రాంత ప్రజలు మాట్లాడుతూ తుఫాన్ ప్రభావం వల్ల అధిక వర్షాలతో పలు పల్లె ప్రాంతాలకు వెళ్లే రహదారి పూర్తిగా వర్షపు నీటితో చెరువు కుంటల మారిపోయిందని ద్విచక్ర వాహనదారులు ఆటో కార్మికులు రహదారి గుంతలమయం కావడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఈ రహదారి గుండా నిత్య పూజ కోన, జ్యోతి గొల్లపల్లె పి.కొత్తపల్లి, కొట్టాలు వంతాటిపల్లి గ్రామాలకు ఇదే రాజు మార్గమని అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా రోడ్డు మరమత్తులు చేయాలని తెలియజేశారు.

## సమాచార హక్కు చట్టంపై మండల స్థాయి
# అవగాహన కార్యక్రమం



**గోపవరం అక్టోబర్ 17 (ఆంధ్రపత్రిక):**గురువారం గోపవరం మండల రైతు సేవా కేంద్రంలో సమాచార హక్కు చట్టం,2005 పై మండల స్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.మండల వ్యవసాయ అధికారి జి.రామకృష్ణయ్య ఆధ్వర్యంలో ఈ అవగాహణ కార్యక్రమం సమాచార హక్కు చట్టం పై పూర్తి అవగాహణ కల్పించడం వివిధ సెక్షన్స్ ను వివరించారు.సెక్షన్6, 7(1) ప్రకారం దరఖాస్తు చేసుకున్న వ్యక్తులకు 30 రోజుల్లోపు అడిగిన సమాచారం పూర్తి స్థాయిలో ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. సెక్షన్ 4(1) (ఎ) ప్రకారం కార్యాలయ ఆవరణలో సమాచార హక్కు బోర్డు ఏర్పాటు చేయాలి. సమాచార అధికారి, సహాయ సమాచార అధికారి, అపెలెట్ అథారిటీల పేర్లు హెూదా,మొబైల్ నెంబర్ విధిగా ప్రదర్శించాలి. సెక్షన్ 7 లో కాలపరిమితిని కూలంకషంగా వివరించడం జరిగింది.సెక్షన్ 8,9 లలో బహిర్గతం నుండి మినహాయించబడిన సమాచార వర్గాలను వివరించారు. సెక్షన్ 19(1) ప్రకారంపై స్థాయి అధికారులు కు అప్పీల్ చేసుకోవచ్చు. సెక్షన్ 20(1)(2) ప్రకారం సమాచారం పూర్తిస్థాయిలో,లేదా సంతృప్తి కలగని సమాచారం ఇవ్వని సందర్భాలలో సమాచార అధికారిపై జరిమానా, క్రమ శిక్షణ చర్యలు తీసుకోవాలి అని సూచించారు. సమాచారం తెలుసుకోవడం ప్రజల హక్కు సమాచార హక్కు చట్టం ప్రకారం కోరిన సమాచా రం అందుబాటులో లేకుంటే సంబంధిత శాఖల అధికారులకు సదరు దరఖాస్తు ను బదలాయించ వచ్చును.రిజెక్ట్ చేసిన సందర్భాలలో కారణాలు తెలపాల్సి ఉంటుంది. కావున కోరిన సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత సంబంధిత సమాచార అధికారి పై ఉంటుంది ప్రజలు ఈ సమాచార హక్కు చట్టంపై అవగాహన పెంచుకొని అవసరమైన సమాచారాన్ని ప్రభుత్వ అధికారులు, సంస్థలు నుండి పొందగలరు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు ఓబయ్య, విజయ్ కుమార్, రైతు సేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు,సచివాలయ పంచాయతీ సెక్రటరీ నిఖిత, సచివాలయం సిబ్బంది బాలకృష్ణ రెడ్డి, రవి, విజయ్, మణిమాలా, అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్ పవిత్ర ,ప్రక్రుతి వ్యవసాయ సిబ్బంది సుధ పాల్గొన్నారు.

## నివాసాల మధ్య వైన్ షాపులు వద్దు : వామపక్ష ప్రజాసంఘాలు



**నందికొట్కూర్, అక్టోబర్ 17 (ఆంధ్రపత్రిక):**ప్రస్తుతం ప్రభుత్వం లక్కీ డిప్పు కేటాయిస్తూ వచ్చిన వారు నివాసాల మధ్య వైన్ షాపులు పెట్టడం దారుణమని వెంటనే వీటిని దూర ప్రాంతాలకు తరలించాలని వామపక్ష ప్రజాసంఘాల నాయకులు, కాలనీ ప్రజలు డిమాండ్ చేశారు. గురువారం పగిడాల రోడ్డులో ఉన్న సత్యనారాయణ దేవాలయం దగ్గర వైన్ షాపును ఏర్పాటు చేయాలని ప్రయత్నించడంతో కాలనీ ప్రజలు, వాపక్ష ప్రజా సంఘ నాయకులు ఇక్కడ వైన్ షాపు పెట్టొద్దు అంటూ, గురువారం నిరసన కార్యక్రమం చేయడం జరిగింది, ఈ సందర్భంగా వామపక్ష ప్రజాసంఘాల నాయకులు పి.పక్కిరి సాహెబ్, పి.వెంకటేశ్వర్లు, పి.మజీద్ మియా, మాట్లాడుతూ, బుధవారం నుంచి నూతన మద్యం పాలసీ అమల్లోకి వచ్చింది షాపులు దక్కించుకున్న యజమానులు ప్రజలు నివసిస్తున్న ప్రాంతాలలో పెట్టడంతో అనేకచోట్ల నిరసనలు తెలిపారు, మద్యం షాపులు దక్కించుకున్న వారు ప్రజల నివాసాల మధ్య కాకుండా ఊరి బయట వైన్ షాపులు పెట్టుకోవాలని వారు డిమాండ్ చేశారు, ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మద్యాన్ని అరికడతామని చెప్పి ఇప్పుడు స్వయంగా ప్రభుత్వమే టెండర్లు రూపంలో నిర్వహించడం దారుణం అన్నారు. తక్కువ రేట్లకే ఇస్తామన్నా చెప్పిన ఎక్కువమంది తాగండి అనే పద్ధతుల ప్రోత్సహించినట్లు ఉందని వారు విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ ప్రకారం మహిళలను ఇబ్బందులు పెట్టకుండా మద్యాన్ని అరికట్టాలని వారు కోరారు, జిల్లా అధికారులు, ఎక్స్చేంజ్ అధికారులు స్పందించి వైన్ షాప్‌లు ఊరు బయట పెట్టే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు, లేకుంటే ప్రజల అగ్రహానికి గురికావాల్సి ఉంటుందని వారు హెచ్చరించారు, అనంతరం వినతి పత్రాన్ని ఎక్సైజ్ సిఐ ఆంజనేయులు గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో వామపక్ష ప్రజాసంఘాల నాయకులు టి.గోపాలకృష్ణ, డి.బాబు, వి.నాగార్జున, ఎస్ రమేష్, స్వాములు, సుధాకర్, ఎస్,మాభాష,కాలనీ ప్రజలు ఎం.శ్రీనివాసులు, ఈ.రామ్మోహన్ గౌడ్, చెంచన్న, వెంకటేశ్వర్లు, చిన్న రాముడు, లక్ష్మన్న, చూరి బి.ఫాతిమా, లక్ష్మి, భూలక్ష్మి, రామా దేవి, భాగ్యల క్ష్మి, పావని, తదితర కాలనీవాసులు పాల్గొన్నారు.

## నందికొట్కూరులో భారీ వర్షం 75.8మి.మి
# వర్షపాతం నమోదు

**లోతట్టు ప్రాంతాలు జలమయం.. పరిశీలించిన మున్సిపల్ కమిషనర్ బేబీ...**



**నందికొట్కూరు, అక్టోబర్ 17 (ఆంధ్రపత్రిక):**నందికొట్కూరులో గురువారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది, 75,8, మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది.దీంతో పట్టణంలోనిలోతట్టు ప్రాంతాలైన మారుతి నగర్, హాజీ నగర్, హాస్పిటల్ రోడ్డు, దాసరి పేట తదితర కాలనీ లలో వర్షపు నీరు, ఇండ్లలోకి రహదారుల పైకి చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు, నీటిలో మునిగినలోతట్టు ప్రాంతాలను మున్సిపల్ కమిషనర్ పరిశీలించారు. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు రాకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఇందుకు సంబంధించిన నివేదికను తయారుచేసి కలెక్టర్కు పంపనున్నట్లు ఆమె తెలిపారు, ఇందుకు ప్రధానంగా, నేషనల్ హైవే 340సీ పొలాలలోని నీరు, భారీగా హైవేపై చేరి ఆ నీరు, లోతట్టు ప్రాంతాల్లో ప్రవేశించడంతో, కాలనీలు మునకకు గురి అవుతున్నాయని, వెంటనే సమస్యను పరిష్కరించాలని నేషనల్ హైవే అధికారులతో కమిషనర్ మాట్లాడారు, పొలాల్లో నీరు పోవడానికి కాలువలు ఏర్పాటు చేయాలని, కాలనీలలో నీరు చేయడంతో వర్షం వచ్చిన ప్రతిసారి మునకకు గురి అయ్యి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని నేషనల్ హైవే అధికారులకు సూచించారు, కమిషనర్ వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బాని, కౌన్సిలర్ అశోక్, మున్సిపల్ డిఈ,నాసిర్, ఏఈ,దినేష్, విఆర్ఓ వెంకటేశ్వర్లు, లోతట్టు ప్రాంతలను పరిశీలించారు.

# ప్రజా క్షేత్రంలోకి జగన్

(మొదటిపేజీ తరువాయి)

చేయడం పైన దృష్టి సారించారు. గ్రామస్థాయిలో నిర్మాణాత్మకంగా ఉండేలా ప్రణాళికలు రూపొందించాలని వైసిపి అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి పార్టీ శ్రేణులకు సూచించారు.పార్టీని బలోపేతం చేయడంలో వైసిపి నేతల పనితీరు పైన మానిటరింగ్ ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. నేడు తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు మరియు అనుబంధ సంఘాల నేతలతో సమావేశమైన వైయస్ జగన్ పార్టీని బలోపేతం చేయడంతో పాటు ఇతర అంశాల పైన పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.వైసిపి నేతలు కార్యకర్తలు సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండాలని, బాగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.ఇక జిల్లా అధ్యక్షులు పనితీరు ఆధారంగా వారికి ప్రమోషన్లు ఉంటాయని చెప్పిన జగన్, దేశంలోనే అత్యంత బలమైన పార్టీగా వైసీపీని తయారు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పార్టీ కోసం ఎవరైతే బాగా పని చేస్తారో వారికి రేటింగ్స్ ఇస్తామని, రిపోర్టుల ఆధారంగా నిర్ణయాలు కూడా తీసుకుంటామని చెప్పారు. కష్టానికి తగిన ప్రతిఫలం తప్పకుండా ఉంటుందని వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. మీకిదే సువర్ణావకాశం అన్నారు. ఇక ఇదే సమయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్నికల ఓటమి పైన కూడా కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికలకు ముందు ఎన్నికల తర్వాత రాష్ట్రవ్యాప్తంగా సర్వే చేయించి 17 లక్షల శాంపిల్స్ తీసుకున్నామని చెప్పిన జగన్ ఆ సర్వేలలో ఎక్కడ వైసీపీ వ్యతిరేకత కనిపించలేదని స్పష్టం చేశారు. వైసిపి పట్ల వ్యతిరేకత లేకపోయినా ఎన్నికల ఫలితాలు మాత్రం భిన్నంగా వచ్చాయని జగన్ కీలక వ్యాఖ్యలు చేశారు.ఇక రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైసీపీ కార్యకర్తల పైన దాడులు పెరిగాయని వారిని అడుగడుగునా టిడిపి నాయకులు ఇబ్బంది పెడుతున్నారని జగన్ అభిప్రాయం వ్యక్తం చేశారు. తెలుగుదేశం పాలనలో ఇబ్బంది పడుతున్న నష్టపోయిన కార్యకర్తలను త్వరలోనే తాను పరామర్శిస్తానని ,వారందరికీ భరోసా ఇస్తానని వైయస్ జగన్ స్పష్టం చేశారు.వైసిపి కార్యకర్తలపై దాడులను అందరం కలిసి సమర్థవంతంగా ఎదుర్కోవలసిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఇక జిల్లా స్థాయిలోను వైసీపీ నేతలంతా ఒక్కటిగా ఉండాలని కార్యకర్తలకు అండగా ఉండి ఆదుకోవాలని జగన్ సూచించారు. త్వరలోనే వారందరికీ భరోసా ఇచ్చేందుకు ఓదార్చేందుకు ప్రజాక్షేత్రంలోకి వస్తానని జగన్ తన వ్యాఖ్యల ద్వారా మరోమారు స్పష్టం చేశారు.

# కొత్త పింఛన్లపై సర్కార్ శుభవార్త

(మొదటిపేజీ తరువాయి)

స్వీకరించనున్నారు.అదే నెలలో పింఛన్ల తనిఖీ చేపడతారు. అనర్హులకు నోటీసులిచ్చి పింఛన్లు తొలగించేందుకు 45రోజుల సమ యం తీసుకుంటారు. మొత్తంగా డిసెంబర్ నెలాఖరు నాటికి కొత్త పింఛన్ల లబ్ధిదారుల ఎంపిక, ప్రస్తుత పింఛన్లలో అనర్హుల ఏరివేత పూర్తి చేయనున్నట్టు తెలుస్తోంది.

# టిడిపి కార్యాలయంపై దాడి కేసు..

(మొదటిపేజీ తరువాయి)

హాజరయ్యారు. తెదేపా కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో విచారించాలని మంగళగిరి పోలీసులు నోటీసులు జారీ చేయడంతో ఆయన ఇవాళ విచారణకు హాజరయ్యారు.సజ్జల వెంట న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, మాజీ మంత్రి మేరుగ నాగార్జున తదితరులు ఉన్నారు. సజ్జలతో పాటు విచారణాధికారి వద్దకు తనను కూడా అనుమతించాలని పొన్నవోలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. వేలు చూపించి మరీ పోలీసులను బెదిరించారు. అయితే, విచారణ సమయంలో న్యాయవాదులను పోలీసులు అనుమతించలేదు. దీనికి కోర్టు అనుమతి తప్పనిసరి అని, ప్రస్తుతం విచారణకు సజ్జలను మాత్రమే అనుమతిస్తామని స్పష్టం చేశారు. దీంతో సజ్జల ఒక్కరే పోలీస్‌స్టేషన్ లోకి వెళ్లారు. మంగళగిరి డీఎస్పీ మురళీకృష్ణ, గ్రామీణ సీఐ శ్రీనివాసరావు విచారిస్తున్నారు.సజ్జల రామకృష్ణారెడ్డికి న్యాయస్థానం ఈనెల 24 వరకు మధ్యంతర ఉత్తర్వులు ఇస్తే 10న లుక్‌ఔట్ నోటీసులు ఎలా ఇస్తారని న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి ప్రశ్నించారు. దాడి జరిగిన రోజు సజ్జల మంగళగిరికి 500 కి.మీ దూరంలో ఉన్నట్టు కోర్టుకు ఆధారాలు కూడా సమర్పించామన్నారు. పోలీసులకు విచారించే అధికారం ఉన్నట్టు.. నిందితులకూ హక్కులు ఉన్నాయన్నారు. తెదేపా కార్యాలయంపై దాడి కేసును రకరకాలుగా తిప్పుతున్నారని, దీనిపై న్యాయపోరాటం చేస్తామని తెలిపారు. ఈ కేసులో సజ్జల ప్రమేయం ఉందని గుర్తించిన పోలీసులు ఆయన విదేశాలకు వెళ్లకుండా ఇప్పటికే లుక్‌అవుట్ నోటీసులు జారీ చేశారు. పార్టీ కార్యాలయంపై దాడి కేసులో వైకాపా నేతలు లేళ్ల అప్పిరెడ్డి, దేవినేని అవినాశ్, తలశిల రఘురామ్‌లను ఇప్పటికే ఫలు దఫాలుగా పీఎస్‌కు పిలిపించి విచా రించారు. కేసు కొలిక్కి వస్తున్న నేపథ్యంలో దాడి ఘటనలో ప్రమేయం ఉన్న ముఖ్య నాయకులను విచారించేందుకు సిద్ధం అవుతున్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా సజ్జలను విచారిస్తున్నారు.

# రైల్ రిజర్వేషన్ కాల వ్యవధిలో మార్పులు..

(మొదటిపేజీ తరువాయి)

నిబంధనల్లో మార్పులు చేసింది. నవంబర్ 1 నుంచి కొత్త నిబంధన అమల్లోకి రానుంది. అయితే, ఇప్పటికే బుకింగ్ చేసుకున్న వారికి మాత్రం ఎటువంటి ఇబ్బంది ఉండదని రైల్వే వర్గాలు పేర్కొన్నాయి. కొత్త నిబంధన నవంబర్ 1 నుంచి అమల్లోకి రానున్నప్పటికీ.. అక్టోబర్ 31 వరకు బుకింగ్ చేసుకునే వారికి పాత నిబంధన వర్తిస్తుంది. తాజ్ ఎక్స్‌ప్రెస్,గోమతి ఎక్స్‌ప్రెస్ వంటి రైళ్ల బుకింగ్‌లో ఎటువంటి మార్పు లేదు. ఇప్పటికే వాటిలో బుకింగ్ వ్యవధి తక్కువగా ఉంది. ఇక విదేశీ పర్యటకులు మాత్రం 365 రోజుల ముందుగానే టికెట్ బుకింగ్ చేసుకునే అవకాశం ఉండగా.. ఇందులోనూ ఎలాంటి మార్పు లేదు. ఇదిలా ఉంటే, గతంలోనూ రైల్వే ముందస్తు బుకింగ్ ప్రయాణానికి 60 రోజుల ముందే ఉండేది. దానిని 120 రోజులకు పెంచిన భారతీయ రైల్వే.. తాజాగా మళ్లీ మునుపటి వ్యవధికే మార్పు చేస్తూ నిర్ణయం తీసుకుంది. తాజా నిర్ణయం నేపథ్యంలో ఐఆర్‌సీటీసీ షేరు విలువ 2 శాతం మేర క్షీణించి రూ.873 వద్ద ట్రేడవుతోంది. గడువు కుదింపు వల్ల ఆ మేర క్యాన్సిలేషన్లు తగ్గి ఐఆర్‌సీటీసీకి ఆదాయం తగ్గే అవకాశం ఉండడమే దీనికి కారణమని అనలిస్టులు చెబుతున్నారు.

# ఎపికి నలుగురు ఐఏఎస్ అధికారులు

(మొదటిపేజీ తరువాయి)

నుంచి ఈ నలుగురు అధికారులూ రిలీవ్ అయ్యారు. డీవోపీటీ ఆదేశాలపై జోక్యం చేసుకునేందుకు తెలంగాణ హైకోర్టు నిరాకరించడంతో వీరు ఏపీకి వచ్చి రిపోర్టు చేశారు.ఆమ్రపాలి సహా నలుగురు ఐఏఎస్ అధికారులు గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్‌కు రిపోర్ట్ చేశారు.ఏపీ రాష్ట్ర కేడర్ కు కేటాయించిన ఈ నలుగురు ఐఏఎస్ అధికారులు వాణీప్రసాద్, రోనాల్డ్ రోస్, వాకాటి కరుణ, ఆమ్రపాలిలను తెలంగాణ నుంచి అక్టోబర్ 16న రిలీవ్ అయ్యారు. వీరంతా ఆంధ్రప్రదేశ్‌లో చేరుతారని తెలంగాణ రాష్ట్ర సచివాలయం నుంచి ఏపీ సచివాలయానికి మెయిల్ పంపారు. మరోవైపు తెలంగాణ కేడర్ కు చెందినప్పటికీ ఏపీలో పనిచేస్తున్న సృజన, హరికిరణ్, శివశంకర్ లు బుధవారం సాయంత్రమే తెలంగాణ చీఫ్ సెక్రటరీ శాంతికుమారికి రిపోర్ట్ చేశారు.

# భూ సర్వేలో అనేక లోపాలు

(మొదటిపేజీ తరువాయి)

రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. ఈ మేరకు కేంద్ర భూ వనరుల శాఖ కార్యదర్శి మనోజ్ జోషికి వివరించారు.వీటన్నింటినీ సవరించి భూ రికార్డులను సరి చేస్తున్నామని తెలిపారు. మంత్రి అనగాని, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా, సర్వే సెటిల్మెంట్స్ డైరెక్టర్ శ్రీకేష్ బాలాజీతో కేంద్ర కార్యదర్శి మనోజ్ జోషి సమావేశమయ్యారు. రాష్ట్రంలో చేపట్టిన భూ రీసర్వే, భూ రికార్డుల డిజిటలీకరణ తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించే అంశంపై మనోజ్ జోషి కొన్ని సూచనలు చేశారు. మరోవైపు రీసర్వే ప్రక్రియతో పాటు భూ రికార్డుల డిజిటలీకరణ కోసం కేంద్రం విడుదల చేసిన నిధులకు అదనంగా అవసరం అవుతాయని మంత్రి తెలిపారు.

# తదుపరి సిజెఐగా సంజీవ్ ఖన్నా..

(మొదటిపేజీ తరువాయి)

చంద్రచూడ్ తర్వాత సీనియర్ జడ్జిగా ఖన్నా ఉన్నారు. జస్టిస్ చంద్రచూడ్ సిఫార్సులను కేంద్రం ఆమోదిస్తే 51వ భారత ప్రధాన న్యాయమూర్తిగా సంజీవ్ ఖన్నా నియమితులు కానున్నారు. నియమితులైతే 2025 మే 13 వరకు జస్టిస్ సంజీవ్ ఖన్నా పదవిలో ఉంటారు. 2019లో ఢిల్లీ హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఖన్నా పదోన్నతి పొందారు. నిబంధనల ప్రకారం జస్టిస్ డీవై చంద్రచూడ్ ప్రతిపాదనను కేంద్ర న్యాయశాఖ పరిశీలించి ప్రధానమంత్రికి పంపిస్తుంది. ప్రధాని మోదీ ఆమోదం తరువాత రాష్ట్రపతి వద్దకు వెళుతుంది. రాష్ట్రపతి ఆమోదముద్రతో తదుపరి ప్రధాన న్యాయమూర్తి ఎంపిక ఖరారవుతుంది. 2022 నవంబర్ 9వ తేదీన ఛీఫ్ జస్టిస్‌గా ప్రమాణ స్వీకారం చేసిన జస్టిస్ డీవై చంద్రచూడ్ ఎక్కువకాలం ఈ పదవిలో ఉన్నారు. సంప్రదాయం ప్రకారం సీజేఐ తన తర్వాత ఆ పదవిని చేపట్టేందుకు అత్యంత సీనియర్ న్యాయమూర్తి పేరును సిఫార్సు చేస్తారు. ఆ లెక్కన జస్టిస్ డివై చంద్రచూడ్ తర్వాత జస్టిస్ ఖన్నా అత్యంత సీనియర్‌గా ఉన్నారు. జస్టిస్ సంజీవ్ ఖన్నా బార్ కౌన్సిల్ ఆఫ్ ఢిల్లీలో న్యాయవాదిగా 1983లో పేరు నమోదు చేసుకున్నారు. తీస్ హజారీ కోర్టులో ప్రాక్టీసు ప్రారంభించారు. ఆ తరువాత ఢిల్లీ హైకోర్టులో న్యాయవాదిగా కొనసాగారు. 2004లో ఇన్‌కంటాక్స్ శాఖకు సీనియర్ స్టాండింగ్ కౌన్సిల్‌గా సేవలందించారు.

# షాంఘై సదస్సుకు మోదీ హాజరై ఉంటే బాగుండేది..

**లాహోర్,అక్టోబర్ 17 :** పాకిస్థాన్ లో జరిగిన షాంఘై సహకార సంస్థ సదస్సులో భారత విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జైశంకర్ పాల్గొనడంపై పాక్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ స్పందించారు. ఇది సానుకూల పరిణామమన్నారు. ఈ సదస్సుకు ప్రధాని మోదీ వస్తే మరింత సంతోషించేవాడినన్నారు. భారత్‌కు చెందిన ఓ జాతీయ వార్తా ఛానెల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చిన ఆయన .. ఇరుదేశాలు గతాన్ని పక్కన పెట్టి.., ఇంధనం, వాతావరణ మార్పుల వంటి భవిష్యత్తు సవాళ్లను పరిష్కరించుకోవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. మరోవైపు ఎస్‌సీవో సదస్సు కోసం పాకిస్థాన్ వెళ్లిన భారత జర్నలిస్టులతో నవాజ్ షరీఫ్, ఆయన కుమార్తె మరియం నవాజ్ లు ప్రత్యేకంగా భేటీ అయ్యారు.

# పౌరసత్వ చట్టం సెక్షన్6ఏ రాజ్యాంగబద్ధమే

## సమర్థించిన సుప్రీం ధర్మాసనం

**న్యూఢిల్లీ,అక్టోబర్ 17 :** పౌరసత్వ చట్టం 1955లోని సెక్షన్6ఏ రాజ్యాంగబద్ధతను సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం సమర్థించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎంఎం సుందరేష్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోమిశ్రా ధర్మాసనం 4:1 మెజారిటీతో రాజ్యాంగబద్ధతను సమర్థిస్తూ గురువారం తీర్పును వెలువరించింది. అయితే, న్యాయమూర్తుల్లో జస్టిస్ పార్దివాలా మాత్రమే రాజ్యాంగ విరుద్ధమంటూ అభిప్రాయం వ్యక్తం చేశారు. విదేశీయులను భారత పౌరులుగా గుర్తించినా.. పదేళ్ల వరకు ఓటేసే హక్కు ఉండదన్నారు. బంగ్లాదేశ్ నుంచి శరణార్థుల రాక అసోం జనాభా సమతౌల్యతను తీవ్రంగా ప్రభావితం చేసిదంటూ సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. పౌరసత్వ చట్టంలోని సెక్షన్ 6ఎ రాష్ట్రంలోని అసలైన నివాసితుల రాజకీయ, సాంస్కృతిక హక్కులను ఉల్లంఘించిందని పిటిషన్లు ఆరోపించారు. విచారణ సందర్భంగా సీజేఐ డీవై చంద్రచూడ్ మాట్లాడుతూ అక్రమ



వలసలకు అసోం అకార్డ్ రాజకీయ పరిష్కారమని.. సెక్షన్-6ఎ అనేది చట్టబద్ధమైన మార్గమని పేర్కొన్నారు. నిబంధనలు రూపొందించేందుకు మెజార్టీతో కూడిన పార్లమెంట్‌కు ఆ శక్తి ఉందన్నారు.మానవీయ ఆందోళనలను పరిష్కరించడంతోపాటు స్థానికుల ప్రయోజనాలను కాపాడే సమతౌల్యత సెక్షన్‌కు ఉందని.. ఇందులో కటాఫ్ డేట్‌గా నిర్ణయించిన 1971 మార్చి 25 అనేది సరైనదేనన్నారు. ఎందుకంటే అప్పటికే బంగ్లాదేశ్ యుద్ధం ముగిసిందని. బంగ్లాదేశ్ యుద్ధం నేపథ్యంలోనే ఈ సెక్షన్ తీసుకొచ్చిన విషయాన్ని చెబుతోందని.. ఈ సెక్షన్ అంత ఎక్కువగా జనాభాను కలుపుకోలేదని.. మరీ తక్కువగాను విలీనం చేసుకోలేదని సీజేఐ వ్యాఖ్యానించారు. పౌరసత్వ చట్టం 1955 సెక్షన్6ఎ మేరకు 1966 జనవరి నుంచి 1971 మార్చి 25లోపు అసోంకు వచ్చిన వలసదారులు పౌరసత్వం కోరవచ్చు. ఈ రూల్‌ని 1985లో అసోం అకార్డ్ తర్వాత తీసుకువచ్చారు. అసోంలోకి బంగ్లాదేశ్ వలసలపై ఉద్యమించినవారితో కేంద్రప్రభుత్వం చేసుకున్న ఒప్పందం ఇది. దీని చట్టబద్ధతపై అసోంలోని కొన్ని స్థానిక గ్రూపులు సుప్రీంకోర్టులో సవాల్ చేశాయి. రాజ్యాంగ పీఠికకు విరుద్ధమని, పౌరహక్కుల ఉల్లంఘనతో పాటు రాజకీయ హక్కులను హరించడమేనని ఆయా గ్రూపులు వాదించాయి.

# అధిక ధరకు సరుకులు విక్రయిస్తే కఠిన చర్యలు

## రైతు బజార్, సూపర్ మార్కెట్ ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి నాదెండ్ల

**విజయవాడ,అక్టోబరు 17 (ఆంధ్రపత్రిక):** ప్రజలకు విక్రయించే సరుకులు నాణ్యత, ధరలపై విజయవాడలో పడమట రైతుబజార్ , గురునానక్ కాలనీ నందు ఉషోదయ సూపర్ మార్కెట్ ను రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆకస్మిక తనిఖీ చేశారు.ధరల స్థిరీకరణ విషయంలో భాగంగా కూటమి ప్రభుత్వం ఆదేశాల మేరకు అన్ని రైతు బజార్లు, సంస్థాగత రిటైల్ దుకాణాలలో ప్రభుత్వం నిర్ణయించిన ధరకే నాణ్యమైన సరకులను వినియోగదారులకు అందించాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని మంత్రి తెలిపారు. బహిరంగ మార్కెట్‌లలో నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించడంలో భాగంగా అన్ని రైతు బజార్లలో వంట నూనెలు, కందిపప్పు, ఉల్లి, టమాటాలను అందుబాటులో ఉంచామన్నారు. విజయవాడ పడమట రైతు బజార్, గురు నానక్ కాలనీ నందు ఉషోదయ సూపర్ మార్కెట్ ను గురువారం మంత్రి నాదెండ్ల ఆకస్మికంగా తనిఖీ చేసి స్పెషల్ కౌంటర్ ద్వారా వినియోగదారులకు తక్కువ ధరకే అందుబాటులో ఉంచిన నిత్యావసర సరుకులను పరిశీలించారు. ప్రజలకు బియ్యం, కందిపప్పు, వంటనూనె చౌక ధరలకు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు.రైతు బజార్లో సరుకుల లో వ్యత్యాసంపై ఎస్టేట్ ఆఫీసర్‌ను నిలదీశారు. రైతు బజారులో బియ్యం, కందిపప్పు పంపిణీకి ఏర్పాటు చేసిన కౌంటర్ల నిర్వహణకు సమయపాలన పాటించకపోవడాన్ని గుర్తించి షాపుల నిర్వాహకులపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. వంటనూనెలు, ఉల్లి, టమాటా విక్రయాలపై వినియోగదారులను అడిగి సమాచారం తెలుసుకున్నారు.అదేవిధంగా గురు నానక్ కాలనీ ఉషోదయ సూపర్ మార్కెట్ సరుకుల ధరలు పరిశీలించినప్పుడు.. ప్రభుత్వం కందిపప్పు కిలో 67 రూపాయలకు నిర్ణయించిన విధంగా అమ్మకాలు లేకపోవడానికి మంత్రి సూపర్ మార్కెట్ నిర్వాహకులను నిలదీశారు..అధిక ధరకు అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.వినియోగదారులకు తక్కువ ధరకే నిత్యావసర సరుకులు, వంట నూనె రైతు బజార్లు, హోల్ సేల్, రిటైల్ దుకాణాలలో అందుబాటులో ఉంచినట్లు మంత్రి నాదెండ్ల తెలిపారు.మార్కెట్ ధరల కంటే తక్కువ ధరలకే నిత్యావసర సరుకులను వినియోగదారులకు అందజేయడం జరుగుతుందన్నారు. పామాయిల్ లీటర్ 110 రూపాయలకు , సన్ ఫ్లవర్ ఆయిల్‌ను లీటర్124 రూపాయలకు , కిలో 67 రూపాయలకే కందిపప్పు, వినియోగదారులకు అందుబాటులో ఉంచామన్నారు. ప్రభుత్వం కల్పించిన ఈ సదుపాయాన్ని ప్రతి వినియోగదారుడు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# చెన్నైకి భారీ వర్ష సూచన



**చెన్నై,అక్టోబర్ 17 :** చెన్నై నగరవ్యాప్తంగా అత్యంత భారీ వర్షాలు కురుస్తుండటంతో ప్రజల్లో భయం పెరిగింది. ప్రత్యేకించి ఐటీ నిపుణులు, ధనవంతుల్లో చాలామంది విలాసవంతమైన హోటళ్లలో గదులు బుక్ చేసుకుని కుటుంబాలతో కలిసి దిగిపోతున్నారు. గతేడాది డిసెంబరులో ఒక్కసారిగా భారీ వర్షాలు కురవడంతో ఇళ్లలోకి వరద నీరు చేరి, కార్లు కొట్టుకుపోయిన నేపథ్యంలో ఈసారి అలాంటి పరిస్థితులు తలెత్తకుండా వారు హోటళ్లలో దిగుతున్నారు. కార్ల పార్కింగ్‌కు ప్రత్యేక వసతి, తాగునీరు, విద్యుత్ సరఫరాతోపాటు వైఫై ఉండేలా చూడాలన్న షరతులతో గదుల్లో దిగినట్లు సమాచారం. గురువారం భారీ నుంచి అతిభారీ వర్షసూచన చేశారు. బుధవారం రెడ్ ఎలర్ట్ ఇచ్చినా, సాయంత్రం వరకు తేలికపాటి జల్లులే పడటంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. భారీ వర్షాలకు బెంగళూరు నగరంలో జనజీవనం స్తంభించింది. చిక్కబళ్లాపుర, కోలారు, రామనగర, మైసూరు, చామరాజనగర, ఉడుపి, మంగళూరు, ఉత్తర కర్ణాటక, చిత్రదుర్గ తదితర జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఐటీ, బీటీ కేంద్రాలకు నిలయమైన బెంగళూరులోని మాన్యత టెక్‌పార్కు ఆవరణలో నూతన నిర్మాణాల కోసం తీసిన పునాదుల్లో మట్టి పెళ్లలు విరిగిపడ్డాయి.

# మరో రైలు ప్రమాదం..

(మొదటిపేజీ తరువాయి)

ఎనిమిది బోగీలు పట్టాలు తప్పాయి. అస్సాంలోని దిబలోంగ్ స్టేషన్ వద్ద ఈ ఘటన చోటుచేసుకున్నట్లు సమాచారం. ఈ ఘటనలో ఎవరికీ ఏమీ కాలేదని రైల్వే అధికారులు వెల్లడించారు. ఈ మధ్యాహ్నం 3.55 గంటలకు జరిగిన ఈ రైలు ప్రమాదానికి కారణాలు ఇంకా తెలియరాలేదని చెప్పారు. పవర్ కార్, ఇంజిన్‌తో పాటు ఎనిమిది కోచ్‌లు పట్టాలు తప్పాయన్నారు. ఈ ఘటన గురించి సమాచారం అందగానే.. సహాయక బృందాలు చేరు కున్నాయని తెలిపారు. ఈ ఘటనతో లుమ్‌డింగ్-బాదర్‌పూర్ సింగిల్-లైన్ హిల్ సెక్షన్‌లో రైళ్ల రాకపోకలు నిలిపివేసినట్లు వెల్లడించారు.ఈ ప్రమాదం గురువారం మధ్యాహ్నం 3.55 గంటలకు జరిగింది. అగర్తల, ముంబైలోని లోకమాన్య తిలక్ టెర్మినస్ మధ్య నడుస్తున్న రైలు డిబాలాంగ్ స్టేషన్ గుండా వెళుతుండగా పట్టాలు తప్పింది. అయితే పట్టాలు తప్పిన నేపథ్యంలో అధికారులు రంగంలోకి దిగి విచారణ చేస్తున్నారు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న తరువాత అసోం సీఎం హిమంత విశ్వ శర్మ కూడా సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు. ప్రయాణికులకు పెద్దగా నష్టం జరగలేదని, ప్రయాణికులంతా క్షేమంగా ఉన్నారని అన్నారు. ఈ క్రమంలో తాను రైల్వే అధికారులతో సమన్వయం చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రమాదానికి ముందు అగర్తల-లోకమాన్య తిలక్ ఎక్స్‌ప్రెస్ గురువారం ఉదయం బయలుదేరింది. ఈ ఘటన నేపథ్యంలో రైల్వే అధికారులు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు చేపడుతున్నారు. దీంతో లుమ్డింగ్ బదర్‌పూర్ సింగిల్ లైన్ సెక్షన్‌లో రైళ్ల రాకపోకలను నిలిపివేశారు. ఈ క్రమంలో ప్రజలు సహాయం, అదనపు సమాచారం కోసం హెల్ప్‌లైన్ నంబర్లు 03674 263120, 03674 263126లకు ఫోన్ చేయాలని అధికారులు సూచించారు.

# ఎపికి నూతన పెట్టుబడులు రావాలి

(మొదటిపేజీ తరువాయి)

ఛత్తీస్‌గఢ్, సీఎంలు హాజరయ్యారు.ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "ఆంధ్రప్రదేశ్ పూర్తిగా వ్యాపార అనుకూల రాష్ట్రం. కొత్త పాలసీ ఫ్రేమ్‌వర్క్ పరిశ్రమ అనుభవజ్ఞులతో రూపొందించాం. వ్యవస్థాపక స్ఫూర్తి, వ్యాపారాలను పెంపొందించడమే లక్ష్యం. దేశంలోనే అత్యుత్తమ వ్యాపార అనుకూల వ్యవస్థను నిర్మిస్తున్నాం. అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకుంటుందని హామీ ఇస్తున్నా. దేశంలో, ఏపీలో పెట్టుబడులకు ఇంతకంటే మంచి సమయం లేదు. ఈ ఉత్తేజకరమైన వృద్ధి ప్రయాణంలో మాతో సహకరించండి.

వ్యాపార పరిధిలు, రాష్ట్ర సామర్థ్యం పరస్పరం విస్తరించుకునే అవకాశమిది. ఏపీలో నూతన పెట్టుబడుల కోసం ఎదురుచూస్తున్నాం" అని సీఎం చంద్రబాబు తెలిపారు.

# షేక్ హసీనాపై అరెస్ట్ వారెంట్..

(మొదటిపేజీ తరువాయి)

తన ఆదేశాల్లో పేర్కొన్నారు.రిజర్వేషన్లపై విద్యార్థుల నిరసనలు హింసాత్మకంగా మారడంతో.. ప్రధానిగా ఉన్న షేక్‌హసీనా పదవి నుంచి వైదొలిగిన విషయం తెలిసిందే. తర్వాత నుంచి ఆమె భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. జులై 15 నుంచి ఆగస్టు 5 వరకు జరిగిన మారణహోమం, ఇతర నేరాల ఆరోపణలపై హసీనాకు వ్యతిరేకంగా ఐసీటీకి 60 ఫిర్యాదులు అందాయి. వాటిపై ట్రైబ్యునల్ ఇటీవల దర్యాప్తు ప్రారంభించింది. భారత్‌లో ఆశ్రయం పొందుతున్న ఆమెను బంగ్లాదేశ్‌కు రప్పిస్తామని, ఆమెపై అరెస్టు వారెంట్లు జారీ చేస్తామని ఐసీటీ నూతన ప్రాసిక్యూటర్ పేర్కొన్న సంగతి తెలిసిందే. ఆమెను స్వదేశానికి రప్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఈ క్రమంలోనే తాజా పరిణామం చోటుచేసుకుంది.హసీనా పాలనపై తీవ్ర నిరసన వ్యక్తంచేసిన విద్యార్థి సంఘాలు ఆమె భారత్‌లో ఉండటాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఇదిలాఉంటే.. హసీనాను చట్టబద్ధంగా తమ దేశానికి అప్పగించాలంటూ బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) భారత ప్రభుత్వాన్ని డిమాండు చేసిన సంగతి తెలిసిందే. మరోపక్క ఆమె దౌత్య పాస్‌పోర్టు రద్దయిన సంగతి తెలిసిందే. హసీనా హయాంలో ఎంపీలకు జారీ చేసిన దౌత్య పాస్‌పోర్టులను రద్దు చేసినట్లు బంగ్లా హోం మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ పాస్‌పోర్టు ఉన్నవారు కొన్ని నిర్దిష్ట దేశాలు వీసా లేకుండా ప్రయాణించే వీలు ఉంటుంది. ఆగస్టు 5న పదవి నుంచి దిగిపోయి భారత్‌కు చేరుకున్న తర్వాత బహిరంగంగా ఎక్కడా కనిపించలేదు.ఇదిలా ఉంటే.. హసీనాను బంగ్లాకు రప్పించడానికి యూనస్ ప్రభుత్వం అన్ని యత్నాలు చేస్తుందని ఆ దేశ విదేశీ వ్యవహారాల శాఖ గతంలో పేర్కొంది. హసీనాను అప్పగించాలా, వద్దా అనే విషయంపై నిర్ణయం తీసుకోవాల్సిన బాధ్యత భారత్‌పైనే ఉందని వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే.

# బాంబు బెదిరింపులపై కేంద్రం సీరియస్

(మొదటిపేజీ తరువాయి)

అధికారి తెలిపారు.గత నాలుగు రోజుల్లో 20పైగా విమానాలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. వీటిలో జాతీయ, అంతర్జాతీయ విమానాలు కూడా ఉన్నాయి. వీటిపై చేపట్టిన విచారణలో అవన్నీ నకిలీవని తేలాయి. దీంతో ఇలాంటి పనులు చేసే ఆకతాయిలను అడ్డుకొనేందుకు పౌర విమానయానశాఖ నడుంబిగించింది. వారిని నో- ఫ్లై లిస్ట్‌లో యాడ్ చేయాలని చూస్తోంది. అంతే కాదు అలాంటి వారికి కఠిన శిక్షలు వేసేలా 'బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ' లో మార్పులు తీసుకురావాలని యోచిస్తోంది. ఈ నిబంధనల్లో మార్పులు చేసేందుకు అభిప్రాయాలను సేకరిస్తోంది.విమానంలో వికృత చేష్టలకు పాల్పడిన వారికి వ్యతిరేకంగా పలు నిబంధనలు ఉన్నాయి. అయితే సోషల్‌మీడియా నుంచి వచ్చే బాంబు బెదిరింపులు లాంటి సందర్భాలు ఎదురైతే శిక్షించేందుకు ఎలాంటి నిబంధనలు లేవు. తరచూ ఈ తరహా ఘటనలు ఎదురవుతున్న నేపథ్యంలో వీటి కోసం ప్రత్యేక నిబంధనలు తీసుకొచ్చేందుకు కేంద్రం చూస్తోంది. ఇక నకిలీ బాంబు బెదిరింపులపై పోలీసులు చర్యలు తీసుకుంటున్న విషయం తెలిసిందే.

# సూపర్ సిక్స్ పథకాలు ఏమయ్యాయి..?

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. 'నిన్నటి క్యాబినెట్ మీటింగ్‌లో సూపర్ సిక్స్‌లో ఒక్క సిక్స్ గురించి అయినా చర్చిస్తారు. ఒక్కటైనా అమలు చేస్తారని అనుకున్నాం. మహిళలకు శుభవార్త చెప్తారని అనుకున్నాం. ఉచిత సిలిండర్లు, ఆర్టీసీలో ఉచిత ప్రయాణం ఈ రెండూ లో బడ్జెట్ స్కీమ్‌లు. వీటిని అమలు చేస్తారని భావించాం. కానీ, ఎక్కడా వాటిని ప్రస్తావించలేదు. బాబు సూపర్ సిక్స్‌లు గాలికి కొట్టుకు పోయాయి. కొత్తగా సిక్స్ పాలసీలు వచ్చాయి. కొత్త పరిశ్రమలు వస్తే మంచిదే. పెట్టుబడులు రావాలి. ఉద్యోగాలు రావాలి. రూ. 30 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకువస్తామన్నారు. 20 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. జాబ్ ఫస్ట్ అనేది తమ నినాదం అని సీఎం చంద్రబాబు చెప్పారని షర్మిల గుర్తు చేశారు. 'మాటలన్నీ బాగానే చెప్పారు. కానీ, ఇక్కడే బిలియన్ డాలర్ల ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఇవన్నీ అమలు చేసే చిత్తశుద్ధి ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఉందా? 2014లో పెద్ద పెద్ద పథకాలు అన్నారు. అమరావతిని సింగపూర్ అన్నారు. 3ఆ గ్రాఫిక్స్ చూపించారు. అప్పుడు చెప్పిన వాటికి, ఇప్పుడు చెప్పిన వాటికి తేడా లేదు. పాత సినిమాకి కొత్త టైటిల్ పెట్టారు. చంద్రబాబు చెప్తుంటే ఈ కథ ఎక్కడో విన్నట్లుంది అనిపించింది. పాత గిఫ్ట్ కొత్త బాక్స్‌లో ఇస్తున్నారు. ఇవి అమలు అవుతాయా లేదా అనే అనుమానాలు ఉన్నాయని సందేహం వ్యక్తం చేశారు. 'సీఎం చంద్రబాబును ఒక విషయంలో స్వాగతిస్తున్నాం. జాబ్ ఫస్ట్ అనే నినాదం మంచిదే. రాష్ట్రంలో నిరుద్యోగం తారాస్థాయిలో ఉంది. ఉద్యోగాలు లేక వలసలు పోతున్నారు. గత 10 ఏళ్లుగా పరిశ్రమలు లేక యువత వలసలు వెళ్ళింది. రాష్ట్రానికి నిరుద్యోగం అతి పెద్ద సమస్య. నిన్న చంద్రబాబు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం అన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగులు 50 లక్షల మంది ఉన్నారు. ఈ లెక్కన బాబు చెప్పినట్లు ఏడాదికి 4 లక్షల ఉద్యోగాలు ఇస్తే..5 ఏళ్లలో 20 లక్షలు ఇస్తారు. ఏడాదికి 4 లక్షల ఉద్యోగాల కల్పన జరిగితే మిగతా వాళ్ల సంగతి ఏంటి..? ఉద్యోగాలు అని గతంలో మోడీ బీజేపీ ప్రభుత్వం కూడా మోసం చేసింది. 20 కోట్ల ఉద్యోగాలలో మనకు ఎన్ని వచ్చాయి ? ఒక్క ఉద్యోగం ఇవ్వని మోడీకి ఎందుకు చంద్రబాబుకు మద్దతు ఇస్తున్నారు ? రాష్ట్రంలో మీరు ఇచ్చే 20 లక్షలకు తోడు మరో 30 లక్షల ఉద్యోగాలు మోడీ ఇవ్వాలి. ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వాన్ని సీఎం చంద్రబాబు డిమాండ్ చేయాలి. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు ఇద్దరు కలిసి కూర్చొని ఉద్యోగాల కల్పన పై వైట్ పేపర్ రిలీజ్ చేయాలి.' అని షర్మిల డిమాండ్ చేశారు.'రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని ఉద్యోగాల కల్పన చేస్తామని చెప్పిందో.. ప్రధాని మోదీ కూడా అన్ని ఉద్యోగాలు ఇవ్వాలి. రాష్ట్రంలో ప్రభుత్వ శాఖల పరిధిలో దాదాపు 3 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ఎప్పుడు చేస్తారో శ్వేత పత్రం విడుదల చేయాలి. గత 10 ఏళ్లుగా ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ కావడం లేదు. మొత్తం ఎన్ని ఖాళీలు ఉన్నాయనేది తేల్చాలి. జాబ్ క్యాలెండర్ ప్రకారం అన్ని పోస్టులు భర్తీ చేయాలి. ప్రత్యేక హోదా ఉన్న ఉత్తరాఖండ్‌లో 2 వేల పరిశ్రమలు వచ్చాయి. హిమాచల్ ప్రదేశ్‌లో దాదాపు 10 వేల పరిశ్రమలు వచ్చాయి. మరి హోదా మీద మోదీ ఇచ్చిన మాట ఎక్కడ పోయింది? పోలవరం నాది భాధ్యత అని మోదీ అన్నారు. అమరావతిని న్యూ ఢిల్లీని మించిన రాజధానిని చేస్తామన్నారు. చేతిలో మట్టి కొట్టి పోయాడు తప్పితే ఒక్క రూపాయి ఇవ్వలేదు. వెనుక బడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీలు అన్నారు.. ఇవ్వలేదు. విశాఖ స్టీల్‌కి ఒక్క క్యాపిటల్ మైన్ ఇస్తే మోదీకి జరిగే నష్టం ఏముంది..? ఇదే విషయాన్ని ప్రధాని మోదీని మంత్రి లోకేష్ అడగాలి.' అని షర్మిల డిమాండ్ చేశారు. 'సూపర్ సిక్స్ పాలసీలు సరే.. సూపర్ సిక్స్ పథకాలు ఎక్కడికి పోయాయి. 20 లక్షల ఉద్యోగాలు అని అన్నారు. అంటే నిరుద్యోగ భృతి ఉన్నట్లా ? లేనట్లా ? నిరుద్యోగ భృతి మీద 2014 లోనే మీరు రూ. 2 వేలు ఇస్తాం అన్నారు. ఇప్పుడు రూ. 3 వేలు అంటున్నారు. ఇంత వరకు భృతిపై జాడ లేదు. తల్లికి వందనం నిధుల కోసం పిల్లలు ఎదురు చూస్తున్నారు. మహాలక్ష్మి పథకం కింద 15 వందలు అన్నారు.. ఏమయ్యింది ? ఉచిత సిలిండర్లకు దసరా అన్నారు.. దీపావళి అన్నారు.. రేపు సంక్రాంతి అంటారేమో.. ఇది చాలా తక్కువ బ్జడెట్ పథకం. ఏడాదికి రూ. 2 వేల నుంచి రూ. 4 వేల కోట్లకు ఖర్చు అయ్యే పథకానికి నిధులు లేవా? ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఏమయ్యింది ? వైఎస్ జగన్‌కి తెలియదేమో.. హర్యానా ఎన్నికలతో ఏపీనీ ఎలా పోలుస్తారు ? ఏపీలో ప్రజల నాడికి అనుకూలంగా ఫలితాలు వచ్చాయి. హర్యా నాలో ప్రజల నాడికి వ్యతిరేకంగా తీర్పు వచ్చింది. ఏపీలో ఫలితాలు అనుకున్నట్లే వచ్చాయి. జగన్ ప్రభుత్వాన్ని ప్రజలు ఛీదరిం చుకున్నారు. లిక్కర్ విషయంలో జగన్‌కి, చంద్రబాబుకు పెద్దగా తేడా ఏమీ లేదు. జగన్ హయంలో లిక్కర్ మాఫీయా, తాడేపల్లి ప్యాలెస్‌కి లింక్ ఉంది. చంద్రబాబు హయాంలో నియోజకవర్గంలోని తమ్ముళ్ల చేతుల్లోకి మాఫియా ఉంది. ఇద్దరూ దొందూ దొందే. లిక్కర్ విషయంలో మొత్తం మాఫియా రాజ్యమే.'



# వాహనాలతో తిరుమలలో పర్యావరణ సమస్యలు

## ఇంటిగ్రేటెడ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌పై టిటిడి దృష్టి..

**తిరుమల,అక్టోబరు 17 (ఆంధ్రపత్రిక):**తిరుమలలో పర్యావరణ సమస్యలతో పాటు వాహనాల రాకపోకలు నానాటికీ పెరుగుతున్న దృష్ట్యా తిరుమల ఇంటిగ్రేటెడ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (టిఐటిఎంఎస్) తక్షణమే అవసరమని టీటీడీ అడిషనల్ ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి అన్నారు.

గురువారం తిరుమలలోని అన్నమయ్య భవనంలో సీవీఎస్‌వో శ్రీధర్, ఎస్పీ సుబ్బరాయుడుతో కలిసి ట్రాఫిక్ నిర్వహణపై సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. ట్రాఫిక్ నిర్వహణకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక ప్రణాళికలను తయారు చేయాలని పేర్కొన్నా రు. టీటీడీ కాప్స్, తిరుమల పోలీస్, ఆర్టీఏ, టౌన్ ప్లానింగ్, ఏపీఎస్ ఆర్టీసీ, ఇంజినీరింగ్, రెవెన్యూ, జీఎం ట్రాన్స్‌పోర్ట్ సభ్యులుగా ఉన్న కో-ఆర్డినేషన్ కమిటీని తక్షణమే ఏర్పాటు చేయాలని సూచించారు. ట్రాఫిక్ సమస్యలను అంచనా వేసి వారంలోగా సిఫార్సులు అందజేయాలని కోరారు. తిరుమలలో ట్రాఫిక్ రద్దీ పాయింట్లయిన గోకులం, ఏటీసీ, రాంభగీచా, తదితర ప్రాంతాలను గుర్తించాలని, దర్శనం వచ్చే భక్తుల కోసం నిర్దిష్ట మార్గాలు, పార్కింగ్ స్థలాలను కేటాయించాలని సూచించారు.

ట్రాఫిక్ రద్దీని నివారించడానికి అదనపు బలగాల కేటాయింపు, అన్ని భవిష్యత్ నిర్మాణాలలో, మల్టీ-లెవల్ పార్కింగ్ సౌకర్యాలు తప్పనిసరి చేయాలని అన్నారు. డిజిటల్‌తో ట్రాఫిక్, పార్కింగ్ అప్‌డేట్‌ల కోసం ప్రత్యేకమైన మొబైల్ యాప్‌ను తయారు చేయాలని వెల్లడించారు.

# ఏపీలో పెట్టుబడులకు వేట



## 25 నుంచి మంత్రి లోకేశ్ అమెరికా పర్యటన

## ఐటి సినర్జీ కాన్ఫరెన్స్‌కు హాజరు..

**అమరావతి, అక్టోబర్ 17 (ఆంధ్రప్రత్రిక):**ఏపీలో పెట్టుబడులపై ఈ నెల 25 నుంచి మంత్రి నారా లోకేశ్ అమెరికాలో పర్యటించనున్నారు. నవంబర్ ఒకటో తేదీ వరకు శాన్‌ఫ్రాన్సిస్‌కో నగరంలో లోకేశ్ పర్యటించనున్నారు. ఈ నెల 25 తేదీన అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్‌కోలో జరిగే ఐటీ సినర్జీ కాన్ఫరెన్సుకు మంత్రి హాజరు కానున్నారు. ఏపీలో పెట్టుబడులపై ప్రముఖ కంపెనీలతో మంత్రి లోకేశ్ భేటీ కానున్నారు. నారా లోకేష్ వెంట సీఎం అదనపు కార్యదర్శి కార్తికేయ మిశ్రా, ఏపీఈడీబీ సీఈఓ సాయికాంత్ వర్మ వెళ్లనున్నారు. అప్పటి వరకూ ఏపీఈడీబీ సీఈఓగా సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శి సురేష్ కుమార్‌కు ఆ బాధ్యతలను అప్పగించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు కొత్త పాలసీలతో ఇప్పటికే కూటమి ప్రభుత్వం ఆహ్వానం పలుకుతున్న సంగతి తెలిసిందే. బెస్ట్ పారిశ్రామిక పాలసీలతో ఏపీ ఇప్పుడు పెట్టుబడులకు సిద్దంగా ఉందంటూ ముఖ్యమంత్రి ట్వీట్ కూడా చేశారు. ఏపీలో కార్యకలాపాలకు పారిశ్రామికవేత్తలకు, పెట్టుబడిదారులకు రెడ్ కార్పెట్ స్వాగతం అంటూ ముఖ్యమంత్రి స్వాగతం పలికారు. సమర్థులైన యువత, స్నేహ పూర్వక ప్రభుత్వం, మౌళిక సదుపాయాలతో పెట్టుబడులకు ఏపీ స్వర్గధామం అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. పెట్టుబడులతో మీ వ్యాపారం పెరుగుతుంది. మా రాష్ట్రం వృద్ధి చెందుతుంది అంటూ పారిశ్రామికవేత్తలకు సీఎం ఆహ్వానం పలికారు. ఈ క్రమంలోనే లోకేశ్ అమెరికా పర్యటనకు ప్రాధాన్యత ఏర్పడింది. ఆయన మంత్రిగా బాధ్యత స్వీకరించిన తర్వాత తొలిసారి అమెరికా పర్యటనకు వెళ్తున్నారు. ఏపీలో పెట్టుబడులను తీసుకుని రావాలని తద్వారా ఏపీలో ఉపాధి కల్పన అవకాశాలను పెంచాలని కూటమి ప్రభుత్వం ఆలోచిస్తోంది.

# రూ.99 మద్యం షురూ



## సోమవారం నాటికి 20,000 కేసులకు చేరుకోనున్న సరఫరా

## ఈ నెలలో కోటి ఇరవై లక్షల క్వార్టర్ సీసాల మద్యం సిద్ధం

**విజయవాడ, అక్టోబరు 17 (ఆంధ్రపత్రిక):**రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిన విధంగా రూ.99లకు క్వార్టర్ బాటిల్ మద్యం అందుబాటులోకి వచ్చిందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ సంచాలకులు నిషాంత్ కుమార్ తెలిపారు. మద్యం తయారీ విక్రయాలలో జాతీయ స్థాయిలో పేరు ప్రతిష్టలు కలిగిన 5 సంస్థలు ఆంధ్రప్రదేశ్‌లో ఈ ధరకు మద్యం విక్రయాలు చేసేందుకు సిద్ధం అయ్యాయన్నారు. గురువారం నాటికి పదివేల కేసుల రూ.99 మద్యం మార్కెట్‌కు చేరిందని, సోమవారం నాటికి రోజువారీ సరఫరా 20వేల కేసులకు చేరుతుందని వివరించారు. దశల వారిగా సరఫరా పెరిగి ఈ నెలాఖరు నాటికి 2,40,000 కేసుల మద్యం రాష్ట్రంలో అందుబాటులో ఉంటుందని వివరించారు. ఈ క్రమంలో మొత్తంగా కోటి ఇరవై లక్షల క్వార్టర్ సీసాల మద్యం ఈ నెలలో అందుబాటులోకి రానుందన్నారు. వినియోగాన్ని అనుసరించి తదుపరి నెలలలో ఏ మేరకు దిగుమతి చేసుకోవాలన్న దానిపై నిర్ణయం తీసుకుంటామని నిషాంత్ కుమార్ వివరించారు.

## విమానాలకు వరుస బాంబు

# బెదిరింపులు

## పరిస్థితిని సమీక్షించిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు



**ముంబై,అక్టోబర్ 17:** వరస బాంబు బెదిరింపుల ఘటనలు భారత విమానయాన రంగంపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నాయి. వరసగా నాలుగో రోజు కూడా బాంబు బెదిరింపు వచ్చాయి. ముంబై నుంచి లండన్ వెళ్తున్న ఎయిర్ ఇండియా విమానం ల్యాండింగ్‌కి కొన్ని గంటల ముందు ఎమర్జెన్సీ సిగ్నల్స్‌ని పంపించినట్లు ఫ్లైట్ ట్రాకర్ ఫ్లైట్ రాడార్ 24 గురువారం తెలిపింది. విమానం 'స్క్వాకింగ్ 7700' కోడ్‌ని పంపించింది. ఇది సాధారణ అత్యవసర పరిస్థితిని తెలియజేస్తుంది. ముంబై నుంచి ఎయిర్ ఇండియా విమానం గురువారం ఉదయం 7.05 గంటలకు టేకాఫ్ అయింది. తూర్పు ఇంగ్లండ్ మీదిగా ప్రయాణించే సమయంలో అత్యవసర పరిస్థితిని ప్రకటించింది. ఈ రోజు 5 ఎయిర్ ఇండియా, రెండు విస్తారా, రెండు ఇండిగో విమానాలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. ఈ బాంబు బెదిరింపుల అంశంపై నిన్న పార్లమెంటరరీ స్టాండింగ్ కమిటీ సమావేశమైంది. దీనికి సివిల్ ఏవియేషన్ మినిస్ట్రీ, డీజీసీఏ అధికారులతో ఆ శాఖ మంత్రి రామ్‌మోహన్ నాయుడు సమావేశమయ్యారు. పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నామని, ప్రయాణీకులు భద్రతే తమ ప్రాధాన్యమని ఆయన అన్నారు. ఈ ఘటనలపై సమగ్ర నివేదిక పంపాలని పౌర విమానయాన మంత్రిత్వ శాఖను హోం మంత్రిత్వ శాఖ కోరింది.

# ప్రజలకు సేవ చేయడంలో ఎంజీఆర్ స్ఫూర్తి



## తమిళనాడు సుస్థిరాభివృద్ధికి ఎంజిఆర్ పునాది

## అన్నాడిఎంకె ఆవిర్భావం సందర్భంగా పవన్ ట్వీట్

**అమరావతి, అక్టోబరు 17 (ఆంధ్రపత్రిక):**తమిళనాడు సుస్థిరాభివృద్ధికి ఎంజీ రామచంద్రన్(ఎంజీఆర్) గొప్ప పునాది వేశారని ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. అన్నాడీఎంకే పార్టీ ఆవిర్భావ దిన్సోతవం సందర్భంగా ట్విట్టర్ వేదిక ద్వారా జనసేన తరఫున శుభాకాంక్షలు తెలిపారు. ఎంజీఆర్ పార్టీని స్థాపించి పేదలు, అన్నార్థులకు సాయం చేశారని, ఆయన పాలనలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమాన్ని ముందుకు తీసుకెళ్లారని ప్రశంసించారు. ప్రజల అవసరాలను గుర్తించడంతో పాటు భావితరాల బాగు కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారని వెల్లడించారు. ప్రజలకు సేవ చేయడంలో ఎంజీఆర్ స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకున్నానని అన్నారు. ఎంజీఆర్ వారసత్వాన్ని జయలలిత విజయవంతంగా కొనసాగించారని తెలిపారు. తమిళనాడు ప్రజలకు సేవ చేయడం, ఎంజీఆర్ ఆశయాలను నెరవేర్చడం, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం, రాష్టాన్ని అభివృద్ధి, సంక్షేమంలో ఉన్నత శిఖరాల వైపు పార్టీని నడిపించాలని కోరారు. తమిళ భాష, సంస్కృతి పట్ల నాకున్న గౌరవం, తమిళుల అలుపెరగని పోరాట పటిమంటే నాకు ఎప్పటినుంచో గౌరవమని అన్నారు.



# కౌలు రైతుల రుణాలపై సమీక్ష

**అమరావతి, అక్టోబర్ 17 (ఆంధ్రప్రత్రిక):**అమరావతిలోని సచివాలయం 5వ బ్లాక్‌లో రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం జరిగింది. మంత్రి అచ్చెన్నాయుడు అధ్యక్షతన ఈ ఎస్ఎల్బీసీ భేటీ జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర స్థాయి బ్యాంకర్లు, నాబార్డు అధికారులతో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు, డ్వాక్రా సంఘాలకు సహా వివిధ వర్గాలకు బ్యాంకర్లు అందించాల్సిన రుణాలపై సమీక్షించారు. ఇక, ప్రభుత్వం ప్రకటిస్తున్న పాలసీలకు బ్యాంకర్ల సహకారం అవసరమని మంత్రి చెప్పుకొచ్చారు. ముద్ర,వ్యవసాయ, పారిశ్రామిక రుణాలపై ప్రధానంగా చర్చించారు. ఇక, కౌలు రైతులకు రుణాల మంజూరులో ప్రత్యేకంగా కృషి చేయాలనే కోణంలో సమీక్ష నిర్వహించారు.

# సమస్యల నుంచి ప్రజల దృష్టిని మరల్చే యత్నం

## విచారణ అనంతరం మీడియాతో సజ్జల



**అమరావతి,అక్టోబరు 17 (ఆంధ్రపత్రిక):** ఏపీలో నెలకొన్న సమస్యల నుంచి ప్రజల దృష్టిని మరల్చడా నికి వైసీపీ నాయకులపై ప్రభుత్వం తప్పుడు కేసులు బనాయిస్తుందని వైసీపీ నాయకుడు సజ్జల రామకృష్ణారెడ్డి ఆరోపించారు. టీడీపీ కార్యాలయంపై దాడికేసులో మంగళగిరి పోలీస్‌స్టేషన్‌లో విచారణ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక ప్రజల సమస్యలను పరిష్కరించకుండా కేవలం వైసీపీ పార్టీకి చెందిన నాయకులపై దాడులు, అక్రమ కేసులు పెడుతూ, భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. సమస్యల నుంచి దృష్టిని మరల్చడానికి తప్పుడు వాంగ్మూలం సృష్టించి వారిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి విచారిస్తున్నారని మండిపడ్డారు. ఘటన జరిగిన రోజున బద్వేలులో జరుగుతున్న ఉప ఎన్నికల్లో ఉన్నానని, దాడికేసులో తన ప్రమేయం లేదని పేర్కొన్నారు. వైసీపీ నాయకులు స్వేచ్ఛగా తిరుగకుండా ఆటంకాలు కలిగిస్తున్నారని ఆరోపించారు.

# తిరిగి వైసీపీలోకి టిడిపి నేత చేరిక

## జగన్ సమక్షంలో కండువా కప్పుకున్న మురళీకృష్ణంరాజు



**కాకినాడ,అక్టోబరు 17 (ఆంధ్రపత్రిక):**ఇటీవల జరిగిన ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సిపి పార్టీ ఘోరంగా ఓడిపోయి,. ఆ పార్టీ కేవలం 11 సీట్లకే పరిమితమైంది. దీంతో ఆ పార్టీలో నేతలు అధికారంలో ఉన్న టిడిపి, జనసేన పార్టీలోకి చేరుతున్నారు. అయితే అందుకు భిన్నంగా కాకినాడ జిల్లా టిడిపి కీలక నేతగా ఉన్న ముదునూరి మురళీకృష్ణంరాజు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి.. గురువారం వైఎస్సార్‌సిపి పార్టీలో చేరి అందరికీ షాకిచ్చారు. వైఎస్సార్‌సిపి పార్టీలోకి చేరిన మురళృకృష్ణంరాజుకి ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్తిపాడు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలోపేతం కోసం పనిచేస్తానని మురళీకృష్ణంరాజు చెప్పారు. ముదునూరి మురళీకష్ణంరాజు 2023 ఏప్రిల్‌లో వైఎస్సార్‌సీపీని వీడి టీడీపీలో చేరారు. ఆయన్ను టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా, అమలాపురం నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడిగా నియమించారు. ఇప్పుడు ఆయన వైసీపీలో చేరటం చర్చనియాంశంగా మారింది.



ఆంధ్రపత్రిక ఫోటో: సిహెచ్.విజయభాస్కర్

గురువారం విజయవాడలో జరిగిన సుజనా ఫౌండేషన్ విజయదీపం ఆవిష్కరణ కార్యక్రమంలోపాల్గొన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, రాజమండ్రి ఎంపీ దగ్గుపాటి పురంధేశ్వరి, విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే వై.సత్యనారాయణ చౌదరి, బీజేపీ నేత సోము వీర్రాజు

# ఎస్.పీ.ఏ.వీ. ఎనిమిదో స్నాతకోత్సవంలో యూజీ, పీజీ, పీహెచ్‌డీ స్కాలర్లకు 253 డిగ్రీలు ప్రదానం







**విజయవాడ, అక్టోబరు 17 (ఆంధ్రపత్రిక):** భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన జాతీయ ప్రాముఖ్యత కలిగిన ఇన్స్టిట్యూట్ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ విజయవాడ 17.10.2024 న ఎనిమిదవ స్నాతకోత్సవం నిర్వహించింది, ఇక్కడ 253 మంది విద్యార్థులకు వారి డిగ్రీలను ప్రదానం చేశారు. వీరిలో బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ విద్యార్థులు 81 మంది, బ్యాచిలర్ ఆఫ్ ప్లానింగ్ విద్యార్థులు 28 మంది, మాస్టర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (సస్టెయినబుల్ ఆర్కిటెక్చర్) విద్యార్థులు 23 మంది, మాస్టర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (ల్యాండ్ స్కేప్ ఆర్కిటెక్చర్) విద్యార్థులు 17 మంది, మాస్టర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (ఆర్కిటెక్చరల్ కన్జర్వేషన్) విద్యార్థులు 08 మంది, బిల్డింగ్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్ మెంట్ విద్యార్థులు 20 మంది, మాస్టర్ ఆఫ్ అర్బన్ డిజైన్ విద్యార్థులు 19 మంది, మాస్టర్ ఆఫ్ ప్లానింగ్ (ఎన్విరాన్ మెంటల్ ప్లానింగ్ అండ్ మేనేజ్ మెంట్) విద్యార్థులు 16 మంది ఉన్నారు. మాస్టర్ ఆఫ్ ప్లానింగ్ (ట్రాన్స్ పోర్టేషన్ అండ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ప్లానింగ్) విద్యార్థులు 16 మంది, మాస్టర్ ఆఫ్ ప్లానింగ్ (అర్బన్ అండ్ రీజినల్ ప్లానింగ్) విద్యార్థులు 24 మంది, డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ విద్యార్థులు 01 మంది ఉన్నారు. ఈ స్నాతకోత్సవంలో 2023-24 సంవత్సరానికి గాను 10 మంది గ్రాడ్యుయేట్లకు బంగారు పతకాలు, ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్‌లో యూజీ, పీజీ విద్యార్థులకు 10 ఉత్తమ థీసిస్ అవార్డులను ప్రదానం చేశారు. 2022-23 విద్యాసంవత్సరానికి గాను ఎస్ పీఏవీ సాధించి న అన్ని కీలక విజయాల సమగ్ర ఇన్ స్టిట్యూట్ రిపోర్టును ఎస్పీఏవీ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ రమేశ్ సిరికొండ అందజేసి గ్రాడ్యుయేట్లను అభినందించారు. ఎస్‌పీఏ విజయవాడ క్యాంపస్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ దేశంలోనే అత్యుత్తమమని ఉద్ఘాటించారు. ఈ పాఠశాల అనేక విద్యా విజయాలకు సాక్ష్యంగా నిలిచింది. ఔట్ రీచ్ పరంగా, ఎస్ పిఏ విజయవాడ అనేక ప్రఖ్యాత జాతీయ మరియు అంతర్జాతీయ సంస్థలు మరియు సంస్థలతో అవగాహన ఒప్పందం (ఎంఒయు) కలిగి ఉంది-సోలెంట్ విశ్వవిద్యాలయం, యుకెబీ మెల్బోర్న్ విశ్వవిద్యాలయం, ఆస్ట్రేలియా క్రెమ్స్ విశ్వవిద్యాలయం, ఆస్ట్రియా, మరియు యుఎన్-హాబిటాట్. ఇటీవలే ఫ్రాన్స్ లోని లిల్లీ విశ్వవిద్యాలయం, ఎకోల్ బ్లూ గ్లోబల్ డిజైన్, అమెరికాలోని బోస్టన్ కాలేజ్ ఆఫ్ ఆర్కిటెక్చర్‌లతో ఎస్ పీఏవీ అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. అదేవిధంగా, ఎస్ పిఏ విజయవాడ కేరళ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ లోకల్ అడ్మినిస్ట్రేషన్ (కిలా), ఐఐటి తిరుపతి, బెంగళూరులోని బిఎంఎస్ కాలేజ్ ఆఫ్ ఆర్కిటెక్చర్ లతో అకడమిక్ మరియు రీసెర్చ్ సహకారం కోసం సహకార ఒప్పందం కుదుర్చుకుంది. గత విద్యాసంవత్సరంలో విద్యార్థులు సాధించిన వివిధ అవార్డులు, గుర్తింపుల గురించి ప్రస్తా వించారు. అదనంగా, బోధన-అభ్యసన బోధనా విధానంలో, ఎస్ పీఏవీ విక్సిత్ భారత్‌ఏ2047 అనే థీమ్‌పై తన పనిని ప్రారంభిం చింది. ఈ సందర్భంగా ప్రతి విద్యార్థికి, వారి తల్లిదండ్రులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఎస్ పీఏ విజయవాడలో విద్యార్థులు, తల్లిదండ్రులు చూపిన పట్టుదల, ఓర్పు అవగాహన, నమ్మకాన్ని ఆయన నిజంగా అభినందించారు.

విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ 8వ స్నాతకోత్సవం సందర్భంగా ఢిల్లీలోని డిజైన్ యాక్షన్ గ్రూప్, కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (సీఓఏ) ఇండియా మాజీ అధ్యక్షుడు ఏఆర్ ప్రేమేంద్ర రాజ్ మెహతా గ్రాడ్యుయేట్లు, గర్వించదగిన తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. గ్రాడ్యుయేషన్ అనేది ప్రతి ఒక్కరి జీవితంలో కీలక ఘట్టమని ఆయన అభిప్రాయపడ్డారు. ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్ వృత్తి అనేక విధాలుగా అసాధారణమైనది. ఈ రెండు వృత్తుల ద్వారా ఇళ్లు, కార్యాలయాలు, పార్కులు, షాపింగ్ కాంప్లెక్సు, వీధులు, రోడ్లతో సహా మన ఆవాసాలను డిజైన్ చేసుకోవచ్చు. నా దృష్టిలో మీరు కేవలం గ్రాడ్యుయేట్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్లు, డాక్టరేట్లు మాత్రమే కాదు. మీరు ఇప్పుడు డిగ్రీతో వచ్చే జవాబుదారీతనాన్ని అప్పగించిన నిపుణులు, ప్లానింగ్ మరియు ఆర్కిటెక్చర్ రంగంలో సృజనాత్మక అవకాశాల యొక్క కొత్త డొమైన్‌లోకి మిమ్మల్ని నడిపిస్తారన్నారు.

స్నాతకోత్సవానికి ఎస్ పీఏ విజయవాడ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ చైర్మన్ డాక్టర్ అమోగ్ కుమార్ గుప్తా అధ్యక్షత వహించి డిగ్రీలు పొందిన గ్రాడ్యుయేట్లను అభినందించారు. గ్రాడ్యుయేట్ల వృత్తిపరమైన జీవితం ఇక్కడి నుంచి లేదా ఉన్నతంగా సాగుతుందని ఆయన సూచించారు. గ్రాడ్యుయేషన్ తర్వాత వృత్తి జీవితం ఏ మార్గంలో పయనిస్తుందో వివరిస్తూ, సమాజంలోని ఉన్నత ప్రమాణాలకు అనుగుణంగా జీవించడానికి, సంపాదించిన జ్ఞానాన్ని ఉపయోగించడమే కాకుండా, తన కోసం సృష్టించుకున్న సమస్యలకు సులభమైన పరిష్కారాలను కనుగొనాలని నొక్కి చెప్పారు. ఏఆర్ డాక్టర్ అమోఘ్ కుమార్ గుప్తా మాట్లాడుతూ ఏ ఆధునిక సమాజంలోనైనా ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్ వృత్తికి గొప్ప, లోతైన ప్రాముఖ్యత ఉందన్నారు. ఆర్కిటెక్చర్ మరియు ప్లానింగ్ ద్వారా, ప్రతి గ్రాడ్యుయేట్ జీవితాంతం మన జీవన వాతావరణాన్ని ప్రభావితం చేయడానికి మరియు వాటిని ప్రకృతి అనుకూలమైన, ఖర్చుతో కూడిన, స్థిరమైన మరియు స్థానికంగా సంబంధితంగా మార్చడానికి అవకాశం లభిస్తుందన్నారు. ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ రంగంలో దేశ పురోగతికి దోహదం చేయడానికి ఎస్ పీఏవీ కట్టుబడి ఉందని ఎస్ పీఏవీ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ రమేశ్ సిరికొండ పేర్కొన్నారు. ఈ స్నాతకోత్సవానికి భారతదేశం నలుమూలల నుండి ప్రసిద్ధ ఆర్కిటెక్ట్‌లు మరియు ప్లానర్లతో సహా 400 మందికి పైగా హాజర య్యారు. భారత ప్రభుత్వం తరపున ఇతర సీనియర్ ప్రముఖులు, సెనేట్ సభ్యులు కూడా హాజరయ్యారు.

Printed and Published by KANCHARLA RAMAIAH on behalf of Nageswara Rao Estates Private Limited,Printed at Jagati Publications Limited, Sakshi Press, SY.No.481, Phase-2, Jawahar Autonagar, Vijayawada-520007 Andhra Pradesh, and Published from D.NO.29-28-34, Dasari vari street, Suryaraopeta,Vijayawada-520002, KRISHNA DISTRICT-ANDHRA PRADESH, Editor : KANCHARLA RAMAIAH. Excutive editor V.VIJAYALAKSHMI. RNI no. 10721/65 Mobile:9849998069, Email:andhrapatrikadaily@gmail.com